శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★





సిఎఎ, పరిశ్రమలే కీలకాంశాలు 3లో


ఆదివారం | 19-05-2024 | హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 329 | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


# 'మేడిగడ్డ' పనులు షురూ

### బ్లాక్-7లోని 8 గేట్లు ఎత్తేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులు ప్రారంభం

### ఇప్పటికే ఒక గేటును ఎత్తిపెట్టిన అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

మేడిగడ్డ ప్రాజెక్టు రక్షణ పనులు ప్రారంభమయ్యాయి. వర్షాకాలంలో బరాజ్ వద్ద చేపట్టాల్సిన రక్షణ చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) నిపుణుల కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఎల్ అండ్ టి పనులను ప్రారంభించింది. వరద ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూడాలని, గేట్లను తెరిచి ఉంచాలని, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే ఇసుక మేటలు, రాళ్లను తొలగించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిన క్రమంలో పనులు ఆ మేరకు మొదలుపెట్టారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వెంటనే పనులను చేపట్టాలని ఎల్ అండ్ టి సంస్థకు ఇరిగేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో మేడిగడ్డ బ్లాక్ 7లోని 8 గేట్లను ఎత్తేందుకు పనులు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ పరంగాను నీటి అవసరం ఉన్న నేపథ్యంలో తరువాయి 2లో



### 'కాళేశ్వరం' ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై సిఎం రేవంత్ ఆరా

పలువురు మంత్రులతో చర్చ..

త్వరలోనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందని వెల్లడి

ప్రజాపక్షం / హైదరాబాద్

త్వరలోనే మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను, అక్కడి పంప్ హౌస్‌లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుఅంశంపైన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికలోని సిఫారసులు, ప్రభుత్వం తదుపరి చేపట్టాల్సిన చర్యలపైనా భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డితో తరువాయి 2లో



### ఇంజనీరింగ్‌లో 74.98, అగ్రికల్చర్ ఫార్మసీలో 89.66 శాతం

## ఇఎపి సెట్ ఫలితాలు విడుదల

ఇంజనీరింగ్‌లో సత్తాచాటిన బాలురు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈ ఎపిసెట్ (టిజి ఎంసెట్) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ విభాగంలో 74.98 శాతం,అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 89.66 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, జెఎన్‌టియుహెచ్ విసి కట్టా నరసింహారెడ్డితో కలిసి విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రవెంకటేశం ఎపిసెట్ ఫలితాలను విడుదల చేశారు. వారం రోజుల్లోనే అడ్మిషన్ షెడ్యూల్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో మొదటి రెండు ర్యాంకులు ఎపి విద్యార్థులు సాధించారు. ఇంజినీరింగ్ ర్యాంకుల్లో బాలురు సత్తా చాటారని, తొలి పది ర్యాంకుల్లో తొమ్మిదింటిని కైవసం చేసుకున్నారని బుర్ర వెంకటేశం ఆయన వివరించారు. ఎంసెట్‌లో ఒక్కో షిఫ్ట్‌లో 25,000ల మంది మాత్రమే పరీక్ష రాసేవారని, కానీ ప్రస్తుతం ఒక్కో షిఫ్ట్‌లో 50,000ల మంది పరీక్ష రాసినట్లు వివరించారు. ఫలితాలను చూసి విద్యార్థులు ఆందోళన చెందవద్దని సూచించారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 91,633 మంది విద్యార్థులు హాజరవ్వగా 82,163 ( 89.66 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో తరువాయి 2లో

# కేబినెట్ సమావేశం వాయిదా

### ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి రాకపోవడమే కారణం

### చర్చకు నోచుకోని రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, తదితర కీలక అంశాలు

### ఇసి నుంచి ఎప్పుడు అనుమతి వస్తే అప్పుడే కేబినెట్ సమావేశం

### సోమవారం లోపు ఇసి నుంచి అనుమతి రాకపోతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్ళాలని సిఎం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్నికల కమిషన్ అనుమతి రానందున రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం కేబినెట్ సమావేశం నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మంత్రివర్గ సమావేశానికి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి కోరింది. కానీ శనివారం రాత్రి వరకు ఇసి నుంచి అనుమతి రాలేదు. ఇసి నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో శనివారం జరగాల్సిన కేబినేట్ భేటీ నిలిచిపోయింది. ఇసి ఇసి నుంచి ఏ క్షణమైన అనుమతి వస్తుందని మంత్రులు అందరూ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సచివాలయంలో వేచి ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని విభాగాల అధికారులు కేబినేట్ భేటీకి హాజరయ్యేందుకు ఆఫీసులకు చేరుకున్నారు. కానీ రాత్రి 7 గంటల వరకు ఇసి నుంచి స్పందన లేకపోవటంతో కేబినేట్ భేటీ జరగలేదు. సిఎంతో పాటు మంత్రులు వెనుదిరిగి వెళ్లారు. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన విషయాలపై ఈ మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని ఎజెండా సిద్ధం చేసుకున్నారు. కానీ ఇసి నుంచి స్పందన లేకపోవటంతో రైతుల సంక్షేమం, అత్యవసరమైన అంశాలపై తరువాయి 2లో



## మత స్వేచ్ఛను కాపాడుతాం

### 'ఇండియా' కూటమి నేతల ప్రకటన

### ప్రధాని మోదీ బుల్డోజర్ వ్యాఖ్యలపై మండిపాటు

**ముంబయి :** ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామ మందిరాన్ని బుల్డోజ్ చేస్తుందంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ఇండియా కూటమి నేతలు మండిపడ్డారు. పౌరల మతపరమైన స్వేచ్ఛను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని, రాజ్యాంగం ప్రకారం దేశం ప్రకారం నడవాలన్నారు. ఖర్గే, శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే, ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ సంయుక్తంగా శనివారం ముంబయిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మే 20న రాష్ట్రంలో చివరి దశ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి చివరి రోజున కూటమి నేతలు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్‌డోజ్ చేస్తుందని, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు కోటాను తగ్గిస్తుందని, ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తారని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలపై కూటమి నేతలు స్పందించారు. కాంగ్రెస్ ఎన్నటికీ చేయని సమస్యలపై ప్రధాని మోదీ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఖర్గే ఆరోపించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని ఇండియా కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని థాక్రే అన్నారు. దేవాలయాలను మాత్రమే కాకుండా అన్ని మతాల ప్రార్థనా స్థలాలను రక్షించడం తమ ప్రభుత్వ కర్తవ్యమని పవార్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు అలాగే ఉంటాయని ఖర్గే చెప్పారు. తాము ఎవరిపైనా బుల్డోజర్ ప్రయోగించలేదని, కాంగ్రెస్ ఎన్నటికీ చేయని, అమలు చేయడం సాధ్యంకాని వాటిపై ప్రజలను ఉసిగొల్పడం మోదీకి అలవాటైపోయిందన్నారు. ఆర్టికల్ 370కి సంబంధించి పార్టీ వైఖరిపై అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ... మోదీకి తాము సమాధానం చెప్పమన్నారు. తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన వాటిని అమలు చేస్తామన్నారు. తాము తరువాయి 2లో

# 22న బంగాళాఖాతంలో అల్పపీడనం

### 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 23వ తేదీ నుంచి మోస్తరు నుంచి అతిభారీ వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తోన్న విషయం తెలిసిందే. ఈనెల 23వ తేదీ వరకు మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి కొమరిన్ ప్రాంతం వరకు కొనసాగిన ఆవర్తనం శనివారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందన్నారు. శుక్రవారం రాయలసీమ, పరిసర ఉత్తర తమిళనాడు ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్న చక్రవాతపు ఆవర్తనం శనివారం బలహీనపడిందన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు, ఆది, సోమవారం అక్కడ అక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు, ఆదివారం, సోమవారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–40 కిలోమీటర్ల తరువాయి 2లో



## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం

### పలుచోట్ల ట్రాఫిక్ జామ్

### వనస్థలిపురం – చింతలకుంట వద్ద జాతీయ రహదారిపై భారీగా వరదనీరు

### పనామా–ఎల్‌బి నగర్ మధ్య స్తంభించిన రాకపోకలు

### అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులకు సిఎం ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో మళ్లీ భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఆ తర్వాత పెరిగింది. వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. జిహెచ్ఎంసి అత్యవసర బృందాలు రంగంలోకి దిగి, వరద నీరు డ్రెయిన్‌లలోకి పంపించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తరువాయి 2లో

# వేగంగా ధాన్యం కొనుగోలు

### రంగంలోకి దిగిన మంత్రులు, అధికార యంత్రాంగం

### మే చివరినాటికి కొనుగోళ్లు పూర్తి చేయడమే లక్ష్యం

### యాసంగిలో పండిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని రైతులకు ప్రభుత్వం భరోసా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా భారీగా కురుస్తున్న ఆకాల వర్షాల నేపథ్యంలో కల్లాలతో పాటు ఐకెపి కోనుగోలు సెంటర్లలో తడిసిన ధాన్యం ప్రతి గింజనూ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



ఈ వర్షాల కారణంగా ధాన్యం తడిసి తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులకు భరోసా కల్పించేందుకు మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా రంగంలోకి దిగింది.యాసంగిలో ఉత్పత్తి అయిన తడిసిన ధాన్యంతో సహా పూర్తిగా కొనుగోలు చేయాలని, అధికారులకు ఇప్పటీకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన అదేశాలు జారీచేశారు. ఇదే క్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డిలతో పాటు జిల్లాల ఇంఛార్జి మంత్రులు ధాన్యం కొనుగోళ్లపై సంబంధించి ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజువారీగా జిల్లా కలెక్టర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశం అవుతూ తాజా పరిస్థితులను తెలుసుకుని మిగిలిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన వెంటనే ధాన్యం కొనుగోలు చర్యలు ఊపందుకుకోవడమే కాకుండా మరోవైపు అకాల వర్షాల కారణంగా నష్ట పోయిన పంటల తరువాయి 2లో




కలిసి పనిచేద్దాం.... సమస్యలు పరిష్కరించుకుందాం 3లో




### ప్రజాశాంతి పార్టీ ఎమ్మెల్యే టికెట్ల

## మోసం రూ.కోట్లలో

### పదుల సంఖ్యలో బాధితులు

### కేసు దర్యాప్తులో వేగం పెంచిన పంజాగుట్ట పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎ పాల్‌కు పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన చీటింగ్ కేసులో ఉచ్చు భిగిస్తుంది. ఎంఎల్‌ఎ టికెట్ల వ్యవహారంలో మోసపోయిన బాధిత అభ్యర్థులు పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. గత ఏడాది జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని నమ్మించిన కెఎ పాల్ ఒక్కో అభ్యర్థి నుంచి రూ.20 లక్షల నుంచి రూ.రెండు కోట్ల వరకు తీసుక్నుట్లు సమాచారం. ఇలా సుమారు 85 మంది అభ్యర్థుల నుంచి రూ.కోట్లలో డబ్బులు తీసుకుని మోసగించినట్లు కెఎ పాల్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరికి తెలియకుండా మరోకరి వద్ద నుంచి ఎంఎల్‌ఎ టికెట్ బిఫాం ఇస్తానని రూ.కోట్లలో దండుకున్నాడు. ఇప్పటికే జిల్లెలగూడకు చెందిన వస్త్ర వ్యాపారి కిరణ్‌కుమార్ తనకు ఎల్‌బినగర్ అసెంబ్లీ సీటు ఇస్తానని రూ.57,50,200 డబ్బులు తీసుకుని మోసగించాడని పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.పంజగుట్టలో కెఎ పాల్‌పై నమోదైన చీటింగ్ కేసు విషయాన్ని మీడియా ద్వారా బయట పడటంతో అతని చేతిలో మోసపోయిన తరువాయి 2లో



## ఆస్తి కోసం తల్లి, కూతుళ్లను హతమార్చిన కసాయి

### రెండేళ్ల క్రితం భార్యను చంపి మరొకరితో సహజీవనం : ఖమ్మం జిల్లాలో ఘటన

ప్రజాపక్షం/ తల్లాడ



అక్రమ సంబంధ నేపథ్యంలో రెండేళ్ల క్రితం భార్యను హతమార్చాడు. ఆస్తి కోసం ఇప్పుడు కన్నతల్లిని, తన ఇద్దరు కుమార్తెలను హతమార్చాడు ఈ కసాయి. చెప్పి మరి హత్య చేసిన ఈ ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాల పేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ అమానవీయ ఘటన వివరాల్లోకి వెళితే... గోపాల పేట గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లుకు 12 ఏళ్ల క్రితం తరువాయి 8లో

## నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోండి..

### లైంగిక దౌర్జన్యం కేసుపై దేవెగౌడ

**బెంగళూరు :** కర్ణాటకలో జెడిఎస్ ఎంపి, మాజీ ప్రధాని దేవె గౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ కుంభకోణం కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు 92వ పుట్టినరోజు జరుపుకుంటున్న దేవెగౌడ తన మనవడు ప్రజ్వల్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై



తొలిసారి స్పందించారు. నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, లైంగిక వేధింపులు, మహిళ కిడ్నాప్ ఆరోపణలు ఎదుర్కొంటున్న తన కుమారుడు జెడిఎస్ ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణపై మాత్రం తప్పుడు కేసులు పెట్టారని మాజీ ప్రధాని ఆరోపించారు. 'ఈ కేసు కోర్టు తరువాయి 8లో

## ఎన్నికల్లో.. రూ.8,889 కోట్లు స్వాధీనం

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రలోభాల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల క్రమంలో చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.8,889 కోట్ల మేర విలువైన నగదు, మాదక ద్రవ్యాలు, ఇతర తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. జప్తు చేసిన సొత్తులో మాదక ద్రవ్యాలదే 45 శాతం వాటా అని, రూ.3,958 కోట్ల మేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. స్వాధీనం చేసుకున్న సొత్తులో నగదు రూపేణా రూ.849.15 కోట్లు, మద్యం (రూ.814.85 కోట్లు), మాదక ద్రవ్యాలు (రూ.3,958 కోట్లు), బంగారం, వెండి వంటి ఆభరణాలు (రూ.1,260.33 కోట్లు), ఇతర ఉచితాలు (రూ.2006.59 కోట్లు) ఉన్నట్లు ఈసీ తెలిపింది. మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల స్వాధీనంపై ఈసారి ప్రత్యేక దృష్టిసారించినట్లు పేర్కొంది. గుజరాత్ తరువాయి 8లో



## వియత్నాం అధ్యక్షుడిగా తో లామ్



**హనోయ్ :** వియత్నాం దేశాధ్యక్షుడుగా తో లామ్ ఎంపికయ్యారు. వియత్నాం ప్రజాభద్రతా మంత్రిగా పనిచేస్తున్న తో లామ్ (66)ను దేశ అధ్యక్షుడుగా వియత్నాం కమ్యూనిస్టుపార్టీ ఎంపిక చేసింది. 2016 నుండి తో లామ్ వియత్నాం ప్రజా భద్రతా మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దేశంలో అవినీతిపై పోరాటం చేసే సెంట్రల్ స్టీరింగ్ కమిటీకి కూడా ఆయన డిప్యూటీ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దేశాధ్యక్షుడు వో వాంగ్ థౌంగ్ గడచిన మార్చినెలలో రాజీనామా చేశాక కొత్త అధ్యక్షుడుగా లామ్ నియామకం జరిగింది. దేశంలో కమ్యూనిస్టుపార్టీ అవినీతిపై పెద్ద పోరాటం చేస్తున్నది. 1979 నుండి లామ్ దేశ రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. అనేక పతకాలు పొందారు.

## కిర్గిజిస్థాన్‌లో అల్లర్లు : భారత విద్యార్థులకు హెచ్చరిక

### ముగ్గురు పాకిస్తానీయుల మృతి



**బిష్కెక్ :** కొండలు, పర్వతాలమధ్య ఉన్న మధ్యాసియా దేశం కిర్గిజిస్తాన్‌లోని విశ్వవిద్యాలయాల్లో అల్లర్లు చెలరేగడంతో భారత్, పాకిస్తాన్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆ దేశాలు హెచ్చరికలు చేశాయి. ముఖ్యంగా వైద్యవిద్యాలయాలకు ఎంతో పేరు ప్రతిష్టలు పొందిన కిర్గిజిస్తాన్‌దేశ రాజధాని బిష్కెక్‌లోని పలు విశ్వవిద్యాలయాలలో భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, రష్యా, ఉక్రేన్ విద్యార్థులే అత్యధికంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. మే 13వ తేదీ నుండి స్థానిక విద్యార్థులు, విదేశీ విద్యార్థులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుల ప్రకారం ముగ్గురు పాకిస్తానీ విద్యార్థులు మరణించారు. దాంతో స్థానిక విద్యార్థులు విదేశీ విద్యార్థులు ఉంటున్న విశ్వవిద్యాలయాల హాస్టళ్లపై దాడులు పెంచారు. దీంతో భారతీయ వైద్య విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లవద్దని, హాస్టళ్లలో, లేదా విద్యాలయాలలోని తరగతి గదులకు మాత్రమే పరిమితం కావాలని కేంద్ర విదేశీమంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. విదేశాంగమంత్రి జైశంకర్ కూడా ఎక్స్ వేదికగా విద్యార్థులకు ఒక ముందస్తు హెచ్చరిక చేశారు. విద్యార్థులు కేవలం చదువుమీదే దృష్టి పెట్టాలని, కొద్దిరోజులు బయటకు వెళ్లవద్దని హితవు చెప్పారు. అదేవిధంగా పాకిస్తాన్ ప్రభుత్వం కూడా తమ విద్యార్థులకు ఒక హెచ్చరిక చేసింది. కిర్గిజిస్తాన్‌లోని విశ్వవిద్యాలయాలలో 15,000 మంది భారతీయ విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్నారు. ఈజిప్ట్–కిర్గిజిస్తాన్ విద్యార్థులమధ్య ఐదు రోజుల క్రితం చెలరేగిన ఘర్షణ చినికి చినికి గాలివానగా మారాయి. దీంతో హాస్టళ్లపై దాడులు జరుగుతున్నాయి. ఈ ఘటనలపట్ల పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తగిన రక్షణ ఇవ్వాలని కోరారు. భారత దౌత్యకార్యాలయం కూడా బిష్కెక్‌లో విద్యాభ్యాసం చేస్తున్న భారత విద్యార్థులతో సంభాషణలు జరుపుతోంది. వారిని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని, విద్యార్థులను బయట తిరగొద్దని చెప్పామని తల్లి తండ్రులకు తెలియజేసింది.



# సెంట్రల్ లండన్‌లో భారీ ప్రదర్శన

**లండన్ :** పాలస్తినాకు అనుకూలంగా శనివారంనాడు సెంట్రల్ లండన్‌లో లక్షలాదిమంది భారీ ప్రదర్శన చేశారు. సుమారు రెండున్నర లక్షలమంది ఈ ప్రదర్శనలో పాల్గొని ఉంటారని అంచనా. 1948లో ఇజ్రాయిల్ దేశం ఆవిర్భవించాక లక్షలాదిమంది పాలస్తీనియన్లు తమ ఆవాసాలుకోల్పోయి దేశాన్ని కోల్పోయి అనాథలుగా మారి మే 15వ తేదీ నాటికి 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారంనాడు టెన్ డౌనింగ్ స్ట్రీట్‌కు అత్యంత సమీపంలో లక్షలమంది ఈ భారీ ప్రదర్శన చేశారు. పాలస్తినాపై దాష్టీకాన్ని ఆపాలని వారు నినాదాలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వానికి గుండెకాయ లాంటి టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌కు అత్యంత సమీపంలోని వైట్ హాల్ వద్ద ఈ భారీ ప్రదర్శన జరిగింది. పాలస్తినా ప్రజలు తమ దేశాన్ని ఆవాసాలను కోల్పోయిన 1948 మే రెండోవారం రోజును "నాక్బా విధ్వంసం" గా పిలుస్తారు. గడచిన అక్టోబరు నుండి ఇప్పటివరకూ లండన్‌లో పాలస్తినాకు అనుకూలంగా అనేక భారీ ప్రదర్శనలు జరిగాయి. ఈ వరుసలో శనివారంనాడు 14వ సారి అతిభారీ ప్రదర్శన లక్షలాదిమందితో జరిగింది. పాలస్తినీ ప్రజలు రఫా నుండి బయటకు వెళ్ళిపోతూ పూర్తి ఆశ్రయం కోల్పోయిన దశలో, వారికి కనీస ఆహారం కూడా ఇవ్వడం లేదని ప్రదర్శకులు నిరసనలు తెలియజేశారు.







### ఇజ్రాయిల్–హమాస్ మధ్య పోరు ఉధృతం

మరోవైపు ఉత్తర దక్షిణ గాజా ప్రాంతాలలో ఇజ్రాయిల్ ఎడా పెడా భూతల, గగనతల దాడులను ఉధృతం చేసింది. ఈ దాడుల్లో మొత్తం 40 మంది పాలస్తీనియన్లు మరణించారు. కాగా సైన్యం దాడుల్లో హమాస్ కమాండర్ కూడాఒకరు హతుడయ్యాడు. కాగా హమాస్ వద్ద బందీలుగా ఉన్న ముగ్గురు మృతదేహాలను గాజా నుండి ఇజ్రాయిల్ సైన్యం స్వాధీనం చేసుకుంది. జెనిన్‌లో శరణార్థ శిబిరంవద్ద లైబ్రరీపై సైన్యం దాడి చేయడంతో పదమంది పాలస్తీనియన్లు మరణించారు. ఆక్రమిత్ వెస్ట్ బ్యాంక్‌లో జరిపిన దాడుల్లో ఇప్పటివరకూ 505 మందిని సైన్యం చంపింది. తాజాగా సైన్యం దాడుల్లో ఐదుగురు మరణించారు. కమల్ అద్వాన్ ఆసుపత్రివద్ద ప్రజలపై చేసిన దాడుల్లో పది మంది మరణించారు. మరోవైపు 40 మంది హమాస్ ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. గడచిన రెండు వారాల్లో ఇజ్రాయిల్ సైన్యం బలవంతంగా రఫా నుండి లక్షమందిని బయటకు గెంటేసిందని ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.



## అఫ్గానిస్థాన్‌లో స్పెయిన్ టూరిస్టులు సహా ఆరుగురు కాల్చివేత

**కాబూల్ :** అఫ్గానిస్థాన్‌లోని టూరిస్టు ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు స్పెయిన్ దేశ పర్యాటకులతో సహా ఆరుగురు మరణించారు. మరో ఎనిమిదిమంది గాయపడ్డారు. గాయపడిన వారిలో మరో నలుగురు విదేశీ పర్యాటకులు ఉన్నారు. వీరిలో ఒక వృద్ధ మహిళ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. గాయపడినవారంతా నార్వే, ఆస్ట్రేలియా, లిథుయేనియా, స్పెయిన్ దేశాలకు చెందినవారు. ఈ ఘటనపట్ల స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడాన్ని యూరోపియన్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. మృతుల్లో ఒక అఫ్గాన్ పౌరుడు, ఒక తాలిబాన్‌సంస్థ సభ్యుడు కూడా ఉన్నారు. సెంట్రల్ అఫ్గానిస్థాన్‌లోని పర్వత నగరం బమియాన్‌లోని మార్కెట్ ప్రాంతంలో నడిచి వెళుతుండగా ముగ్గురు స్పెయిన్ టూరస్టులు సహా మరో ముగ్గురు అఫ్గానిస్థాన్ జాతీయులు ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించారనీ, వారి మృతదేహాలను రాజధాని కాబూల్‌కు తరలించామని శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగిందనీ ఆ దేశ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. రాజధానికి వంద కిలోమీటర్ల దూరంలో బమియాన్ నగరం ఉంది. ఈ మృదేహాలపై తీవ్ర గాయాలు ఉన్నాయనీ, మృతుల్లో ఒక మహిళ కూడా ఉందనీ అఫ్గానిస్థాన్ విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ మతీన్ క్వానీ చెప్పారు.

### స్లోవాకియా ప్రధాని రోబెర్ట్ ఫికో

## కొంప ముంచిన రష్యా అనుకూల వైఖరి?



**బ్రాటిస్లావా :** సెంట్రల్ యూరప్ తూర్పు ప్రాంతంలో ఉన్న స్లోవాకియాదేశ ప్రధానమంత్రి రోబెర్ట్ ఫికోపై జరిగిన కాల్పుల ఘటన దేశంలో ప్రజలకు ఇంకా దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. ఒక వైపు దేశంలో ఆయన పరిపాలనపై సగంమంది ప్రజలకు తీవ్ర వ్యతిరేకత ఏర్పడి నిరసన ప్రదర్శనలు జరుగుతున్న తరుణంలో తరచుగా ఈ ప్రదర్శనల్లో పాల్గొనే 71 ఏళ్ళు వయసుగల వృద్ధ పెన్షనర్ ప్రధానమంత్రిపై తన లైసెన్స్‌డ్ గన్‌తో గడచిన బుధవారంనాడు సమీపం నుండి అనేకసార్లు కాల్పులు జరిపాడు. ఆయన ఇంకా చావు బతుకులమధ్య ఆసుపత్రిలోనే ఉన్నారు. బాన్స్కా బైస్ట్రికాలోని ఎఫ్.డి.రూజ్‌వెల్ట్ ఆసుపత్రిలో ఆయనకు చికిత్స జరుగుతోంది. ఐతే ఆయనకు ప్రాణహాని ఉందనీ, పరిస్థితి తీవ్రంగా ఉందనీ ఆసుపత్రి డైరెక్టర్ చెప్పారు. పోలీసులు వృద్ధ నిందితుణ్ణి అరెస్టు చేసి శనివారంనాడు కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఐతే నిందితుడ గురించి పోలీసులు ఎలాంటి సమాచారం చెప్పలేదు. కానీ దేశ నైరుతీ ప్రాంతానికి చెందిన నిందితుడు జురాజ్ సింతులా (71) ఒక మాల్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడనీ, ఎమెచ్యూర్ పోయట్ అనీ అనధికార సమాచారం ప్రకారం పేర్కొంది. వచ్చే నెలలో యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికల్లో కూడా ఫికో పార్టీ భాగస్వామ్యంగా ఉన్న కూటమికి ఎక్కువ అవకాశాలు ఉన్న తరుణంలో ఈ ఘటన జరిగింది. పైగా ఫికో ఉక్రేన్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయడం, రష్యాకు అనుకూల వైఖరి అవలంబించడం, దేశ అవినీతి నిరోధక న్యాయాధికారిని పదవి నుండి తొలగించడం, ప్రభుత్వ మీడియాను తన గుప్పెట్లో పెట్టుకునేందుకు ప్రయత్నం చేయడం, దేశంలో నియంతృత్వ పోకడలు అనుసరించడం వంటి పరిణామాలు తోటి యూరోపియన్ యూనియన్ దేశాలకు నాటో కూటమికి కూడా ఆందోళన కలిగిస్తున్న తరుణంలో ఆయనపై ఈ హత్యా ప్రయత్నం జరిగింది. మూడోసారి ఆయన గత ఏడాది ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనపై హత్యా ప్రయత్నం జరగడంతో స్లోవాకియా దేశంలో చాలా స్పష్టమైన చీలిక కనిస్తున్నది. ఆయన అనుకూల వ్యతిరేక వర్గాలుగా ప్రజలు చీలిపోయారు. ఈ నేపథ్యంలో దేశ అధ్యక్ష పదవి నుండి త్వరలో వైదొలగుతున్న జుజానా కాప్యిటోవా మాట్లాడుతూ, దేశంలో శాంతియుత వాతావరణం నెలకొనేవిధంగా అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రతిపక్ష నాయకులతో సమావేశం జరుపుతానని ప్రకటించారు. పరస్పరం విమర్శలు చేసుకునే విషవలయం నుండి మనం బయటపడాల్సి ఉందని ఆయన అన్నారు. అదేసమయంలో దేశాధ్యక్షుడుగా ఎన్నికై త్వరలో బాధ్యతలు చేపట్టనున్న పీటర్ పెల్లెగ్రినీ కూడా ఒక ప్రకటన చేస్తూ యూరోపియన్ యూనియన్ ఎన్నికల కోసం జరుగుతున్న ప్రచారం ఆపేయాలని, ప్రశాంతత పాటించాలని పిలుపు ఇచ్చారు. స్లోవాకియా దేశంలో 54 లక్షలమంది జనాభా ఉన్నారు.

## మయన్మార్‌లో యుద్ధం ఉధృతం

### సురక్షిత ప్రాంతాలకు వేలాదిమంది

**బ్యాంకాక్ :** మయన్మార్‌లో నియంతృత్వ జుంటా పాలకుల సైన్యానికీ, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న గెరిల్లా దళాలకు మధ్య పోరాటం రోజు రోజుకూ ఉధృతరూపం దాలుస్తున్నది. కొద్దికాలంగా జుంటా సైన్యం దాడులు తట్టుకోలేక వెనుకంజ వేస్తున్నది. ఈ నేపథ్యంలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రంలో వేలాదిమంది రోహింగ్యాలు భయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళుతున్నారు. అనేకమంది నిరాశ్రయులయ్యారు. వేలాదిమంది భయంతో సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నారు. ప్రజాస్వామ్యంకోసం జుంటా సైన్యంతో పోరాటం చేస్తున్న అరన్ ఆర్మీ మిలీషియా గ్రూపునకూ, జుంటా సైన్యానికి మధ్య యుద్ధం ఈ ప్రాంతంలో ఉధృతరూపం దాల్చింది. బుథిడౌంగ్ సెంటర్‌లోని భవంతులు ధ్వంసమయ్యాయి. గడచిన ఆరునెలలుగా జుంటా పాలకులను గద్దె దించేందుకు ప్రజాస్వామ్య గెరిల్లా గ్రూపులు యుద్ధ దాడులను ఉధృతం చేయడంతో దేశం నుండి భయంతో సుమారు 30 లక్షలమంది పొరుగుదేశాలకు, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళిపోయారని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో తెలియజేసింది. వాయువ్య మయన్మార్‌లోని ఛిన్ నుండి సగం మంది వెళ్ళిపోగా, ఆగ్నేయ సగైంగ్, మేగ్వే ప్రాంతాల నుండి తొమ్మిదిలక్షలమంది వెళ్ళిపోయారు. రఖైన్ ప్రాంతం నుండి ఇప్పటికే ఏడు లక్షలమంది రోహింగ్యాలు బంగ్లాదేశ్ సహా ఇతర దేశాలకు వెళ్ళిపోయారు. సైన్యం మయన్మార్‌లో తిరిగి అధికారం స్వాధీనం చేసుకున్న తర్వాత ఈ మూడు సంవత్సరాల్లో ఐదువేలమంది కాల్పుల్లో ఉద్యమకారులు మరణించగా, 20 వేల మంది జైళ్ళల్లో ఉన్నారు.

## అల్పపీడనం (మొదటి పేజీ తరువాయి)

వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. ఈనెల 22న నైరుతీ బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయన్నారు. అల్పపీడనం బలపడి 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపారు. కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా శ్రీలంక వరకు ఉపరితల ద్రోణి ఆవరించిందన్నారు. సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి కొనసాగుతోందని చెప్పారు. తమిళనాడులోని ఉత్తర ప్రాంతాల వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించిందన్నారు. 23వ తేదీ వరకు మోస్తరు నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దక్షిణ అండమాన్‌సముద్రంలో నైరుతీ రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయన్నారు. ఆదివారం బంగాళాఖాతంలో ఆగ్నేయ ప్రాంతాలపై నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తాయన్నారు. దీంతో భారీ నుంచి అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సహా పలుప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## మంత్రివర్గ సమావేశం వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

చర్చించలేకపోయామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన వేడుకల నిర్వహణతో పాటు ఉమ్మడి ఎపి రాష్ట్ర పునర్విభజనకు పదేండ్లు పూర్తి కావటంతో ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలు, పునర్విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న కీలకమైన అంశాలను కేబినేట్ భేటీలో చర్చించాలని సిఎం నిర్ణయించారు. కేబినేట్ భేటీ వాయిదా పడటంతో ఇవేవీ చర్చ జరగలేదని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. సోమవారం లోపు ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి రాకపోతే, అవసరమైతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘా న్ని కలిసి అనుమతి కోరుతామని ముఖ్యమంత్రి చెప్పారు.

## ఇఎపి సెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

బాలికలు 90.18 శాతం, బాలురు 88.25 శాతం ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,40,618 మంది విద్యార్థులు హాజరవ్వగా 1,80,424 మంది(74.98 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 75.85 శాతం, బాలురు 74.98 శాతం ఉత్తీర్ణులయ్యారు.

**ఇంజినీరింగ్ టాప్ టెన్ ర్యాంకర్లు వీళ్లే :**

మొదటి ర్యాంకు ఎస్.జ్యోతిరాదిత్య(శ్రీకాకుళంపాలకొండ)
రెండవ ర్యాంకు గొల్లలేఖ హర్ష(కర్నూలుపంచలింగాల)
మూడో ర్యాంకు రిషి శేఖర్‌శుక్లా (సికిందరాబాద్ తిరుమలగిరి)
నాలుగో ర్యాంకు భోగలపల్లి సందేశ్(హైదరాబాద్‌మాదాపూర్)
ఐదో ర్యాంకు మురసాని సాయి యశ్వంతెడ్డి(కర్నూలు)
ఆరో ర్యాంకు పుట్టి కుశల్ కుమార్(అనంతపురంఆర్.కెనగర్)
ఏడో ర్యాంకు హుండికర్ విదీత్(హైదరాబాద్‌పుప్పాలగూడ)
ఎనిమిదో ర్యాంకు రోహన్(హైదరాబాద్‌ఎల్లారెడ్డిగూడ)
తొమ్మిదో ర్యాంకు కొంతేమ్ మణితేజ(వరంగల్‌ఘన్పూర్)
పదో ర్యాంకు ధనుకొండ శ్రీనిధి(విజయనగరం)

**అగ్రికల్చర్, ఫార్మసీలో టాప్ టెన్ ర్యాంకర్లు వీళ్లే :**

మొదటి ర్యాంకు ఆలూరు ప్రణీత(మదనపల్లె)
రెండో ర్యాంకు నాగుదాసరి రాధాకృష్ణ (విజయనగరం)
మూడో ర్యాంకు గడ్డం శ్రీవర్షిణి(హనుమకొండ)
నాలుగో ర్యాంకు సోంపల్లి సాకేత్ రాఘవ్(చిత్తూరు)
ఐదో ర్యాంకు రేపాల సాయి వివేక్(హైదరాబాద్‌ఆసిఫ్‌నగర్ )
ఆరో ర్యాంకు మహమ్మద్ అజాన్‌సాద్ (హైదరాబాద్‌నాచారం)
ఏడో ర్యాంకు వడ్లపూడి ముకేష్ చౌదరి(తిరుపతివెంగమాంబపురం)
ఎనిమిదో ర్యాంకు జెన్నీ భార్గవ్ సుమంత్(హైదరాబాద్‌పేట్ బషీరాబాద్)
తొమ్మిదో ర్యాంకు జయశెట్టి ఆదిత్య(హైదరాబాద్‌అల్విన్ కాలనీ)
పదో ర్యాంకు పూల దివ్యతేజ (శ్రీసత్యసాయి జిల్లాబలిజపేట)

## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఈదురుగాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు నెలకొరిగాయి. కూలిపోయిన చెట్లను జిహెచ్‌ఎంసి డిఆర్‌ఎఫ్ బృందాలు తొలగించేందుకు చర్యలు చేపట్టాయి. చెట్లు నెలకొరగడంతో పలుప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. అలాగే విద్యుత్ సరఫరాలో కూడా అంతరా యం చోటు చేసుకుంది. వర్షం పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్‌బి నగర్ పరిధిలో భారీవర్షం కురవడంతో వరద నీరు నిలిపోవడంతో రహదారులు చెరువు ను తలపించాయి. వనస్థలిపురం చింతలకుంట వద్ద జాతీయ రహదారి పై భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఆటకం ఏర్పడింది. దీంతో పనామాఎల్.బి.నగర్ మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో విజయవాడ రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లితో పాటు మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్, గండిమైసమ్మ, ఎల్‌బినగర్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, నాగోల్, వనస్థలిపురం, మన్సూరాబాద్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, బేగంపేట్, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, జవహర్ నగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, రాంనగర్, అడిక్‌మెట్, గాంధీనగర్, ఆర్‌టిసి క్రాస్ రోడ్, బాగ్‌లింగంపల్లి, కవాడిగూడ, దోమలగూడ, భోలక్‌పూర్, మలక్‌పేట ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలో కురిసిన వర్షాల నేపథ్యంలో జోనల్ కమిషనర్‌లు, ఎస్‌ఈలతో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

## మోసం రూ.కోట్లలో

(మొదటి పేజీ తరువాయి)

బాధితులు ఉలిక్కిపడ్డారు. తమకు కూడా ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని నమ్మించి కెఎపాల్ డబ్బులు దండుకున్నాడని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. కెఎ పాల్ చేతిలో మోసపోయిన బాధితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారు. తమ పార్టీలో చేరితే ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని కెఎ పాల్ నమ్మించాడని బాధితులు వాపోతున్నా రు. ఎంఎల్‌ఎ టికెట్ ఆశించిన బాధితులు తమ వ్యాపార సంస్థలోని డబ్బును కెఎ పాల్‌కు తరలించారు. తీరా మోసపోయిన బాధితులు అటు ఎంఎల్‌ఎ టికెట్ రాక ఇటు తమ వ్యాపారంలో ఆర్థికంగా నష్టపోవడంతో వారు అప్పులపాలయ్యారు. మోసపోయిన పలువురు అభ్యర్థులు తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చివేయాలని పంజగుట్టలో ఉన్న ప్రజాశాంతి పార్టీ కార్యాలయానికి చెప్పులరిగేలా ఆరు నెలల నుంచి తిరుగుతునే ఉన్నారు. పలువురు బాధితులు కెఎ పాల్‌కు ఫోన్ చేసినా..రెపోమాపో ఇస్తానని నమ్మించడం, కొందరు బాధితుల ఫోన్‌కాల్స్‌ను లేపకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురయ్యారు.ఇలా డబ్బులు తిరిగి అడిగిన కొంత మంది బాధితులను కెఎ పాల్ బెదిరించినట్లు కూడా తెలుస్తుంది.సమాజంలో తమకున్న పరువు మర్యాదలు పోతాయని భావించిన పలువురు బాధితులు ఫిర్యాదు చేయడానికి ముందు రావడానికి భయపడుతున్నారు. బాధితుల్లో ధైర్యం చేసిన కిరణ్‌కుమార్ వ్యాపారి మాత్రం కెఎ పాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిరణ్‌కుమార్ మాదిరిగా కెఎ పాల్ చేతిలో మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే సాక్ష్యాధారాలతో తమను ఆశ్రయించాలని దర్యాప్తు అధికారులు కోరుతున్నారు.బాధితులు ఒకటిరెండు రోజుల్లో పోలీసు స్టేషన్‌కు క్యూ కట్టే అవకాశాలు ఉన్నాయి.

**అజ్ఞాతంలో కెఎ పాల్...** ఎంఎల్‌ఎ టికెట్ ఇప్పిస్తానని రూ.57 లక్షలు తీసుకుని కిరణ్‌కుమార్ అనే వ్యాపారిని మోసగించిన ఉదంతంలో తనపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారని తెలియగానే కెఎ పాల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తుంది. అతని ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ అని వస్తుందని, పంజగుట్ట ఆఫీసర్స్ కాలనీలో ఉన్న ప్రజాశాంతి పార్టీ కార్యాలయానికి వెళ్లిన పోలీసులకు సైతం అతని ఆచూకీ లభించలేదు.నెడో రోపో కెఎ పాల్‌కు నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసును ఎస్‌ఐ ఎం.వెంకటకిషన్ దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను అధికారులు జిల్లాల వారిగా సేకరించే పనిలో నిమగ్నమైయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23వ తేదీవరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించడంతో ఐకెపి కేంద్రాల్లో అధికారులు ధాన్యాన్ని కాపాడేందుకు ప్రత్యేకచర్యలు చేపట్టారు.

**భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ...** ఇటీవల వరకు ఓ మోసార్తుగా కురిసిన వర్షాలు గత రెండు రోజుల నుంచి దంచి కొడుతుండడంతో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పరిస్థితి మరింత ఇబ్బదికరంగా మారింది. ఈ భారీ వర్షాలకు ధాన్యం నీటిలో కొట్టుకుపోతుండడంతో పాటు మళ్లీ మళ్లీ తడుస్తున్నది. దీంతో అధికారులు ఎక్కడికక్కడ ధాన్యం కొనుగోళ్లను పూర్తిగా వేగవంతం చేశారు. అదేవిధంగా వర్షాలకు వడ్లు తడవకుండా చర్యలను చేపట్టారు. తడిసిన ధాన్యం మెలకేత్తకుండా ఉండేందుకు వాటిని పూర్తిగా ఆరబెట్టేందుకు సైతం పలు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు చేపట్టారు. యాసంగిలో 55 లక్షల పైచిలుకు ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు 1.50 కోట్ల క్వింటాల ధాన్యం ఉత్పత్తి అయినట్లు ఓ అంచనా. ఇందులో ఐకెపి కేంద్రాల ద్వారా ఇప్పటికే ప్రభుత్వం 65 నుంచి 70 శాతం మేరకు ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించారు. ఈ నేపథ్యంలో మిగిలిన 30 శాతం ధాన్యం కొనుగోళ్లను మే చివరినాటికి పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

**వరస వర్షాలతో బిక్కుబిక్కుమంటున్న అన్నదాతలు...** సాధారణంగా అకాల వర్షాలు అక్కడక్కడ ఒకటి రెండు రోజులు కురువడం ప్రతి ఎండా కాలంలో సహాజమే. అయితే ఈ సారి మాత్రం వరుణుడు పగ పట్టాడా అన్నట్లు గడిచిన 10 రోజులకు పైగా రాష్ట్రంలో పలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకాల వర్షాలు వర్షాకాలన్ని తలపిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు వర్షం నుంచి తేరకున్నామనుకునే లోపే మళ్లీ వర్షం కురుస్తుండడంతో రైతు పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. తడిసిన ధాన్యం ఆరింది అనుకునే లోపే మళ్లీ వర్షం పడుతుండడంతో తడిసిన ధాన్యరాశులు రంగు మారడం, మొలకెత్తుతాయనే తీవ్ర భయాందోళనలకు రైతులు గురవుతున్నారు. అయితే ఈనెల 23వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ అధికారుల ప్రకటనతో అన్నదాతలు మరింత ఆందోళన చెందుతున్నారు.

## 'మేడిగడ్డ' పనులు షురూ

(మొదటి పేజీ తరువాయి)

8 గేట్లలో ఒక గేటును ఇప్పటికే ఎత్తి పెట్టారు. 2 గేట్లు మినహా మిగిలిన గేట్లను సాంకేతిక ఇబ్బందులు లేకుండానే ఎత్తే అవకాశం ఉందని ఎల్ అండ్ టి అధికారులు తెలిపారు. పగుళ్లు ఏర్పడిన 20వ పిల్లర్, దాని పక్కన ఉన్న పిల్లర్ గేట్లను ఎత్తడంలోనే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. కాగా ఈ నెలలోనే ఒకటి రెండు వారాల్లోనే భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో బ్యారేజీకి ఒకటి రెండు చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఎన్‌డిఎస్‌ఎ చేసిన సిఫారసుల మేరకు పనులను ప్రారంభించారు. గత రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మేడిగడ్డ బ్యారేజీ దగ్గర చేపట్టాల్సిన చర్యలపై అధికారులు నిమగ్నమవుతున్నారు. అది కూడా భారీ వర్షాలు కురిసినా కూడా వరద ప్రభావానికి ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా చూడనున్నారు. మొత్తం 8 గేట్లలో ఇప్పటికే ఒక గేటు విజయవంతంగా ఎత్తి పెట్టింది. అంతే కాకుండా మరో రెండు గేట్లు మినహా మిగతా గేట్లను సైతం ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండానే ఎత్తే అవకాశం ఉందని ఇప్పటికే ఎల్ అండ్ టి సంస్థ వెల్లడించింది. అక్కడక్కడా పగుళ్లు ఏర్పడిన 20వ పిల్లర్‌తో పాటు దాని పక్కనే ఉన్నటువంటి పిల్లర్ గేట్లను ఎత్తడంలో మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని ఆ సంస్థ అభిప్రాయపడుతోంది. ఒక వేళ ఏదేని పరిస్థితుల్లో గేట్లను ఎత్తడం గనుక వీలు కాకపోతే వాటిని పూర్తిగా తొలగించడానికి కూడా ప్రణాళికలను రూపొందిస్తోందని తెలుస్తోంది. కాగా ఎల్‌ఎల్ బిసి టన్నెల్ పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఆదేశాలు జారీ చేశారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై ఇప్పటికే ప్రత్యేకంగా కమిటీని వేయగా నివేదికను సైతం సమర్పించింది. ఈ నేపథ్యంలో మరో సారి ఎల్‌ఎల్‌బిసి టన్నెల్ పనుల ప్రారంభంపై ఇరిగేషన్ సెక్రటరీ తాజాగా నిర్మాణ ఏజెన్సీలు, ఇంజనీర్ అధికారులతో చర్చించారు.

## 'కాళేశ్వరం' ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై సిఎం రేవంత్ ఆరా

(మొదటి పేజీ తరువాయి)

కలిసి సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం సాయంత్రం సమీక్షించారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు కుంగిపోవటంతో తాత్కాలికంగా చేపట్టాల్సిన మరమ్మతులు, పునురుద్ధరణ చర్యలపై ఇటీవల నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ ) రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చింది. దీనికి సంబంధించిన తాజా పరిస్థితులపైన సిఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదికలో ఉన్న ముఖ్యమైన అంశాలు, సిఫారసులను ఉత్తమ్‌కుమార్ రెడ్డి సిఎం రేవంత్‌తో పాటు మంత్రులకు వివరించారు. 2019లోనే బ్యారేజీలకు ప్రమాదం ఉన్నట్టు తేలిందని, మరమ్మతులు, పునరుద్ధరణకు చర్యలు చేపట్టినా ప్రాజెక్టుకు ముప్పు ఉండబోదని తోసిపుచ్చలేమని ఎన్‌డిఎస్‌ఎ స్పష్టం చేసిన విషయాన్ని ఉత్తమ్ తెలిపారు. కాగా మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈలోపే తీసుకోవాల్సిన చర్యలపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మరమ్మతులు చేయాలా?, ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా?,మరింత నష్టం జరగకుండా ఏం చర్యలు చేపట్టాలనే అంశంపైన నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. శనివారం నాటి మంత్రివర్గ సమావేశం జరుగకపోవడంతో ఈ కీలకమైన అంశాలపై చర్చించలేకపోయామని సిఎం రేవంత్ చెప్పారు.

## మత స్వేచ్ఛను కాపాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడికి వెళ్లినా విభజన సృష్టించేందుకు ప్రయత్నిస్తారని, సమాజాన్ని విభజించాలని మాట్లాడుతున్నారని మోదీపై ఖర్గే మండిపడ్డారు. 80 కోట్ల మందికి 5 కిలోల ఉచిత రేషన్ అందిస్తానని మోదీ మాట్లాడుతున్నారని ఖర్గే అన్నారు. తమ ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చిందని, దానిని అమలు చేస్తామన్నారు. 10కిలోల ఉచిత రేషన్ ఇస్తామని మరోసారి ఖర్గే స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఆహారభద్రత చట్టంపై నిర్ణయం తీసుకుందని, అయితే ఇప్పుడు 5 కిలోల ఉచిత రేషన్ అందించిన ఘనత మోదీదేనని పవార్ అన్నారు. తమ పార్టీని 'నక్లి' (నకిలీ) శివసేన పేర్కొనడంపై బిజెపి, పిఎం మోడీపై థాక్రే ధ్వజమెత్తారు జూన్ 4న 'జుమ్లా శకం' ముగుస్తుందని, ఇండియా కూటమి అధికారంలోకి రాగానే 'అచ్చే దిన్' వస్తుందని సేన (యుబిటి) చీఫ్ చెప్పారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. తన 53 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలను రెచ్చగొట్టే, సమాజాన్ని విభజించే ప్రధానిని ఎప్పుడూ చూడలేదని, మోడీ ఆదేశాలతో ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, ప్రలోభాలకు గురి చేస్తున్నారని, అయితే ప్రజలు ఆయనను ఓడిస్తారని విమర్శించారు. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాలకు గాను 46 స్థానాలను ప్రతిపక్ష కూటమి గెలుచుకుంటుందని పేర్కొన్నారు. సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు హిందువులకు బదులుగా 'దేశ భక్త్' (దేశభక్తుడు) అనే పదాన్ని ఉపయోగించినందుకు తనను ఎగతాళి చేశారని థాక్రే మండిపడ్డారు. హిందువులు దేశభక్తులు కాదా?...దేశభక్తులు అనే పదాన్ని వ్యతిరేకించే వారు దేశ వ్యతిరేకులని ఆయన అన్నారు. రామమందిరాన్ని కాంగ్రెస్ బుల్‌డోజర్ చేస్తుందని, బిజెపి చెబితే, ఆ పార్టీ కూడా ఆర్‌ఎస్‌ఎస్‌ని నిషేధిస్తుందని థాక్రే అన్నారు. తాము ఎవరిపైనా బుల్‌డోజర్ ప్రయోగించలేదు.. తమది బుల్‌డోజర్ ప్రభుత్వం కాదన్నారు. ఈ వ్యాఖ్య రెచ్చగొట్టేందుకేనని, ఎన్నికల సంఘం ఆయనపై చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగం ప్రకారం తమ ప్రభుత్వం పనిచేస్తుందని.. అన్నింటినీ కాపాడుకుంటామని ఖర్గే అన్నారు. ఇండియా కూటమి ప్రభుత్వానికి మద్దతిస్తామని మమతా బెనర్జీ వ్యాఖ్యానించడం, బెంగాల్ సిఎంను నమ్మలేమని అధిర్ రంజన్ చౌదరి చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఖర్గే సమాధానమిస్తూ.. 'మమతా బెనర్జీ కూటమితోనే ఉన్నారన్నారు.



# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## ఇదీ 'డబుల్ ఇంజిన్' పరిస్థితి



కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే, 'డబుల్ ఇంజిన్' శక్తితో అభివృద్ధి సాధ్యమవుతుందని బిజెపి పదేపదే చెప్తున్నది. అయితే, మోదీ సర్కారు ప్రకటించుకుంటున్నట్టు బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అద్భుతాలు ఏమీ జరగడం లేదు. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ పథకాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) మణిపూర్‌లోని కొన్ని గిరిజన ప్రాంతాల్లో అమలు కావడం లేదు. అక్కడి ప్రభుత్వ అధికారులు, రవాణా అధికారులు కుమ్మక్కు కావడంతో పర్వత ప్రాంతంలోని గిరిజనులకు ఈ పథకం కింద బియ్యం, ఇతర ఆహార పదార్థాలు అందడం లేదు. కనీసం రెండు కొండ జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొందని మణిపూర్లోని ప్రజా హక్కుల సంఘం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్‌కు ఫిర్యాదు చేసింది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రంలోనే కేంద్ర ప్రభుత్వ పథకం అమలు కావడం లేదంటే, ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమాత్రం అమలు చేస్తారన్నది అర్థమవుతునే ఉంది. దేశంలో 80 కోట్ల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్టు కేంద్రం పలు సందర్భాల్లో ప్రకటించింది. తిరిగి అధికారంలోకి వస్తే, పథకాన్ని మరో ఐదేళ్ల కాలానికి పొడిగిస్తామని ప్రధాని తమ ఎన్నికల ప్రసంగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ పథకం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకటించుకుంటున్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని మణిపూర్‌లో గిరిజన ప్రాంతాల్లో పిఎంజికెఎవై రేషన్ అందకపోవడం రుజువు చేస్తున్నది. బిజెపి అధికారంలో ఉన్న కేంద్రం తీసుకొచ్చిన పథకాన్ని, అదే పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో సక్రమంగా అమలుకు నోచుకోకపోవడం దారుణం. 'డబుల్ ఇంజిల్' దుస్థితి ఇది. మణిపూర్ ప్రభుత్వ అధికారులు, రవాణా కాంట్రాక్టర్లు కలిసి గిరిజనులను ఇబ్బంది పెడుతున్నారు. వారికి అందాల్సిన సాయం అందకుండా అడ్డుకుంటున్నారు. ప్రజా సంఘాల నుంచి ఫిర్యాదు అందితే తప్ప, పథకాల అమలు తీరుపై ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు అవగాహన లేకపోవడం మణిపూర్ పాలనా వ్యవస్థ డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నది. బిజెపి హయాంలో సంక్షేమం నేతిబీర చందమే.

## మమత ఎటువైపు?



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) చీఫ్ మమతా బెనర్జీ ఎటువైపు మొగ్గు చూపుతున్నారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో టిఎంసి ఉందో, లేదో తెలియని పరిస్థితి. బెంగాల్‌లో కూటితో పొత్తు లేకుండానే సార్వత్రిక ఎన్నికల బరిలోకి దిగి, టిఎంసి విధానంపై అనుమానాలు రేకెత్తించారు. ఒకవేళ 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే, ప్రభుత్వంలో చేరబోమని స్పష్టం చేస్తూనే, బయట నుంచి మద్దతునిస్తామని ప్రకటించారు. కూటమిలో ఉన్నామని అంటున్న మమత పశ్చిమ బెంగాల్‌లో ఎందుకు ఎన్నికల పొత్తు పెట్టుకోలేదన్నది ప్రశ్న. కాగా, కేంద్రంలో 'ఇండియా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, బయట నుంచి మద్దతునిస్తామన్న మమత వ్యాఖ్యలపై బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ''కూటమికి బయట నుంచి లేదా లోపలి నుంచి మద్దతు ఇచ్చి ఆమె ఏం చేయాలనుకుంటున్నారో నాకు అర్థం కాలేదు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆమె స్వయంగా కూటమిని విడిచిపెట్టారని ఆయన చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇంతకీ మమత ఎటువైపు? సమాధానం లేదు... రాదు.

## సిఎఎ, పరిశ్రమలే కీలకాంశాలు




ఏడు దశల్లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటికే నాలుగు విడతల పోలింగ్ పూర్తికాగా, ఐదో విడత ఈనెల 20వ తేదీ, సోమవారం జరగనున్న విషయం విదితమే. పశ్చిమ బెంగాల్‌లో ఐదో విడత ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. 2019 ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) వీటిలో నాలుగు స్థానాలను గెలుచుకుంది. ఈసారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్న. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), హుగ్లీ నది ఒడ్డున నెలకొన్న పేలవమైన పారిశ్రామిక వాతావరణం ఈసారి ఎన్నికల్లో కీలకాంశాలుగా మారాయి. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బొంగాన్, బరాక్‌పూర్... హుగ్లీ జిల్లాలోని శ్రీరాంపూర్, హుగ్లీ, ఆరాంబాగ్, హౌరా జిల్లాలోని హౌరా, ఉలుబెరియా నియోజకవర్గాలు ఐదో విడతలో పోలింగ్‌కు వెళతాయి. 2019లో బొంగావ్, బరాక్‌పూర్, హుగ్లీలను బిజెపి కైవసం చేసుకోగా, హౌరా, ఉలుబెరియా, శ్రీరాంపూర్, ఆరాంబాగ్ స్థానాలు టిఎంసి ఖాతాలోకి వెళ్లాయి. బరాక్‌పూర్, హౌరా, శ్రీరాంపూర్ పట్టణ నియోజకవర్గాలుకాగా, బొంగావ్, ఆరంబాగ్, హుగ్లీ, ఉలుబెరియా గ్రామీణ ప్రాంతాలు. సిఎఎ చట్టాన్ని అనుసరించి తమకు పౌరసత్వాన్ని ఇవ్వాలని బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న బొంగొన్ నియోజవర్గంలోని మతువా కమ్యూనిటీ ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నది. కాగా, దేశంలో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేలా సిఎఎ నియమాలను హోం వ్యవహారా మంత్రిత్వ శాఖ ఈనెల 11న నోటిఫై చేసింది. దీనితో, బొంగాన్ దక్షిణ బెంగాల్ తదితర ప్రాంతాల్లో సిఎఎ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. బొంగాన్ నియోజకవర్గంలో కేంద్ర సహాయ మంత్రి, బిజెపి ఎంపి శంతను ఠాకూర్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆయనకు టిఎంసి అభ్యర్థి బిశ్వజిత్ దాస్‌తో గట్టిపోటీ తప్పదని అంటున్నారు. దాస్ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి టికెట్‌పై గెలిచి, ఆ తర్వాత టిఎంసిలోకి ఫిరాయించారు. మమతా బెనర్జీ ప్రభుత్వం సిఎఎను అడ్డుకుంటున్నదని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపిస్తుండగా, ముస్లిం మైనారిటీలను వేధించడమే సిఎఎ లక్ష్యంగా టిఎంసి వ్యాఖ్యానిస్తున్నది. ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో, ఈసారి ఎన్నికల్లో ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక, లెఫ్ట్‌ఫ్రంట్ హయాంలో సింగూర్‌లోని టాటా మోటార్స్ చిన్న కార్ల ఫ్యాక్టరీ కోసం జరిపిన భూసేకరణకు వ్యతిరేకంగా నిరసనలకు హుగ్లీ కేంద్ర బిందువుగా నిలిచింది. ఆ నియోజకవర్గంలో విజయం కోసం లాకెట్ ఛటర్జీ (బిజెపి), రచనా బెనర్జీ (టిఎంసి) తలపడుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన లాకెట్ ఛటర్జీ మరోసారి తన విజయంపై ఆశతో ఉన్నారు. అయితే, అభ్యర్థులకు స్థానికుల నుంచి పరిశ్రమల అంశం సమస్యలు సృష్టిస్తున్నది. ఉపాధి అవకాశాలు పెంచే దిశగా తగినన్ని పరిశ్రమలు రాలేదని స్థానికులు ఆగ్రహంగా ఉన్నారు. దీనిని టిఎంసి సర్కారు వైఫల్యంగా పేర్కొంటున్నారు. అదే సమయంలో సిట్టింగ్ ఎంపి లాకెట్ ఛటర్జీ చేసింది ఏమీ లేదన్నది చాలా మంది అభిప్రాయం. కీలకమైన ఇద్దరు అభ్యర్థుల పట్ల స్థానికంగా ఎంతోకొంత వ్యతిరేకత ఉన్న తరుణంలో ఇక్కడ విజయం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తి రేపుతున్నది. మిగతా నియోజకవర్గాల్లోనూ సిఎఎ, పరిశ్రమలు, ఉపాధి అంశాలు ప్రధాన భూమిక పోషించే అవకాశం ఉంది.

## స్టాక్ బ్రోకర్ల కష్టాలు..



స్టాక్ మార్కెట్‌లో కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతాయి కాబట్టి, స్టాక్ బ్రోకర్ల జీవితాలు సుఖమయంగా ఉంటాయనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. కానీ, అది నిజం కాదని ఓ స్టాక్ బ్రోకర్ సాక్షాత్తు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందు ఏకరువు పెట్టాడు. కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా తమ నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నదనే విషయాన్ని అతను వివరించాడు. 'స్టాక్ బ్రోకర్లుగా మేము చాలా పన్నులు చెల్లించాల్సి వస్తోంది. జిఎస్‌టి, సిజిఎస్‌టి, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్, ఐటిఎస్‌టి, స్టాంప్ డ్యూటీ, ఎల్‌డిజిసి వంటి పన్నులను ప్రభుత్వం వసూలు చేస్తున్నది. స్టాక్ బ్రోకర్లుగా మేము సంపాదిస్తున్న మొత్తం కంటే, మా నుంచి ప్రభుత్వం అత్యధిక మొత్తాలను తీసుకుంటున్నది. తద్వారా మా కంటే రెట్టింపు లాభం పొందుతున్నది. మేమేమో అధిక రిస్క్ తీసుకుంటుంటే, ప్రభుత్వమేమో లాభాల్లో అధిక వాటా తీసుకెళుతోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, మేము వర్కింగ్ పార్ట్‌నర్స్‌గా, ప్రభుత్వం స్లీపింగ్ పార్ట్‌నగర్‌గా మారింది' అంటూ వాపోయాడు. అతని మాటలు సరదగా కనిపించినా, వాస్తవంలో స్టాక్ బ్రోకర్లను కేంద్ర ప్రభుత్వం నానా రకాల పన్నులతో వేధిస్తున్నదనే వాస్తవం అతని మాటల్లో బయటపడింది. సదరు స్టాక్ బ్రోకర్ లేవెనెత్తిన అంశాలను ఏమాత్రం పట్టించుకోని నిర్మలమ్మ, 'ప్రభుత్వం స్లీపింగ్ పార్ట్‌నర్ కాబట్టి, ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడం కుదరదు' అని కామెంట్ చేశారు. అంతేగాక, ఆ కార్యక్రమంలో కేంద్రం ఎన్నో గొప్పగొప్ప పనులు చేసిందని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నదంటూ రాజకీయ ఉపన్యాసం చేశారు. స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన కార్యక్రమంలో ముఖ్యమైన సమస్యలను విడిచిపెట్టి, దానిని ఎన్నికల ప్రచార కార్యక్రమంగా మార్చిన ఘనత నిర్మలా సీతారామన్‌కే దక్కుతుంది. మరోసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న ఆశతో ఉన్న బిజెపి,తన లక్ష్య సాధన కోసం ఎన్ని ప్రయత్నాలైనా చేస్తుందని ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిరూపించారు.

## అధికారుల నిర్లక్ష్యంతో టెట్ అభ్యర్థులకు ఇబ్బందులు : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) పరీక్ష కేంద్రాల కేటాయింపులో అభ్యర్థుల పట్ల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి అభ్యర్థులు పెట్టుకున్న మొదటి ఆప్షన్ ప్రాధాన్యత ఇవ్వకుండా చిట్ట చివరి ఆప్షన్‌కి అవకాశం ఇవ్వడం అన్యాయమని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఫలితంగా వందలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి పరీక్ష రాయాలంటే అభ్యర్థులపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే టెట్ పరీక్ష ఫీజును కూడా భారీగా పెంచారని, ఇప్పుడు పరీక్ష కేంద్రాల కేటాయింపులు కూడా అభ్యర్థులు అత్యధికంగా ఎంచుకున్న సొంత జిల్లా కాకుండా వేరే చోట కేటాయించి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని, వెంటనే విద్యాశాఖ, ప్రభుత్వం ఈ విషయం పై పునరాలోచన చేయాలని వారు కోరారు.

## చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

### చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలనన్నింటిని ప్రభుత్వం కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు వెంటనే నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలని, నేత కార్మికులు నేసిన వస్త్రాలు సహకార సంఘాల దగ్గర మాస్టర్ వీవర్స్ దగ్గర నిలువలు ఉన్నందున వారు కార్మికులకు పనులు కల్పించలేకపోతున్నారని, ఫలితంగా కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ఆవస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. గత 11 ఏండ్ల కింద చేనేత సహకార సంఘాల ఎన్నికలు జరిగాయని, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నిర్వహించకుండా సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. సహకార వ్యవస్థను పటిష్టం చేసేందుకు తక్షణమే ఎన్నికలు జరపాలన్నారు. సహకార సంఘాల, నేతన్నల రుణాలు మాఫీ చేసి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. చేనేతమిత్ర, చేనేతకు చేయూత పథకాలు అమలు కాకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నందున ఆ పథకాలు అమలు పరచాలన్నారు. ముఖ్యమంత్రి వాగ్దానం చేసిన 'చేనేత భరోసా' పథకానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించి నేతన్నల జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. కార్మికులకు నూతన ఆధునీకరణ మగ్గాలను అందించాలని, ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల ముద్ర లోన్స్ ఇవ్వాలని, జీవిత బీమా రూ.10లక్షలకు పెంచుతూ 75 ఏళ్ల వయసు వరకు ఇవ్వాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని నేతన్నల సమస్యలు పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టెన్నిస్ అండర్ - 14 సింగిల్స్, డబుల్స్ ఆసియన్ విజేతగా సాన్వీ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టెన్నిస్ అండర్ 14 సింగిల్స్, డబుల్స్‌లో భారత దేశం తరపున ఆడిన వనపర్తి మండలం చిన్నగుంటపల్లి గ్రామానికి చెందిన టెన్నిస్ క్రీడాకారిణి వి.సాన్వీ రెడ్డి ఆసియన్ విజేతగా నిలిచారు. టెన్నిస్ ఆసియన్ స్థాయి పోటీలు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జరిగాయి. ఆసియన్ విజేతగ నిలిచిన సాన్వీ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అభినందించారు. ఆయన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జి. ఆదిత్య రెడ్డితో కలిసి ఆమెను శాలువాతో సన్మానించారు.టెన్నిస్ టోర్నమెంట్ ఫైనల్స్ సింగిల్స్ లో బంగ్లాదేశ్ దేశానికి చెందిన సుమేరా అఖ్తర్ పైన 76, 62 తేడాతో సాన్వీ రెడ్డి విజయం సాధించారు.

## కలిసి పనిచేద్దాం... సమస్యలు పరిష్కరించుకుందాం

### పైస్థాయి సిబ్బంది పనితీరు మార్గదర్శకంగా ఉండాలి
### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కలిసికట్టుగా పనిచేసి సమస్యలు పరిష్కరించుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు వారివారి ప్రాతినిధ్యపు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశానికి అధికారుల హాజరు తక్కువగా ఉందని, 55 శాఖల అధికారుల్లో 12 శాఖలకు చెందిన అధికారులు హాజరుకాక పోవడం బాధాకరం అన్నారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రజా సేవ చేయాలనే తపన ఉండాలని, పై స్థాయి ఉద్యోగుల పనితీరు అదర్శంగా ఉన్ననాడే క్రిందిస్థాయి వ్యవస్థ చక్కబడుతుందన్నారు. వ్యవస్థలో లోపాలు చక్కబడితే తప్ప పరిస్థితులు మారవని, అందుకు అంతా నిబద్ధతో పనిచేయాలని సూచించారు. మొన్న వచ్చిన గాలిదుమారానికి రెండు రోజుల పాటు విద్యుత్‌లో తీవ్ర అంతరాయం ఏర్పడిందని, సమన్వయ లోపం వల్ల పునరుద్ధరణకు మరింత ఎక్కువ సమయం పట్టిందన్నారు. వైద్యకళాశాల, జిల్లా ఆస్పత్రి, మాత శిశు కేంద్రం ఉన్నప్పటికీ ప్రజలకు మెరగైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బందిలో జవాబుదారీ తనం లోపించిందని, ఇది చాలా ప్రమాదకరం అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అధిక శాతం గిరిజనులు, పేదలు నివశిస్తుంటారని, కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకోలేనివారు ప్రభుత్వాస్పత్రులను ఆశ్రయిస్తే గ్యారంటే లేకుండా పోతోందన్నారు. సిబ్బంది కొరతను అదిగమించి మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందించి మన్ననలు సూచించారు.. వానా కాలం సంభవిస్తున్నందున మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, వాస్తవానికి మూడు మాసాలకు ఓసారి శుభ్రం చేయాల్సిన మంచినీటి ట్యాంకులను నెలలు తరబడి పట్టించుకోవడం లేదని, విద్యావ్యవస్థలో పై స్థాయి నుండే లోపాలు ఉన్నాయని, వాటిని క్రమంగా సవరించుకుంటే నాణ్యమైన విద్య అందే పరిస్థితి లేదని, బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులు నికిలీ విత్తనాల వల్ల నష్టపోకుండా వ్యవసాయాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, భూసార పరీక్షలు నిర్వహించి ఏ నెలల్లో ఏఏ పంటలు వేస్తే అధిక దిగుబుడులు వస్తాయో రైతులకు తెలపాలని చెప్పారు. అన్ని శాఖల్లో సమన్వయం లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, ఇది చక్కబడిన నాడు సమూలమైన మార్పు వస్తుందన్నారు. తాను జిల్లా కేంద్రంలో ఉంటున్నందన అన్ని ప్రాంతాల సమస్యలపై ప్రజలు వచ్చి కలుస్తుంటారని అందుకే జిల్లా నలుమూల సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారులు తన దృష్టికి తీసుకొస్తే నేరుగా ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించేందకు కృషి చేయనున్నట్లు తెలిపారు. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రుల్లో మరికొన్ని డయాల్సిస్ యూనిట్ల కోసం శుక్రవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో హైదరాబాద్‌లో మాట్లాడి వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లపాటు ఈ భవనంలోనే జిల్లా పరిషత్ సమావేశాలు జరుగుతున్నాయని, స్థలం సరిపోక చాలా మంది బయటే కూర్చోవాల్సి వస్తోందని, అధునాత హంగులతో సరికొత్త జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరాన్ని నిర్మించుకుందామని చెప్పారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు తమకు నాలుగు మాసాలుగా గౌరవ వేతనాలు రావడం లేదని, మరి కద్ది రోజుల్లో తమ పదవీ కాలం ముగియనుందని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. దానిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఎంఎల్‌సి నర్సిరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సిఇఓ ప్రసూన రాణి, డిప్యుటీ సిఇఓ చంద్రశేఖర్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్, పల్లా చంచల్‌గూడ జైలుకెళ్లడం ఖాయం

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** కేటీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డిల అవినీతి, అక్రమాలు నిరుపనైె చంచల్‌గూడ జైలుకెళ్లడం ఖాయమని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీర్మార్ మల్లన్న అన్నారు. లక్ష ఓట్లతో తీర్మార్ మల్లన్న గెలిపించి తెలంగాణ తల్లి సోనియమ్మకు పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవిని గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. శనివారం జనగామలోని విజయ పంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పల్లా రాజేశ్వర్‌రెడ్డి మూలంగానే వచ్చిందన్నారు. మూడు జిల్లాలకు చెందిన పట్టభద్రులు గెలిపిస్తే మంత్రి పదవి ఆశతో ఎమ్మెల్సీ వదలుకొని ఎమ్మెల్లేగా పోటీ చేశాడన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 15వేల దొంగ ఓట్లతో గెలిచాడని, ఈ విషయాన్ని తాను ఆనాడే వాస్తవాల ఆదారంగా నిరూపించడం జరిగిందన్నారు. గడిచిన ఎంఎల్‌ఎ ఎన్నికల్లోనూ జనగామలో దొంగ ఓట్లతోనే గెలిచాడన్నారు. ఆయనకు దొంగ ఓట్ల ఎంఎల్‌ఎ అని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంచి పేరు పెట్టారని, ఆయనను ఆ పేరుతోనే పిలిస్తే బాగుంటుందన్నారు. ఎమ్మెల్సీగా పట్టభద్రుల కోసం పనిచేయనోడు జనగామ ప్రజలకు ఏం చేస్తాడని ఎద్దేవా చేశారు. కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సారధ్యంలోనే జనగామ అభివృద్ధి చెందుతుందని, ఆనాడు తపాస్‌పల్లి వరకు గోదావరి జలాలు తెస్తే హరీష్ రావుతో కుమ్మక్కై సిద్దిపేటకు తరలించారని మండిపడ్డారు. జనగామలో 12వేల 600 పట్ట భద్రుల ఓట్లు ఉన్నాయని, 12వేల ఓట్లు తీన్మార్ మల్లన్నకు వేయించాలన్నారు. తనను తట్టుకోలేని కేటీఆర్ తీన్మార్ మల్లన్న మంచోడు కాదని ప్రచారం చేయిస్తున్నాడని, నామినేషన్‌కు ముందే తన ఆస్తుల్ని ప్రభుత్వానికి వ్రాసి ఇచ్చిన తాను ఎలా మంచోడిని కాదో చెప్పాలన్నారు. కెటిఆర్ లాగా దందాలు, భూ కబ్జాలు చేయలని, తాను పేద, బడుగు బలహీన వర్గాల పిల్లల్ని చదివిస్తున్నారని వివరించారు. కెటిఆర్‌కు బుద్ధి చెప్పేలా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. తనను ఎమ్మెల్సీ చేయడంతో పాటు తీన్మార్ మల్లన్న లాంటి వారు శాసన మండలిలో ఉండాలనే కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజా పాలన బలంగా ఉండాలంటే తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడినట్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. గెలుస్తామన్న ధీమాకు పోవద్దు అని, అత్యధిక ఓట్లు తీన్మార్ మల్లన్నకు వేయించాలని కోరారు. గ్రామాల వారిగా పట్టభద్రులను గుర్తించి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలను వివరించి ఓట్లు వేయించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేట్ భవానిరెడ్డి, టిపిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రాజమౌళి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అభిగౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, బాల్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, జక్కుల అనిత, బుచ్చిరెడ్డి, మేడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ' రైతు భరోసా' నిధులను జూన్ మొదటి వారం లోపు ఇవ్వాలని బిఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా చూడా లన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పంట సాగు చేసే సమయంలో కాకుండా, పంట చేతి కందే సమయంలో రైతుబంధు డబ్బులు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి క్వింటాకు రూ.500ల భోనస్ ఇస్తామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు సన్న ధాన్యానికే రూ.500ల భోనస్ ఇస్తామనడం అన్యాయమన్నారు. ఇదే విషయంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రకటన చేస్తే కాంగ్రెస్ ఎంపి అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతయ్యేదన్నారు. ప్రతి రైతు వద్ద ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసే పనులు చేస్తుందని, ప్రజలు..రైతులకు ఉపయోగపడే పనులు చేయడం లేదని ఆరోపించారు. తిట్ల మీద కాకుండా ప్రజలకు ఏం చేయాలో ఆలోచన చేయాలని ఆయన సూచించారు. రైతుబంధు ఇస్తారా?, రైతుభరోసా అమలు చేస్తారా అనేది సిఎం రేవంత్ స్పష్టం చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శిప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్‌పి చైర్మన్ తుల ఉమ, గట్టు రామచంద్ర రావు, పన్యాల భూపతిరెడ్డి పాల్గొన్నారు.

## గ్లోబల్ టెండర్లపై సిఎస్‌కు ఫిర్యాదు చేస్తాం

### మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పౌర సరఫరాల శాఖలో గ్లోబల్ టెండర్ల పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం కిలో రేటును బహిరంగ మార్కెట్ కన్నా అధికంగా నిర్ణయించారన్నారు. అధికారులు కాంగ్రెస్ నేతల ఒత్తిడికి తలొగ్గకుండా నిబంధనల మేరకు వ్యవహరించాలని కోరారు. టెండర్ల అక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు గ్లోబల్ టెండర్లు దక్కించుకున్న నాలుగు సంస్థలే సన్న బియ్యం సేకరణ టెండర్లను దక్కించుకోవడం పట్ల అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.




## ముంచుకొస్తున్న ప్రమాదం!



పర్యావరణ మార్పులు సృష్టిస్తున్న పెను మార్పుల పర్యవసానం భీకరంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం ఏ విధంగా ఉంటుందో చెప్పడానికి వెనెజులాను ఉదాహరణగా పేర్కోవాలి. ఆధునిక కాలంలో హిమానీనదాలు (గ్లాసియర్స్)ను కోల్పోయిన తొలి దేశంగా వెనెజులా నిలుస్తోంది. దక్షిణ అమెరికా ఉత్తర తీరంలో ఉన్న ఈ దేశ విస్తీర్ణం 916,445 చదరపు కిలోమీటర్లు లేదా 353,841 చదరపు మైళ్లు. దీనికి ఉత్తరాన కరేబియన్ సముద్రంతో పాటు అట్లాంటిక్ మహాసముద్రం, తూర్పున గయానా, దక్షిణాన బ్రెజిల్, నైరుతి.. పశ్చిమాన కొలంబియా సరిహద్దులుగా ఉన్నాయి. ఈ దేశ రాజధాని కారకాస్. భౌగోళికంగా వైవిధ్యభరితమైన దేశమైన వెనెజులాలో ఎనిమిది ఉత్తర ఆండియన్ పర్వత శ్రేణులు ఉన్నాయి. ఒరినోకో నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రధాన భాగాలుగా, విశాలమైన లానోస్ (మైదానాలు ), మరకైబో సరసు ఉన్నాయి. మరకైబో దక్షిణ అమెరికాలో అతిపెద్ద సరస్సుగా ఖ్యాతి గాంచింది. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన, అద్భుతమైన ఏంజెల్ ఫాల్స్ వెనెజులాలోనే ఉంది. 2,250 కిలోమీటర్ల పొడవుగల రియో నీగ్రో నది వెనెజులా మీదుగా వెళుతుంది. కొలంబియా, బ్రెజిల్‌లోనూ ప్రవహించే ఈ నది అమెజాన్ నదికి ప్రధాన ఉపనది. కాగా, కొలంబియాలో కూడా ప్రవహించే ఒరినోకో నది వెనెజులాలోని కీలకమైన నదుల్లో ఒకటి. 2,101 కిలోమీటర్ల దూరం ప్రవహించే ఈ నది, పరానా, అమెజాన్ తర్వాత ఇది దక్షిణ అమెరికాలో మూడవ పొడవైన నది . అనేక కరేబియన్ ద్వీపాలు, ద్వీపసమూహాలను వెనెజులా నిర్వహిస్తుంది. వాటిలో మార్గరీటా, లా బ్లాంక్విల్లా, లా టోర్టుగా, లాస్ రోక్స్, లాస్ మోజెస్ వంటి ద్వీపాలు ఉన్నాయి. వెనెజులాను 19వ శతాబ్దంగా గుర్తించారు. అప్పటి నుంచి ఇది ఎక్సిక్విబో దికి పశ్చిమాన ఉన్న గయానీస్ భూభాగాన్ని అధికార పరిధిగా కొనసాగుతున్నది. వెనెజులా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలతో పాటు భారీ మొత్తంలో బొగ్గు, ఇనుప ఖనిజం, బాక్సైట్, బంగారం గనులను కలిగి ఉంది. ఇక్కడ ఎక్కువగా స్పానిష్ మాట్లాడతారు. 98.2 శాతం మంది మాట్లాడే స్పానిష్‌ను అధికార భాషగా గుర్తించారు. స్వదేశీ భాషను 1.3 శాతం మంది, పోర్చుగీస్‌ను 0.1 శాతం మంది, ఇతర భాషలను 0.4 శాతం మంది మాట్లాడతారని అంచనా. బొలివర్ అనేది అక్కడి కరెన్సీ. కాగా, వెనెజులా గ్లేసియర్స్ లేదా హిమానీ నదులను కోల్పోవడం ప్రస్తుతం ప్రధానమైన చర్చనీయాంశంగా మారింది. మంచు యొక్క పెద్ద ద్రవ్యరాశిని హిమానీనది అంటారు. ఇది హిమపాతం దాని ద్రవీభవన రేటును మించిన ప్రదేశాలలో మంచు పేరుకుపోవడం , కుదించడం వల్ల ఏర్పడుతుంది. హిమానీనదాలు చల్లని ప్రాంతాలలో, సాధారణంగా ధ్రువ ప్రాంతాలలో లేదా ఎత్తైన పర్వత ప్రాంతాలలో కనిపిస్తాయి.

## తైవాన్ ఎంపి ఘనకార్యం!



సాధారణంగా చట్టసభల్లో ఏదైనా బిల్లును ప్రవేశపెట్టినప్పుడు, అధికార పార్టీ సభ్యులు అనుకూలంగానూ, ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకంగానూ ఓటు వేస్తారు. కొన్ని సందర్భాల్లో సదరు బిల్లును అడ్డుకోవడానికి సభలో నిరసనలు వ్యక్తం చేస్తారు. స్పీకర్ పోడియం వద్ద బైఠాయిస్తారు. నినాదాలు చేస్తారు. ప్లకార్డులు ప్రదర్శిస్తారు. కానీ, తైవాన్ పార్లమెంటులో పాలక డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డిపిపి)కి చెందిన కువో కువోవెన్ ఏకంగా బిల్లు కాపీని చేజిక్కించుకుని, డెస్క్‌ను దూకి బయటకు పారిపోయే ప్రయత్నం చేశాడు. ఇలాంటి విచిత్ర ఘటన ఇప్పటి వరకూ ఏ దేశంలోనూ జరగలేదని పేర్కొంటూ రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. ఈనెల 17వ తేదీ, శుక్రవారం పార్లమెంటు సంస్కరణ బిల్లు ముసాయిదాను సిద్ధం చేసి, అభిప్రాయ సేకరణ కోసం సభ్యులకు సర్క్యులేట్ చేశారు. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కువోవెన్, ఓటింగ్ కాగితాలను చేజిక్కించుకొని, డెస్క్ పైనుంచి అవతలకు దూకి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనపై స్పందిస్తున్న నెటిజన్లు, పార్లమెంటులో దొంగతనం చేసినట్టు కేసు పెట్టే అవకాశం ఉందా? లేదా? అంశంపై తెగ సెర్చ్ చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు బూతులు తిట్టుకోవడం, కొట్టుకోవడం తైవాన్ పార్లమెంటులో నిత్యం కనిపించే దృశ్యాలు. పోడియం వద్దకుదూసుకెళ్లి, స్పీకర్‌పై సభ్యులు దాడులకు ప్రయత్నించిన ఘటనలు కూడా ఉన్నాయి. దేశాధ్యక్షుడిగా ఎన్నికైన లై చింగ్‌తే ఈనెల 20వ తేదీ, సోమవారం నుంచి బాధ్యతలు చేపట్టనుండగా, అంతకు రెండు రోజుల ముందు ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఓటింగ్ ప్రతిపాదనకు ముందు కొంత మంది పార్లమెంటు సభ్యులు స్పీకర్ సీటు వైపు పరుగులు తీయడం, దూకడం, ఒకరినొకరు కిందకు పడదోసునే ప్రయత్నాలు చేయడం వంటి ఘటనలు జరిగాయి. కువోవెన్ ఓటింగ్ కాగితాలతో పారిపోయే ప్రయత్నం చేసి, ఈ గందరగోళానికి కొత్త రూపాన్నిచ్చాడు.

## వృద్ధులే అదృష్టవంతులు..



వివిధ తరాల మధ్య అంతరాలు ఎప్పుడూ ఉంటాయి. సహజంగా పాత తరంతో పోలిస్తే, కొత్త తరం యువత సంతోషంగా ఉంటుందని అనుకుంటాం. అందుబాటులో ఉన్న అవకాశాల నుంచి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం వరకూ ఎన్నో అంశాలు వారి సంతోషకరమైన జీవితానికి కారణమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కానీ, ప్రపంచ హ్యాపీనెస్ రిపోర్ట్ ప్రకారం, నిన్నటి తరంతో పోలిస్తే, నేటి తరంలో సంతోషం పాళ్లు తక్కువ. వృద్ధులు, యువకుల మధ్య సంతో షం విషయంలో ఎక్కువ తేడా ఉన్న 20 దేశాల జాబితాలో మారిషస్ మొదటి స్థానాన్ని ఆక్రమించింది. పాయింట్లలో చెప్పాలంటే, అక్కడ వృద్ధుల సంతోషం 85 పాయింట్లుకాగా, యువత సంతో షం కేవలం 28 పాయింట్లు. అంటే, ఈ రెండు తరాల మధ్య ఉన్న సంతోష వ్యత్యాసం 57 పాయింట్లు. రెండో స్థానంలో ఉన్న అమెరికాలో వృద్ధులు 62, యువకులు 10 పాయింట్లతో ఉండగా, వ్యత్యాసం 52 పాయింట్లుగా ఉంది. తేడాల విషయంలో కెనడా 50 పాయింట్లతో మూడో స్థానాన్ని ఆక్రమించింది. ఉజ్బెకిస్థాన్, చైనా, జపాన్, మంగోలియా, అల్జీరియా, లిబియా, సింగపూర్ వరుసగా నాలుగు నుంచి పది స్థానాలను ఆక్రమించాయి. యువతలో పెరుగుతున్న నిరుత్సాహానికి ప్రధాన కారణం పెరుగుతున్న నిరుద్యోగిత. చదువులు పూర్తి చేసుకొని, ఉపాధి మార్కెట్‌లోకి వస్తున్న వారి సంఖ్యకు, ఉద్యోగాలకు ఎక్కడా పొంతన లేదు. ఈ భారీ తేడా యువతను నిరంతరం తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నది. పెరుగుతున్న పోటీ కూడా సంతోషం పాళ్లను తగ్గిస్తున్నదని నిపుణులు అభిప్రాయం. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), మార్కెటింగ్ రంగాల్లో పని చేసేవారిపై ఒత్తిడి చాలా ఎక్కువ. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ ఎఐ) రంగ ప్రవేశంతో యువతలో సంతోషం ఆవిరైపోతున్నది. ముఖ్యంగా 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారిలో ఈ ప్రభావాలు అధికంగా ఉన్నాయి. సంతోషం విషయంలో ఇప్పటి వృద్ధులే నయమని ఆ నివేదిక తేల్చిచెప్పింది. వృద్ధులే అదృష్టవంతులు.

## నర్మద విషాదం..



గుజరాత్‌లోని నర్మదా నది ఇటీవల కాలంలో వార్తల్లోకి ఎక్కింది. ముగ్గురు మైనర్లుసహా ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది నర్మదా జిల్లా, పోయిచా గ్రామం వద్ద నర్మదా నదిలో పుణ్య స్నానాలు చేస్తూ మునిగిపోయి మృతి చెందిన ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. భారత ద్వీపకల్పంలో, పశ్చిమాన ప్రవహించే అతిపెద్ద నది నర్మద. నర్మదా కుండ్ అనే చిన్న జలాశయమే ఈ నదికి మూలం. ఇది మధ్యప్రదేశ్‌లోని తూర్పున ఉన్న అమర్‌కంట్ కొండపై, 1,057 మీ (3,467.8 అడుగులు) ఎత్తులో ఉంది. ఈ నది మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ మీదుగా, వింధ్య, సత్పురా కొండ శ్రేణుల మధ్య ప్రవహిస్తుంది, ఇది గుజరాత్‌లోని బరూచ్‌కు ఉత్తరాన 10 కిమీ దూరంలో, కాంబే గల్ఫ్ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది పొడవు 1312 కిలోమీటర్లు (815 మైళ్ళు). ఇది భారతదేశంలోని అతి పొడవైన నదుల్లో ఐదవది. నర్మదా పరీవాహక ప్రాంతం 98,796 చ.కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది, ఇది దేశంలోని మొత్తం భౌగోళిక వైశాల్యంలో దాదాపు 3 శాతం. ఈ బేసిన్ ఉత్తరాన వింధ్య పర్వతాలు, తూర్పున మైకాల శ్రేణి, దక్షిణాన సత్పురాలు, పశ్చిమాన అరేబియా సముద్రం సరిహద్దులుగా ఉన్నాయి. కర్కట రేఖ (ట్రాపిక్ ఆఫ్ కాన్సర్) ఎగువ మైదాన ప్రాంతంలో నర్మదా బేసిన్‌ను దాటుతుంది. అంటే బేసిన్‌లోవ ఎక్కువ భాగం ఈ రేఖకు దిగువన ఉంది. చీలిక లోయలో ప్రవహించే నదుల్లో ఇది ఒకటి. ఉత్తర, దక్షిణ భారత దేశం మధ్య ఇది విభజన రేఖగా ఉంది. ఈ నదీ ప్రవాహం అనేక ఎత్తయిన ప్రాంతాల నుంచి ప్రవహించి, జలపాతాలుగా ఉరకలు వేస్తుంది. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌కు నైరుతి దశలో ఉన్న ధుంధర్ జలపాతం వీటిలో ఒకటి. ఈ నదికి హాలోన్, బంజర్, బర్నా, తవా అనే ఉపనదులు ఉన్నాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# రామా నను బ్రోవుమా! మోదీ మొర

సార్వత్రిక ఎన్నికలు చరమాంకంలో ప్రవేశిస్తున్నాయి. రాజకీయపక్షాలు ప్రచారం ఉధృతం చేశాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీగారయితే సుడిగాలి పర్యటనలతో రోజుకు మూడు నాలుగు బహిరంగసభల్లో గంభీర ప్రసంగాలు చేస్తున్నారు. ఆయన భక్తజన శ్రేణుల్లో తప్ప సామాన్య ఓటరు దేవుళ్లలో హుషారు కనిపించటంలేదు. ప్రతిపక్ష పార్టీలపై అసందర్భ ఆరోపణలు చేయటం మినహా ప్రజలెదుర్కొంటున్న అధిక ధరలు, ఆదాయాల తగ్గుదల, నిరుద్యోగం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి మోయలేని భారంగా తయారైన విద్య, వైద్యం, గృహవసతి, స్వచ్ఛమైన తాగునీరు వంటి నిత్యజీవిత సమస్యలకు సమాధానాలు ప్రధానమంత్రి ప్రసంగాల్లో మచ్చుకైనా వినపడవు. ఆ సమస్యల జోలికి వెళితే ఆయన దశాబ్దకాల ఏలుబడి ఒట్టిడొల్ల అని బయటపడుతుంది. కాబట్టి వాటి నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు సామాన్యులకు అర్థంకాని 'అమృతకాలం', ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ, అంతర్జాతీయశక్తిగా భారత్ ఎదుగుదల వగైరా ఉద్ఘాటనలతో ఈ సారి బిజెపికి 400 సీట్లు ఇవ్వాలని అర్థించేవారు. అయితే నాలుగు దశల్లో 379 నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసిన తదుపరి పరిస్థితిని సమీక్షించుకుంటే ఆశాజనకంగా ఉన్నట్లులేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ముస్లింల పట్ల ద్వేష ప్రస్తావనతో హిందువులను సమీకరించే అలవాటైన వ్యూహం పదును కోల్పోయింది.

ప్రతిపక్షం అధికారంలోకి వస్తే ఐదుగురు ప్రధానులొస్తారు. హిందువుల సంపదను కొల్లగొట్టి ముస్లింలకు పంచుతారు, బంగారం, మంగళసూత్రాలు లాక్కొని ముస్లింలకు ఇస్తారు వంటి పచ్చి విభజనవాద, మతోన్మాద ప్రసంగాలు ఎన్నికల ప్రవర్తనా నియామావళికి విరుద్ధమైనప్పటికీ ఎన్నికల కమిషన్ చెవులకు అవి సుమధుర లలిత సంగీతంలాగే ఉండటం గమనిస్తే, నిష్పక్షపాతంగా,స్వతంత్రంగా వ్యవహరించవల్సిన రాజ్యాంగసంస్థ తన ఆథారిటీని కార్యనిర్వాహక వర్గం వద్ద కుదువబెట్టినట్టవుతోంది. ప్రధాన మంత్రి వంటి అత్యున్నత స్థాయిలోని వ్యక్తికి ఎందుకు ఇంత దిగజారుడు అని చింతనాపరులైన ఓటర్లు పరిశీలిస్తే ఒక విషయం సుబోధకమవుతంది. ఈ ఎన్నికల్లో భావోద్వేగాలను తట్టిలేపే జాతీయసమస్య లేదు. అందువల్ల ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై నిందారోపణలు, స్థానిక సమస్యలు, గుళ్లు గోపురాలు బిజెపి ప్రచారాస్త్రాలైనాయి. నమ్ముకున్న అయోధ్య బాలరామాలయం హిందూ సెంట్‌మెంట్‌ను తట్టిలేపలేదు. అయినా రాముడే దిక్కని నమ్మిన మోదీ–షా ద్వయం హిందువులను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. బాలరామాలయ ప్రతిష్ఠాపనను ప్రతిపక్షాలు బహిష్కరించాయంటూ ముందుగా తప్పుపట్టారు. అయితే లౌకిక రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి మోదీ, మోహన్ భగవత్‌లు ఈ ధార్మికకార్యక్రమాన్ని తమ సొంతింటి పండుగగా నిర్వహించినసంగతి వారు దాటవేస్తున్నారు. హిందువుల్లో 99 శాతం శ్రీరాముణ్ణి ఆదర్శపురుషునిగా ప్రేమిస్తారు. కాని ఆ జగదభిరాముణ్ణి హిందూత్వశక్తులు తమ ఓట్ల కోసం పాచికగా వాడటాన్ని సహించబోరని ఇప్పటికైనా వారికి అవగతమై ఉండాలి. మోదీ మరో అడుగు ముందుకు వేసి 'ఇండియా' కూటమికి అధికారమిస్తే బాలరాముణ్ణి మళ్లీ గుడారంలోకి పంపుతారు. సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేసి రామాలయాన్ని బుల్‌డోజర్లతో కూల్చేస్తారు అంటూ శుక్రవారంనాడు ఉత్తరప్రదేశ్ సభల్లో రెచ్చగొట్టే, విధ్వంసకర ప్రసంగాలు చేశారు. బుల్‌డోజర్లను ఎక్కడ ఉపయోగించాలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వద్ద పాఠాలు నేర్చుకొమ్మని ప్రతిపక్షాలకు సలహాయిచ్చారు. మతకలహాల్లో పాల్గొన్నారనే నెపంతో అక్రమణ స్థలాలంటూ ముస్లింల దుకాణాలు, ఇళ్లు కూల్చివేతకు, మాఫియాగ్యాంగ్ లీడర్‌ల ఆస్తుల ధ్వంసానికి యోగి బుల్‌డోజర్లు ఉపయోగించారు. తర్వాత పలు బిజెపిపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి విధ్వంస పుస్తకంనుండి ఒకపేజీ తీసుకుని పేదలపై బుల్‌డోజర్లు ప్రయోగించారు. అసమ్మతిని అణచివేసే అప్రజాస్వామిక పనిముట్టుగా వాటిని ఉపయోగించారు. సనాతన ధర్మరక్షకుడైన నరేంద్రమోదీ దక్షిణ, ఉత్తర భారత్ విభజన తేవటానికి ఆ అధర్మానికి వ్యతిరేకంగా తమిళనాడుమంత్రి చేసిన వ్యాఖ్యలను సైతం ఉపయోగించుకున్నారు. తమిళనాడు నాస్తికత్వం, ఉత్తరాది ఆస్థికత్వం తూర్పు–పడమర అని అందరికీ తెలుసు. రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్‌లకు రక్షణ అంశం ఈ ఎన్నికల్లో బిజెపి మెడకు ఉరితాడైంది. దాన్నుంచి బయటపడలేక గిజగిజ తన్నుకుంటూ అధిక ప్రసంగాలు చేస్తున్నారు. అందులో ప్రధాన మంత్రి చోదకశక్తి కావటమే భారతీయుల దురదృష్టం!

ప్రజాపక్షం
19-05-2024, ఆదివారం

# హిందీ పోతుగడ్డలో అసంతృప్తి సెగలు

**నకులేసింగ్ సాహ్నీ**
**(ఇండిపెండెంట్ డాక్యుమెంటరీ ఫిలింమేకర్, చల్‌చిత్ర అభియాన్ వ్యవస్థాపకుడు)**

2019–2024 లోక్‌సభ ఎన్నికల మధ్య కొట్టొచ్చినట్లు కనిపించేది ఏమైనా ఉందా అంటే అది ఎటువంటి తరంగం (వేవ్) లేకపోవటం – మోదీ వేవ్, ఎన్‌డిఎ వేవ్, ఇండియా వేవ్ లేదా తుదకు మందిర్ వేవ్ కూడా లేదు. ఎన్నికలకు జాతీయ కథనం లేకపోవటంతో ఉత్తరప్రదేశ్‌లో ఈ పర్యాయం స్థానిక అభ్యర్థులు, స్థానిక సమస్యలు ఓటర్ల ఎంపికలను నిర్ణయిస్తున్నాయి. మేము ఇప్పటివరకు తొలి నాలుగు దశల్లో పోలింగ్ జరిగిన 14 లోక్‌సభ నియోజకవర్గాల గుండా ప్రయాణించాం – అవి పశ్చిమ యుపిలోని ఘాజియాబాద్, మీరట్, బిజ్నోర్, నగీన, సహరాన్‌పూర్, కైరానా, ముజఫర్‌నగర్ నుంచి ఎటావా, ఖెరి, ధావ్‌రాహ్రా, కన్నోజ్, బదాయున్, మెయిన్‌పురి, హత్రాస్. మేము ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో సగటున రెండు విధానసభ ప్రాంతాలగుండా ప్రయాణించాం. కులాలకు అతీతంగా వేధిస్తున్న అత్యంత ప్రధాన సమస్యల్లో ఒకటి వ్యవసాయ సంక్షోభం. బిజెపిని బలపరిచే బ్రాహ్మణ సమాజం సైతం రైతులుగా తమ బాధలను ఏకరువు పెట్టారు. రైతులందరూ ఎదుర్కొంటున్న నిర్దిష్టమైన సమస్యల్లో ఒకటి విడిచిపెట్టబడిన పశువులు. అవి పొలాల్లో పంటలు పాడుచేస్తున్నవి. తమ మగ పశువులను ఏమి చేసుకోవాలో అనేకమంది రైతులకు మార్గం తెలియటంలేదు. అసలే పెరుగుతున్న ఆర్థిక దుస్థితితో సతమతమవుతున్న రైతులకు ఇదొక ఆర్థిక భారం. ఈ సమస్య పరిష్కారానికి ఆవు షెడ్‌లు నిర్మించే ప్రభుత్వ ప్రయత్నం సఫలం కాలేదు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద మూడు నెలలకొకసారి తమ బ్యాంక్ ఖాతాల్లో వేస్తున్న రూ.500 కన్నా ఈ నష్టాలు హెచ్చుగా ఉన్నాయి. యూరియా సంచులు కుంచించుకుపోవటం దీనికి తోడైంది –ష్రింక్‌ఫ్లేషన్ – అనగా యూరియాధర స్థిరంగా వుంది, కాని సంచుల సైజు తగ్గింది. అంతేగాక చెరకుకు ప్రభుత్వ నిర్ణయ ధర గత 7 సంవత్సరాల్లో క్వింటాల్‌కు సుమారు రూ.45 మాత్రమే పెరిగింది – ఇది గత ప్రభుత్వాలు ఇచ్చిన దానికన్నా తక్కువ. ఇది పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో అనేకమంది యాదవయేతర, జాట్‌యేతర ఒబిసిలు బిజెపి నుండి దూరం జరగటానికి దారితీసింది. లోధ్ రాజ్‌పత్రులు, కుర్మీలు, కుష్‌వాహ్‌లు, సైనీలు వంటి కులాల వారు ఇందులో ఉన్నారు. వీరంతా సన్నకారు రైతులు. రాష్ట్రీయ లోక్‌దళ్ ఎన్‌డిఎలో చేరినప్పటికీ, కైరానా, ముజఫర్‌నగర్, అలీఘడ్, ఆగ్రా వంటి నియోజకవర్గాల్లో జాట్ ఓటర్లు ఆశించినంత గుండుగుత్తగా బిజెపి కూటమివైపు మరలలేదు. 2020–21లో 13 నెలలపాటు సాగిన చరిత్రాత్మక రైతు ఉద్యమం నాటి అసంతృప్తులు జాట్ ఓటర్లలో కొసాగుతున్నాయి. వారు బిజెపి – ఆర్ఎల్‌డి అలయెన్స్‌ను అనుమానంతో చూస్తున్నారు. (చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించి మోదీ ఆర్ఎల్‌డిని తమ బుట్టలో వేసుకున్నారు). బిజెపికి ప్రధాన మద్దతుదారులు తక్కువ సంఖ్యలో ఓటింగ్ కేంద్రాలకు రావటం వల్ల అనేక కేంద్రాల్లో ఓటింగ్ తగ్గింది. బిజెపికి వ్యతిరేకంగా మీరట్, కైరానా, ముజఫర్ నగర్‌లలో పెద్ద ఎత్తున జరిగిన రాజపుత్రుల పంచాయితీలు మరో కారణం. బిజెపి నాయకులు ఈ సమాజానికి వ్యతిరేకంగా చేసిన కొన్ని ప్రసంగాలకు నిరసనగా ఈ పంచాయతీలు జరిగాయి. మిహిర్ భోజ్ విగ్రహా ఫలకంపై ఆయన కులం గుర్జార్ అని రాసినప్పుడు బిజెపి 'మౌనం' వహించిందని కూడా అనేకమంది ఆరోపిస్తున్నారు. అతడు రాజ్‌పుత్రుడని వీరినమ్మకం.

> రాష్ట్రీయ లోక్‌దళ్ ఎన్‌డిఎలో చేరినప్పటికీ, కైరానా, ముజఫర్‌నగర్, అలీఘడ్, ఆగ్రా వంటి నియోజకవర్గాల్లో జాట్ ఓటర్లు ఆశించినంత గుండుగుత్తగా బిజెపి కూటమివైపు మరలలేదు. 2020–21లో 13 నెలలపాటు సాగిన చరిత్రాత్మక రైతు ఉద్యమం నాటి అసంతృప్తులు జాట్ ఓటర్లలో కొసాగుతున్నాయి. వారు బిజెపి – ఆర్ఎల్‌డి అలయెన్స్‌ను అనుమానంతో చూస్తున్నారు. (చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించి మోదీ ఆర్ఎల్‌డిని తమ బుట్టలో వేసుకున్నారు). బిజెపికి ప్రధాన మద్దతుదారులు తక్కువ సంఖ్యలో ఓటింగ్ కేంద్రాలకు రావటంవల్ల అనేక కేంద్రాల్లో ఓటింగ్ తగ్గింది

పాలకపార్టీపట్ల ఈ సముదాయాల్లో కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ వాటిని తమవైపు రాబట్టుకోవటంలో ప్రతిపక్ష ఇండియా కూటమి విఫలమైంది. పర్యవసానంగా ఓటర్ ఉత్సాహం అతితక్కువ స్థాయిలో ఉంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపట్ల కుతకుతలాడుతున్న అసంతృప్తి కూడా కనిపించింది. యుపి కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ 2024 పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా వాయిదావేయటం కూడా నిరుద్యోగుల్లో ఆగ్రహానికి కారణమైంది. ఈ పరీక్షకు 48 లక్షల మంది పోటీపడ్డారు. యోగి ప్రభుత్వంలో ప్రశ్నాపత్రాల లీకేజీ సర్వసాధారణం కావటం యువ ఓటర్లలో నిస్పృహను పెంచింది. ఇటీవల ఆరంభించిన అగ్నివీర్ (ఆర్మీలోకి స్వల్పకాల రిక్రూట్‌మెంట్) పథకం కూడా మరో నిరుత్సాహ కారకమైంది. దళితులు, షెడ్యూల్డు కులాల్లో మరో ఆందోళన కూడా ఉంది. కర్నాటకకు చెందిన బిజెపి ఎంపి అనంతకుమార్ హెగ్డే ఈ మార్చి 25న ఒక ప్రకటనలో భారత రాజ్యాంగాన్ని తిరగ రాయాలంటూ, లోక్‌సభలోని 543 సీట్లలో 400 గెలుచుకోకపోతే అది సాధ్యంకాదన్నారు. కనీసం మరో ముగ్గురు బిజెపి అభ్యర్థులు కూడా అదే ఉద్దేశాన్ని బహిరంగంగా వ్యక్తీకరించారు. వారి ప్రకటనల వీడియోలు వైరల్ అయినాయి. దాంతో 'ఈసారి 400 సీట్లు' అన్న బిజెపి నినాదం రిజర్వేషన్‌ల విషయంలో అభద్రతను పెంచుతున్నది. జాతవ్‌యేతర ఎస్‌సి సముదాయాలు ఇందులో ఉన్నారు. వారిలో అత్యధికులు గత కొద్ది సంవత్సరాలుగా పెద్ద ఎత్తున బిజెపికి ఓటుచేస్తున్నారు. ఈసారి బిఎస్‌పి, ఎస్‌పి పొత్తుపెట్టుకోకపోవటం బిజెపిని నిరుత్సాహానికి గురిచేస్తున్న మరో అంశం. 2019లో ఎస్‌పి –బిఎస్‌పి పొత్తు కారణంగా, బిఎస్‌పి అభ్యర్థులు పోటీలోలేని అనేక నియోజకవర్గాల్లో దళిత ఓటర్లు బిజెపివైపు మళ్లారు. ఈ ఓటర్లలో కొందరు ఇండియా కూటమివైపు మరలినట్లు ఈ పర్యాయం స్పష్టమైన మార్పు కనిపిస్తున్నది. బిజెపికి వ్యతిరేకంగా బలమైన అభ్యర్థి ఎవరా అని వారు వెతుక్కుంటున్నారు. ముస్లింలు సైతం బిజెపికి వ్యతిరేకంగా బలమైన అభ్యర్థి కొరకు చూస్తున్నారు. నగీనాలో ముస్లింలు, దళితులు ఇరువురూ ఆజాద్ సమాజ్ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ ఆజాద్ వెనుక సమీకృతమైనారు. తమ సమాజం సమస్యలపై సమాజ్‌వాది పార్టీ మౌనంగా ఉంటున్నందున ముస్లింలు ప్రత్యామ్నాయం వెతుక్కున్నారు. పశ్చిమ యుపి నుండి ముందుకు వెళితే, అఖిలేశ్‌యాదవ్ పిడిఎ నినాదం గంట మోగిస్తున్నది. పి అనగా పిచ్‌డె (వెనుకబడిన తరగతులు), డి అనగా దళితులు, ఎ అనగా అల్పసంఖ్యాకులు (లేదా మైనారిటీలు). అనేకమంది దీన్ని 'పండిట్ హఠావో అభియాన్' (బ్రాహ్మణుల ప్రచారాన్ని ఓడించండి) అని కూడా పిలుస్తున్నారు.

గ్రామీణప్రాంతాల్లోని మహిళలు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద తగినన్ని ఇళ్లు కేటాయించకపోవటం పట్ల అసంతృప్తితో ఉన్నారు. గ్రామం తర్వాత గ్రామం వారు తమ దుర్భర జీవన పరిస్థితులను చూపుతున్నారు. ఎంతోగొప్పగా చెప్పుకున్న ఉజ్వల యోజన వల్ల అనేక మంది మొదటిసారి గ్యాస్ కనెక్షన్‌లు పొందినప్పటికీ, తమ సిలెండర్‌లకు తిరిగి గ్యాస్ కొనుగోలు చేసే శక్తిలేక వారు తిరిగి మట్టి స్టవ్‌లు వాడుతున్నారు. అయితే, వివిధ సముదాయాల్లో అసంతృప్తి పెరుగుతున్నప్పటికీ, బిజెపిని తక్కువ అంచనా వేయటం పొరపాటవుతుంది. సంఖ్యరీత్యా గణనీయమైన బ్రాహ్మణులు, బనియాలు (వ్యాపారవర్గం) వంటి కులాలు యుపి అంతటా బిజెపి వెనుక సమీకృతమై ఉన్నాయి. రాజపుత్రుల ఆగ్రహం మధ్య, తూర్పు యుపిలో చెప్పుకోదగ్గ ప్రభావం చూపినట్లు లేదు. బిజెపికి ఇప్పటికీ అన్నికులాల్లో బలమైన క్యాడర్‌ల పునాది ఉంది.

కైరానాలో ఒక ఓటరు ఇలా అన్నారు : ''ఓటర్లు నిశ్శబ్దంగా ఉన్నారు – దాని అర్థం ఏమైనా కావచ్చు''.

(అభిప్రాయాలు వ్యక్తిగతం)

**(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)**

# అప్పుడే పదేళ్ళు గడిచిపోయాయి...




చూస్తుండానే పదేళ్ళు పూర్తయిపోతున్నా యి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన ద్వారా ఏర్పడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం మరో రెండు వారాలలో దశాబ్ద కాలం కానుంది. 2014 జూన్ 2న అపాయింటెడ్ డే రోజున తెలంగాణ రాష్ట్రంతో పాటు, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ మహానగరాన్ని పదేళ్ళ పాటు ఉమ్మడి రాజధానిగా ప్రకటించారు. అనేక సందేహాలు, అనుమానాలు, భయాల మధ్య ఏర్పాటైన ప్రత్యేక రాష్ట్రంలో సీమాంధ్రుల భవిష్యత్తు ఏమిటనే ఆందోళనలను పదేళ్ళ కాలం పటాపంచలు చేసింది. ఉద్యమం కాలంలో చెలరేగిన భావోద్వేగాలను చూసి తెలంగాణ ఏర్పాటైన తరువాత భారీగా ఆంధ్రప్రదేశ్‌కు వలసలు ఉంటాయని, ఇక్కడ కలిసి ఉండడం అసాధ్యమనే అనవసర భయాలను కాలం చెరిపేసింది. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా హైదరాబాద్‌లోనే కొలువుదీరారు. ప్రస్తుత అసెంబ్లీ భవనంలోనే ఇరు రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాలు జరిగేవి. అలాగే సెక్రెటేరియెట్‌లో కూడా రెండు రాష్ట్రాల సచివాలయాలు ఉండేవి. ఒక రాజధాని రెండు ముఖ్యమంత్రులతో మరో చండీగఢ్‌లా హైదరాబాద్ లో పరిపాలన సాగింది. అయితే, 2015లో జరిగిన పరిణామాలతో, భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దూరంగా ఉండడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడకు వెళ్ళిపోవాలని నిర్ణయించారు. అదే ఏడాది ప్రధాని మోదీ చేత నూతన రాజధాని అమరావతికి శంకుస్థాపన వేయించడంతో హైదరాబాద్‌తో ఆంధ్రప్రదేశ్‌కు పరిపాలనా అనుబంధం ముగిసింది. కాని, తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సామాజిక బంధం గతంలో మాదిరిగానే కొనసాగుతోంది. ఇక్కడ నివసిస్తున్న సీమాంధ్రులు పెద్దగా ఎవరూ తమ స్వస్థలాలకు తిరిగి వెళ్ళిన దాఖలాలు లేవు. అలాగే ఇక్కడ నుండి వెళ్ళిపోవాలని తెలంగాణ ప్రజలు భయపెట్టిన ఉదంతాలు అసలే లేవు. ఇక్కడ వ్యాపారాలు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ ఆంధ్ర ప్రదేశ్‌లో చదువుకున్న యువకులు ఐటి ఉద్యోగాలకు, ప్రైవేటు ఉద్యోగాలకు హైదరాబాదే గమ్యస్థానమంటే అతిశయోక్తేమి కాదు.

### రాజకీయాలలో మమేకం

తెలంగాణ ఏర్పాడిన తరువాత రాజకీయాలలో ఆంధ్రపదేశ్ మూలాలు కలిగిన రాజకీయ పార్టీల ప్రాభవం తగ్గిపోయింది. తొలి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి 15 ఎంఎల్‌ఏ స్థానాలు, ఒక ఎంపి స్థానం, వైఎస్ఆర్‌సికి ఒక ఎంపి, 3 ఎంఎల్‌ఏ స్థానాలు లభించాయి. ఆ తరువాత ఓటుకు నోటు ఉదంతంతో పాటు, రాజకీయ ఫిరాయింపులతో టిడిపి తెలంగాణలో క్రమంగా బలహీనమైంది. పైగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండడంతో, అక్కడి రాజకీయాలపైనే ప్రధాన దృష్టి పెట్టడంతో ఇక్కడి రాజకీయాలకు దూరంగానే ఉన్నారు. అన్నిటికి మించి , టిడిపి ఎంఎల్‌ఏలు, పట్టణ, గ్రామాలలో ప్రజా ప్రతినిధులు ప్రత్యామ్నాయంగా టిఆర్ఎస్‌ను ఎంచుకోవడంతో తెలుగుదేశం పార్టీ ప్రాభవం కోల్పోయింది. ఇక వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్‌రెడ్డి కూడా ఎపి రాజకీయాలనే కేంద్రంగా చేసుకోవడంతో పాటు, ఇక్కడ పోటీ చేయబోమని ప్రకటించడంతో, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు టిఆర్ఎస్‌లోకే వెళ్ళిపోయారు. తెలంగాణ రెండవ శాసనసభకు జరిగిన ముందస్తు ఎన్నికల్లో తన చిరకాల ప్రత్యర్థి కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్‌తో పొత్తు కట్టి, చంద్రబాబునాయుడు తమ టిడిపిని మహాకూటమిలో భాగస్వామిని చేశారు. నాటి ఎన్నికల్లో టిడిపికి ఆశించిన ఫలితాలు రాలేదు. కేవలం ఖమ్మంలో రెండు స్థానాలను గెలుచుకొంది. ఆ ఇద్దరు ఎంఎల్‌ఏలు కూడా టిఆర్ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ కార్యకర్తలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యారు. జిహెచ్ఎంసిలో జరిగిన ఎన్నికల్లో కూడా ఆశించిన ఓట్లు దక్కలేదు. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దున ఉండే ఖమ్మం జిల్లాలో కొంత టిడిపి అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు. గత డిసెంబర్ శాసనసభ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఖమ్మం లో బహిరంగ సభ ఏర్పాటు చేసి, టిడిపి పునరుత్తానానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో, ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. అయితే, టిడిపిలో ఉన్న సీమాంధ్ర మూలాలు ఉన్న ఎంఎల్‌ఏలు, ఎంపిలు ఎక్కువగా టిఆర్ఎస్‌లో చేరి, ఇక్కడి రాజకీయాలతో మమేకమైపోయారు. ప్రజలు కూడా వారిలో చాలా మందిని తెలంగాణ ప్రజలు ఆదరించి గెలిపించారు. అలాంటి వారిలో మాగంటి గోపీనాథ్, అరికెపుడి గాంధీ వంటి వారు వరుసగా మూడవ సారి కూడా విజయం సాధించడం అందుకు నిదర్శనం.

### విభజన హామీలు మాత్రం ఎక్కడివక్కడే

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు అన్యాయమే జరిగిందని చెప్పాలి. ముఖ్యంగా ఈ బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా స్వయంగా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్న ప్రత్యేక హోదా హామీని, పదేళ్ళలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నెరవేర్చలేదు. అలాగే పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేకపోయింది.

ఇక తెలంగాణ విషయానికి వస్తే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఆదివాసీ యూనివర్సిటీ,స్టీల్ ఫ్యాక్టరీ, ఉభయ రాష్ట్రాల రాజధానులు మధ్య ర్యాపిడ్ రైలు, ఎపి రాజధాని నుండి హైదరాబాద్, తెలంగాణ ప్రధాన నగరాల మధ్య రోడ్ల అనుసంధానత వంటి ప్రాజెక్టులు కూడా దశాబ్ద కాలంలో ముందడుగు వేయలేదు. కేవలం ఎన్నికలకు ముందు బడ్జెట్‌లో తూతూ మంత్ర ప్రకటనలే వెలువుడుతున్నాయి. విభజన తరువాత ఏడాది కాలంలోనే విశాఖపట్నంలో , విజయవాడ – తెనాలి గుంటూరు మెట్రోపాలిటన్‌లో మెట్రో రైలు హామీ ఊసే లేకుండా పోయింది. దీనికి ఢిల్లీలో దశాబ్ద కాలంలో అధికారంలో ఉన్న బిజెపిదే ప్రధాన బాధ్యత.

### పరిపక్వత సాధించిన ప్రజలు

ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజల మధ్య భావోద్వేగ పూరిత వైషమ్యాలకు పదేళ్ళ కాలంలో దాదాపు కాలం చెల్లిందనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే తెలంగాణ ఏర్పడిన తొలినాళ్ళలో నదీ జలాలు, నిధుల వాటాకు సంబంధించి ఇటు వైపు నుండి లేదా అటు వైపు నుండి రాజకీయ నాయకులు చేసే విమర్శలకు ప్రజల్లో భావోద్వేగ స్పందనలు వెలువడేవి. ఇది తొలి ఐదేళ్ళ కాలంలో కొనసాగింది. వీటిని నాయకుల ఎన్నికల అంశాలుగా కూడా మలుచుకున్నారు. 2018 శాసనసభ ఎన్నికల్లో ఇది కొంత మేరకు పని చేసింది కూడా. ఇటీవల తెలంగాణ శాసనసభ ఎన్నికలకు కొద్ది గంటల ముందు నాగార్జున సాగర్‌డ్యాం వద్ద ఎపి పోలీసుల మొహరింపు సంఘటన జరిగినప్పటికీ తెలంగాణ ఎన్నికలపై భావోద్వేగ పూరిత ప్రభావం చూపలేదనేని స్పష్టమైంది. అలాగే ఎపి నేతలు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు పొడిగించాలని చేసిన ప్రకటనలకు కూడా అక్కడ కూడా ప్రజల్లో పెద్ద ఆసక్తి రేకెత్తించలేదు.

ఇది శుభ పరిణామం. విడిపోయినా అన్నదమ్ములలా కలిసుండాలనే ఉద్యమ కాల నినాదానికి వాస్తవ రూపం.

## ప్రతిభ చూపిన పట్టణ విద్యార్థులు

ప్రజాపక్షం / మిర్యాలగూడ : ఎప్ సెట్ ఫలితాల్లో పట్టణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకై నిర్వహించి ఎప్ సెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించారు.

### 275వ ర్యాంకు సాధించిన అద్విత్ కృష్ణ




పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థి బికుమళ్ల అద్విత్‌కృష్ణ 275వ ర్యాంకు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడని కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కళాశాల విద్యార్థులు ఎస్.సమీర్ 1278, డి.అరవింద్ 3547, సంజన 3547, ఆర్.అనిత 8448వ ర్యాంకులు సాధించారన్నారు. మరో పది మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంకులతో సత్తా చాటారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్.రెడ్డి, హన్మంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థత



ప్రజాపక్షం/చౌటుప్పల్ : హోటల్ ఆహారం తిని అస్వస్థతకు గురైన ఘటన చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు దివిస్ కంపనీ ఎదురుగా అంకిరెడ్డి గూడెం స్టేజీ వద్ద ఉన్న నాగేంద్ర హోటల్‌లో శుక్రవారం రాత్రి ఇంటింకి తినుబండారాలు తీసుకెళ్లారు. రాత్రి విపరీతమైన కడుపు నొప్పి,వాంతులతో పిల్లలు పెద్దలు ఇబ్బంది పడ్డారు. ఆరెగూడెం గ్రామంలో 8 మంది, కాట్రేవు గ్రామంలో 8 మంది ఫుడ్‌పాయిజన్ భారిన పడ్డారు. శనివారం ఉదయం ఫుడ్ సేఫ్టి అధికారులకు, వైద్య అధికారులకు సమాచారం ఇవ్వడంతో అంకిరెడ్డి గూడెం వద్ద ఉన్న హోటల్‌ను తనిఖీ చేశారు. హోటల్ అపరిశుభ్రంగా ఉందని, అందులో ఉన్న సామాన్లు సైతం అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వంటల కోసం వాడే నూనే నల్లగా ఉందని బాధితులు చెప్పారు. హోటల్‌ను సీజ్ చేసి నిర్వహకులపై చర్యలు తీసుకోనున్నట్లు డాక్టర్ సుమన్ కళ్యాణ్ తెలిపారు.బాధితుల ఇండ్లలోకి వెళ్ళి ఆర్యోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాధితులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిహెచ్.కాంటంరాజు,వైద్య సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లను కలిసి వారి మొదటి ప్రాధాన్యత ఓటును మన ప్రేమేందర్ రెడ్డికి వేసేలాగా అభ్యర్థించాలని కోరారు. యాదాద్రి జిల్లా పార్టీ అధ్యక్షులు పాశం భాస్కర్ అధ్యక్షతన స్థానిక వివేరా హోటల్ నందు 27వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జ ప్రేమేందర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ , పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేత , గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షులు వర్షిత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ధనంజయ, భువనగిరి పార్లమెంట్ ప్రబారి పాపారావు, భువనగిరి పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, ఎమ్మెల్సీ ఉపాయనిక పొలిటికల్ కోఆర్డినేటర్ తాడూరి శ్రీనివాస్, భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్నం శివకుమార్, ఉట్కూరి అశోక్ గౌడ్, చందా మహేందర, జిల్లా అధికార ప్రతినిధి అక్కతోట రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి



ప్రజాపక్షం/చందంపేట : నల్గొండ జిల్లా సాగు, తాగు నీరు అందించేందుకు రూపకల్పన చేసిన ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు పనులు గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలన పూర్తి నిర్లక్ష్యానికి గురై పనులు ముందుకు సాగకుండా సాంకేతిక లోపాలు, విద్యుత్ చార్జీల బకాయిలు, కార్మికుల వేతనాలు చెల్లించకపోవడంతో పాటు టన్నెల్ బోరింగ్ మిషన్‌లో వచ్చిన ఇబ్బందుల కారణంగా ప్రాజెక్టు పనులు గత పది ఏళ్లుగా నత్తనడకన సాగుతూ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి పది సంవత్సరాల కాలంలో ఏ ఒక్క రోజు కూడా ప్రాజెక్టును సందర్శించిన పాపాన పోలేదని దీంతో ప్రాజెక్టు పనులు రెండు అడుగులు ముందుకు నాలుగడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. గడిన అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును పూర్తి చేసిదేవరకొండ నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందిస్తామని ఇప్పుడున్న డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మండల రైతులకు హామీ ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తరుణంలో త్వరితగతిన ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని అదే విధంగా ప్రాజెక్టు కింద భూములు కొల్పోయిన నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య కోరారు. ఈ మధ్య కాలంలో జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభం అవుతాయని చెప్పడంతో మండలంలోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## ట్రైబల్‌కాలేజీలో అడ్మీషన్లకు దరఖాస్తు

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా లో 2024/25 విద్యా సంవత్సరానికి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల తక్షణ ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ రీజియన్ ప్రాంతీయ సమన్వయాధికారి కె.లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2023/24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల / కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (బాలు), అవంతిపురం, మిర్యాలగూడలో ఈనెల 23 న బాలురకు, 25న బాలికలకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు. స్పాట్ అడ్మిషన్ కు హాజరగు విద్యార్థిని, విద్యార్థులు ఉదయం 9.00 గంటల నుండి తమ ఒరిజినల్ టీసీ, మెమో, స్టడీ కండక్ట్, కుల, ఆదాయ ధృవీకణ పత్రాలు, వాటి జీరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డ్, 3 కలర్ పాస్పోర్ట్ సైజు ఫోటో లతో స్పాట్ అడ్మిషన్ కు హాజరు కావాలని సూచించారు.

# దివ్యాంగులకు ప్రత్యేక గదులు

### గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు
### కరీంనగర్ జిల్లాలో 18663 మంది అభ్యర్థులు
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షల సంధర్భంగా సెల్‌ఫోన్‌లను , ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గ్రూప్1 పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కరీంనగర్‌లో గ్రూప్ వన్ ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు 36 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 18663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పరీక్ష జరిగే రోజున ఉదయమే తగిన భద్రత మధ్య ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలను తరలించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు కన్ఫ్యూజ్ కాకుండా ఒక ప్రధాన గేటు ద్వారానే పరీక్ష కేంద్రంలోకి పంపించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని పేర్కొన్నారు. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని, 10 గంలటలకు పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయాలని ఆదేశించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు చూసుకోవాలని , నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మే 22న హైదరాబాద్‌లో బయోమెట్రిక్ పోలీస్ ఆఫీసర్లు, పోలీస్ నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. సీసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా సాగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. టిఎస్‌పిఎస్‌సి నిబంధనలకు అనుగుణంగా పరీక్ష జరిగేలా చూడాలన్నారు. దివ్యాంగులు, అంధ అభ్యర్థులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో పవన్‌కుమార్, డిసిపి లా అండ్ ఆర్డర్ లక్ష్మీ నారాయణ, జగిత్యాల జేఎన్టీయు కళాశాల ప్రొఫెసర్ బి.సతీష్ కుమార్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ సృజన్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెంట్ కాళీచరణ్, కరీంనగర్ ఉమెన్స్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, రజినీ తదితరులున్నారు.

## ఎన్నికల కౌంటింగ్ విధులను జాగ్రత్తగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన



ప్రజాపక్షం /నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ లో అధికారులు, సిఇబంది బాగా పనిచేశారని, ఇదే ఉత్సాహంతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయాలని నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ దాసరి చందన అన్నారు.పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పై శనివారంకలెక్టరేట్ లోని ఉదయాదిత్య భవన్లో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ కౌంటింగ్ టేంటింగ్ వద్ద పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అలర్ట్ గా ఉండాలన్నారు . కౌంటింగ్ ప్రక్రియలో ఏ చిన్న సమస్య తలెత్తిన వెంటనే ఆర్వో, ఏఆర్ఓ ల దృష్టికి తీసుకురావాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే మైక్రో అబ్జర్వర్స్, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ సెంటర్ లోకి ప్రవేశించిన సమయం నుండి ఏఏ స్టేజీలలో ఎటువంటి పనులు చేయాలి ఎటువంటి పనులు చేయకూడదు అనే విషయాలకు సంబంధించి ట్రైనర్ బాలు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ పులిచింతల నటరాజన్, డిఆర్డిఓ నాగిరెడ్డి,నల్గొండ దేవరకొండ, హుజూర్నగర్ సూర్యాపేట, చండూరు ఆర్డీవోలు, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్ లు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### షరతులు లేకుండా వరికి రూ.500 బోనస్ చెల్లించాలి
### ఏఐకెఎస్ జిల్లా కార్యదర్శి పైడిపల్లి రాజు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకెఎస్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్, కల్లాలలో, ఐకెపి కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, పండ్లతోటల్లో మామిడి, సపోటా, బొప్పాయి తదితర కాయలు ఈదురు గాలులకు నేలమట్టమై తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతులను కాపాడాలన్నారు. పిడుగుపాటు వల్ల చాలా ప్రాంతాల్లో ఆవులు, గేదెలు మృతి చెందుతున్నాయని, వీటికి అంచనా వేసి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి రైతన్నకు ప్రభుత్వం భరోసాగా నిలవాలని, సన్నరకం , దొడ్డురకం అని తేడాల లేకుండా రూ.500 బోనస్‌ను వెంటనే అందజేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు మాత్రమే రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటనలు వస్తున్నాయని, దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో 80 శాతం రైతులు దొడ్డు వడ్లను పండిస్తారని, సన్న వడ్లను కేవలం 20 శాతం మంది మాత్రమే పండిస్తారని పేర్కొన్నారు. దొడ్డు వడ్లను పండించే రైతులు అధికంగా సన్నచిన్నకారు రైతులేనని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరిస్తే కాలగర్భంలో కలవక తప్పదని ఆయన హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ఆదుకోవాలని పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే మన లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ : ప్లాస్టిక్ రహిత సమాజమే మన ముందున్న లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్లు సిహెచ్ ప్రియాంక, బి.ఎస్.లతలతో కలసి జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలసి వెబెక్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక అమలు చేయాలని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, పశువులు, పక్షులు వ్చే తరం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని సూచించారు. జిల్లా స్థాయి అమలులో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సిహెచ్ ప్రియాంక నోడల్ అధికారిగా,అలాగే కలెక్టర్‌ట్‌కి నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత వ్యవహరిస్తారని తెలిపారు.ముందుగా కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని కార్యాలయాల్లో అమలు చేయాలని ,రెండవ విడతలో ఆర్డీవో, ఎంపిడివో, తహసీల్దార్ కార్యాలయాల్లో, మూడవ విడతలో పాఠశాలలు,వసతి గృహాలు, హాస్ప టల్స్‌లో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా వచ్చే మంగళవారం నుండి కలెక్టరేట్‌లో వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ సంచులు నిషేధమని లేనియెడల సంబంధిత కార్యాలయానికి జరిమాన ఉంటుందని అలాగే అన్ని కార్యాలయాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అంతక ముదు ప్లాస్టిక్ వలన జరిగే హానిపై వివరించారు. కార్యక్రమంలో సీఈవో అప్పారావు, పిడి మధుసూదన్‌రాజు, ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఈడిఎం గప్పార్, జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రినిటీ విద్యార్థుల విజయకేతనం




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఇఎపిసెట్ 2024 ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. ఈ సంధర్బంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి విధ్యార్థులను ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళికతో ,ఒత్తిడి లేని విద్యావిధానంతో ఈ ర్యాంకులు సాదించడం జరిగిందన్నారు. ట్రినిటీ జూనియర్ కళాశాలకు చెందిన జె.హానికర్ అత్యుత్తమ ర్యాంకు 44 సాధించడం గర్వకారణమన్నారు. అదే విధంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి విధ్యార్థులు పి.ప్రణయ్ (773), వై అశ్లేష (1254), వి.శ్రీతేజ (1255), వై.అశ్విత (1551), సిహెచ్ విగ్నేష్ (1624), అయేషా మహజబీన్ (1627), ఫిజ్జా అతీక్ (1748), ఎస్.శ్రీలక్ష్మి (2159), ఎం.హర్ష వర్ధన్ (2280), ఎన్.గంగ శ్రీ (2372), శ్రీ దీప (2682), సిహెచ్.రంజిత (2815), మదిహ ఫాతిమా (2913), ఎం.ఆశిష్ (2954), కె.రాణి (2998), వి.నాగజ్యో_ (3059), ఎ.హర్షిత (3266), పి.స్మరణి (3502), అంశారా సహర్ష్ (3877), అతిఫా ఫాతిమా (4012), ఎల్.ప్రతిమ (4101), బుస్రా ఇమ్రాన్ (4255), బి.వైష్ణవి (4302), జి.దివ్య (4422), పి.హంసిని (4609), జె.కీర్తన (5041), ఎన్.దేవిక కృష్ణన్ (5050), కె.శృతి (5080), కె.అర్చన (5225), పి.జ్యోతి ప్రకాష్ (5267), సిహెచ్. మోహిత్ రెడ్డి (5343), కె.సాయి ప్రద్యుమ్న ఆచార్య (6286), జె.హేమశ్రీ (6655), ఎల్.గణేష్ (6729), సిహెచ్.జాన్ (7578), ఆర్.లక్ష్మి ప్రసన్న (7675), ఆర్.రతన్ కుమార్ (7757), పి.దుర్గ భవాని (8016), ఎ.సాహిత్య (8273), కె.శశాంక్ (8329), ఎ.వైష్ణవి (8415), డి.అలేఖ్య (8473), బి.కార్తీక్ (8580), పి.వినయ్ (9342), కె.శరణ్య (9591), ఎన్.స్నేహిత (9757) ర్యాంకులు సాధించారు. ఇవే కాకుండా మరెన్నో ర్యాంకులు సాధించారని, రాబోయే కాలంలో మరింత మెరుగైన ఫలితాల కోసం తమ కృషి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డితో పాటు ,అధ్యాపక బృందం ,ర్యాంకులు సాధించిన విద్యార్థులు, పాల్గొన్నారు.

## ప్రతి గింజను కొంటాం

### ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య



ప్రజాపక్షం/ఆలేరు : రైతులు ఆదైర్యపడ్డవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా వుంటుందని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భరోసా ఇచ్చారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని మల్లికార్జున రైస్ మిల్లును నేడు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రైస్ మిల్‌లో గోదాములు పరిశీలించి సివిల్ సప్లై అధికారులను ప్రస్తుత పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాలు అబద్దపు ప్రచారంతో ప్రభుత్వాన్ని బదునామ్ రోడ్డు ఎక్కుతున్నారు. గత సంవత్సరం ప్రభుత్వం కొనుగోలు చేసిన యాసంగి ఓడ్లే ఇప్పటికీ గోదాముల్లో పెండింగ్లో వుండడం వల్ల స్టాక్ ఎక్కవగా వుండడం వల్ల అన్ లోడ్ చేసుకోవడంలో కొంత అసౌకర్యం కలిగిన మాట వాస్తవమని అయిన రోజు కలెక్టర్, జేసి లతో మాట్లాడి రైతులకు ఇబ్బంది కల్గకుండ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికీ 25 లక్షల టన్ను కొనుగోలు కొన్నామని ఓ 10 లక్షల టన్నులు మాత్రమే వున్నాయని తడిసిన ధాన్యం కూడ ప్రభుత్వం కొంటుదని రైతులు అధ్తైర్యపడవద్దని వారం రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ధన్యం కొనుగోలు గోదాములను బీర్ల అయిలయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి లు గంద మల్ల అశోక్,చీర శ్రీశైలం ఎంపి ఎజాజ్, ఇల్లెందు మల్లేష్ తదితరులు ఉన్నారు.

## 'జయ' ప్రభంజనం



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ : ఎంసెట్ 2024( ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాల్లో జయ జూనియర్ జూనియర్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 370వ ర్యాంకుతో పాటు 5000లోపు 13 మంది విద్యార్థులు, 10,000 లోపు 29 మంది విద్యార్థులు, 20,000 లోపు 49 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు.

**10000 లోపు ర్యాంకు సాధించిన విద్యార్థులు**

స్టేట్ 370వ ర్యాంకు కె.వెంకటేష్, స్టేట్ 1275వ ర్యాంకు జి.చందన, స్టేట్ 1338వ ర్యాంకు కె.అభిజిత్, స్టేట్ 1706వ ర్యాంకు నాగసైదవరప్రసాద్, స్టేట్ 1743వ ర్యాంకు ఒ.విష్ణుతేజ, స్టేట్ 2473వ ర్యాంకు కె.సిద్ధార్ధన్, స్టేట్ 2885వ ర్యాంకు యం.హర్షిని, స్టేట్ 3153వ ర్యాంకు టి.శ్రీలక్ష్మి , స్టేట్ 3258వ ర్యాంకు జె.గౌతమ్‌కుమార్, స్టేట్ 4033వ ర్యాంకు ఎస్.దీక్షిత్, స్టేట్ 4537వ ర్యాంకు కె.సంతోష్, స్టేట్ 4602వ ర్యాంకు ఎస్.శ్రీలక్ష్మి వైష్ణవి, స్టేట్ 4658వ ర్యాంకు పి.సాయిశివాని, స్టేట్ 5078వ ర్యాంకు కె.వివేక్‌రెడ్డి, స్టేట్ 5181వ ర్యాంకు వి.మహేష్, స్టేట్ 5285వ ర్యాంకు షేక్ అఫ్వాన్, స్టేట్ 6000వ ర్యాంకు టి.మాధురి, స్టేట్ 6053వ ర్యాంకు ఎస్.నివేదిత, స్టేట్ 6091వ ర్యాంకు ఎన్.సిద్ధార్థ, స్టేట్ 6262 వ ర్యాంకు సిహెచ్ మనిముక్తేష్, స్టేట్ 6424వ ర్యాంకు ఎం.లాస్యశ్రీ, స్టేట్ 7190 ర్యాంకు టి. తన్మయిశ్రీ, స్టేట్ 7573వ ర్యాంకు కె.అక్షయ, స్టేట్ 7627వ ర్యాంకు ఎం.శ్రీహిత, స్టేట్ 8101వ ర్యాంకు జి.మేఘన, స్టేట్ 8801వ ర్యాంకు ఆర్.సాయిఅమృత, స్టేట్ 9032వ ర్యాంకు ఎస్.సూసన్, స్టేట్ 9161వ ర్యాంకు బి.హర్షిత, స్టేట్ 9973వ ర్యాంకు ఎం.డి సమీర్ సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని,విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సహకారం అందించిన తల్లిదండ్రులను కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

## ఇఎపిసెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ హవా




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఇఎపిసెట్2024 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వి.హాసిని (114), ఎన్.హేమంత్ (157), జి.శ్రీహాస్ (166), కె.సుప్రియ (296), ఎన్.జ్ఞానద (480), వి.శ్రీముఖి (568), యం. వర్షిత్ (575), జి.సాయిమంజునాథ్ రెడ్డి (610), పి.జ్యోతిర్మయి రెడ్డి (863), శ్రీ వెన్నెల (876), తేజస్విని (946), ఎ.శివవరుణ్ (973), సి.హెచ్ అనూహ్య (950), పి.శ్రీనాథ్ (986), మలిహాఫాతిమా (992)వ ర్యాంకు సాధించారు. 16 మంది విద్యార్థులు 1000 లోపు ర్యాంకు సాధించడం విశేషం, 39 మంది విద్యార్థులు 2 వేల లోపు ర్యాంకులు, 63 మంది విద్యార్థులు 3వేల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని యాజమాన్యం తెలియజేసింది. తక్కువ మంది విధ్యార్థులతో అత్యధిక అత్యద్భుత ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్ విద్యాసంస్థలకే సాధ్యమని ఫలితాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మధ్య ప్రకటించిన ఐఐటి మెయిన్ ఫలితాలలోనూ అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం సాధించిందని తెలిపారు. 450 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడం అల్ఫోర్స్ మరో సంచలనమని పేర్కొన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ , విద్యార్థుల కృషితో అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయాలు సాధించగలుగుతుందని తెలిపారు. రాబోయే ఐఐటి అడ్వాన్స్‌డ్ , నీట్ ఫలితాలలోనూ అల్ఫోర్స్ మహోన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని విశ్వసిస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇఎపిసెట్ 2024 ఫలితాలలో ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ విధ్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఐఐఎం, ఎన్ఐటిలో మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



R.Veena Y.Bhavana Nagasupreetharani Bhargavi

ప్రజాపక్షం/బీబీనగర్ : మండలంలోని లక్ష్మీ దేవి గూడెం గ్రామంలో గల తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ సైనిక శిక్షణా కళాశాలకు చెందిన, విద్యార్థులు దేశంలో అతి ఉన్నతమైన ఐఐఎంలో ఆర్.వీణ, భవన, నాగ ప్రీతి రాణిలు సంబల్పూర్ ఐఐఎంలో సీటు సాధించగా, భావన కాశీపూర్ ఐఏ ఎంలో ఎంబీఏ సీటు సాధించగా, భార్గవి రూర్కెలాలో ఎన్ఐటిలో సీటు సాధించారు. ఒకేసారి నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగ శర్మ ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 24న పాలిటెక్నిక్ కళాశాల డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఎంట్రన్స్ పరీక్ష (పాలిసెట్ 2024) నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సిహెచ్ నరసింహరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రలో ఇప్పటి వరకు 5 సెంటర్లకు గాను 2362 విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, రూ.300ల ఆలస్య రుసుముతో మే 20 తేదీ వరకు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం ఉందన్నారు. విద్యార్థిని,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సృజనాత్మకతతోనే ఉన్నతస్థితి



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : విద్యార్థుల్లో శాంతి కుసుమాలను వికసింపచేయాలని, ప్రేమ, సాయం, అభిమానం, మానవత్వం ఇలాంటి లక్షణాలను బాల్యం నుంచి పెంపొందిస్తూ ఉద్వేగ, ద్వేషాలకు దూరంగా ఉండేలా మానుకోవాలని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆచార్య బానోతు సురేష్ లాల్ అన్నారు. శనివారం హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన చిత్రకళా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. త్వరలో జరుగబోయే శాంతి పండుగ కార్యక్రమంలో ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల మాట్లాడుతూ.. చిన్నారులను చిన్ననాటి నుంచి ప్రతీ పోటీలో పాల్గొనేటట్లు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సంస్థ పీఆర్ఓ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంతో ఓపికతో చిన్నారులను పోటీలో పాల్గొనటానికి తీసుకవచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ అకాడమీ ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. కవి, గాయకుడు రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ల పరిశీలన



ప్రజాపక్షం/లింగాలఘణపురం: మండల కేంద్రంలోని జెడ్పీపీఎస్ పాఠశాలను జనగామ ఆర్డీవో కొమురయ్య శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సందర్శించి రెండు ఎమ్మెల్సీ బూత్‌లను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మౌళిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అని వారు పరిశీలించారు. తహశిల్దార్ వినయ లత, ఆర్ఐ కిషోర్, ఆశా వర్కర్లు, వీఓలు, తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్‌రూమ్‌ల చెంత నిరంతర నిఘా



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కోసం నిరంతరం నిఘాను ఏర్పాటుచేశామని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా శనివారం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని లోక్ సభ ఎన్నికల ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లు, రికార్డుల నిర్వాహణ, సిసికెమెరాల నిరంతరం పర్యవేక్షణ, తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఎస్సై శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డి విద్యార్థుల విజయకేతనం




ప్రజాపక్షం/హన్మకొండ : ఇటీవల నిర్వహించబడి శనివారం వెలువడిన ఎప్‌సెట్ ఫలితాలలో హన్మకొండలోని ఆర్‌డి విద్యసంస్థలకు చెందిన విద్యార్థులుఅత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వీరిలో పదివేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆర్‌డి కళాశాల ప్రిన్సిపాల్ బండి మల్లేశం, సెక్రటరీ డాక్టర్ కోడూరి రామ్మూర్తి అభినందించారు. ఎన్.మహేశ్వరి 4209 ర్యాంకు, కె.శరణ్య 4477, కె.శ్రీజ 5173, ఎస్ సాధ్విని 6989, కె. జ్ఞనేశ్వరి 7031,జి.సమీక్ష 8724 ర్యాంకులు సాధించారు. ఈ అద్భుత విజయాలను సాధించిన విద్యార్థులను, అంకితబావంతో పని చేసిన అధ్యాపకులను, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాలల యాజమాన్యం డాక్టర్ కోడూరి రామ్మూర్తి,బండి మల్లేశం ప్రత్యేకంగా అభినందించారు.

## 'నర్సాపూర్'లో రైస్‌మిల్లులు తనిఖీ



ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ మండలంలోని శివ సాయి, వేంకటేశ్వర, సాయి కృష్ణ, తిరుమల, సాయి వేంకటేశ్వర రైస్ మిల్లులను మండల ప్రత్యేక అధికారి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు తనిఖీ చేయడం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైస్ మిల్లులో ఖాళీ స్థలం ఎంత లభ్యత ఉన్నది అనే దానిపై మిల్లువారిగా మిల్లు సామర్థంతో పోల్చి చూడడం జరిగింది. మిల్లు వారితో మాట్లాడుతూ స్థల లభ్యతను బట్టి వెంటవెంటనే లారీలు ఖాళీ చేసి కొనుగోలు కేంద్రాలు సజావుగా జరగడానికి సహకారం అందించాలని మిల్లు వారిని ఆదేశించారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న ధాన్యం నిలువ,కొనుగోలు ప్రక్రియను, ట్యాబ్ ఎంట్రీని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు,జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, ఎపిఎం గౌరీశంకర్ సీసీలు దేవి సింగ్, భాగ్య సిఏలు పర్వతాలు పాండు, శైలజ కమిటీ మెంబర్లు లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: వరంగల్ నుండి సిద్దిపేట మీదుగా డిసిఎంలో అక్రమంగా రవాణా చేస్తున్న 140 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యంను హైదరాబాద్ తరలిస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్,సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా కలిసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డిసిఎం వాహనంలో వరంగల్ నుండి సిద్దిపేట మీదుగా హైదరాబాద్‌కు 140 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యంను రవాణా చేస్తుండగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌రహదారిపై వెళ్ళుచుండగా నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్,సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా కలిసి పట్టుకున్నామని తెలిపారు. నిందితులు గద్దల రవివర్మ తండ్రి శ్రీనివాస్ గ్రామం శాలపల్లి,హుజురాబాదు మండలం. నాగరాజు,తిరుపతి,శ్రీను మరోఇద్దరు కలిసి సిద్దిపేట చుట్టు పక్కల గ్రామాలలో ప్రభుత్వ రేషన్ బియ్యం తక్కువ రేటుకు కొని ఎక్కువ రేటుకు అమ్ముదామని వెళుచుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ పోలీస్ కమీషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక,పిడిఎస్ రైస్ అక్రమంగా నిల్వ ఉంచిన,చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# ప్రభుత్వ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : ప్రభుత్వం ద్వారా నిర్వహించే పరీక్షల నిర్వహణకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి గ్రూప్ 1 ప్రిలిమ్స్, ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు టిఎస్‌పిఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్1 పరీక్షసజావుగాజరిగేలా పకడ్బందిగా ఏర్పాట్లు చేయాలని కోరారు. 17 కేంద్రాల్లో 9168 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వార్డ్ బృందాలు, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లు నియమించాలని సూచించారు. ప్రతి కేంద్రం సిసి కెమెరా నిఘాలో ఉంటుందన్నారు. ఈసారి బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రతి కేంద్రంలో ఇద్దరు ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు.ఈ నెల 24 నుండి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ, జూన్ 3 నుండి జరిగే ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు కూడా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్మీయట్ పరీక్షలకు 17కేంద్రాలలో, ఎస్ఎస్‌సి పరీక్షలకు రెండు కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద144సెక్షన్ విధించాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుండి పరీక్ష కేంద్రానికి, తిరిగి పరీక్షా కేంద్రం నుండి స్ట్రాంగ్ రూమ్ కు పరీక్ష సామాగ్రిని తరలించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. డిసిపి రవీందర్, ఆర్‌డిఓ సిద్దం దత్తు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవరావు, గ్రూప్ 1పరీక్షల జిల్లా సమన్వకర్త చంద్రమౌళి, విద్యుత్, వైద్య ఆరోగ్య, తపాల, పోలీస్, టిఎస్ ఆర్‌టిసిఅధికారులు, ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



ప్రజాపక్షం/రాయపర్తి: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన నాణ్యమైన విద్య లభిస్తుందని కస్తూర్బా పాఠశాల/ కళాశాల స్పెషల్ ఆఫీసర్ బుర్ర కవిత అన్నారు. మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరిగి కస్తూర్బాలో ఎంపీసీ, బైపీసీ, ఇంగ్లీష్ మీడియం కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, స్రవంతి, శ్రావణి, రజినీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సిగా గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్సీ అభ్యర్థి గుగులోతు రాజునాయక్



ప్రజాపక్షం/హన్మకొండటౌన్: వరంగల్, నల్గొం డ, ఖమ్మం పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుగులోతు రాజు నాయక్‌ను గెలిపించాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. హన్మకొండలోని కేయూ దూరవిద్యా కేంద్రం ఎస్‌డిఎల్‌సీఈ ప్రాంగణంలో మీడియా సమావేశంలో రాజు నాయక్‌కు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగుల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ప్రధాన ఎజెండాగా పాలక వర్గాలపై ప్రశ్నించే గొంతుకగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక విద్యార్థి ఉద్యమాల నేపథ్యం కలిగిన విద్యార్థి నాయకుడురాజునాయక్‌నుగెలిపించాలని కోరారు. రాజునాయక్‌మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి దశ నుండే సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం అవుతూ సమాజంలో నూతన తరం నాయకత్వం స్థానంలోకి రావాలనే ఆకాంక్షతో,తమ సమస్యల పరిష్కారానికి తామే పోరాడాలన్న స్ఫూర్తితోవిద్యార్థి, యువకుల ఆకాంక్షల మేరకు తాను పోటీ చేస్తున్నానన్నారు.బీఆర్ఎస్‌పాలనలోయూనివర్సిటీలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశామన్నారు.టిజివిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్ కుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, కేయు జేఏసి వ్యవస్థాపక సభ్యులు విజయ్ కన్నా, తెలంగా పట్టబద్రుల వేదిక కన్వీనర్ వెంకటేశ్వర్లు, యూనివర్సిటి గిరిజన శక్తి ఇంచార్జి బానోతు దేవేందర్, బహుజన దళిత సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నేరేళ్ల ప్రశాంత్, భద్ర, నర్సింహా, ప్రదీఫ్, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు,

## 'మల్లన్న వల్లే నిరుద్యోగ యువతకు, ఉద్యోగులకు మేలు'



ప్రజాపక్షం/వర్ధన్నపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని లక్ష్మి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వర్ణ మాట్లాడుతూ మే 27 న జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసిగెలిపించాలనికోరారు. వర్ధన్నపేట మండల పరిధిలో 1777 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని ప్రతి ఓటరును కలిసి మేధావి వర్గం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే నిరుద్యోగ యువతకు, ఉద్యోగులకు అన్ని విధాలుగాన్యాయంచేకూరుతుందన్నారు.ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ మల్లన్న ఉంటాడు కాబట్టి అందరికి న్యాయం జరగాలంటేఈ ఎన్నికల్లో మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మల్లన్న గెలుపు ఖాయం అయిపోయింది.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపిన కూడా ప్రభుత్వ అవినీతి ఆరాచకాలను వెలికి తీసి ప్రజల ముందు ఎండగట్టిన ప్రశ్నించే గొంతుక ఏదైనాఉందంటేఅదితీన్మార్‌మల్లన్నమాత్రమేనని అన్నారు. మల్లన్న టీం వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్ గుండెబోయిన స్వామి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్,ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు నరకుడు వెంకటయ్య, సీనియర్ నాయకులు మహ్మద్ ఆఫ్సర్, కౌన్సిలర్లు సమ్మెట సుదీర్, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, సీనియర్ నాయకులు గుజ్జ రవీందర్ రెడ్డి, చిదురాల కుమారస్వామి, షబ్బీర్, అన్వర్, మోటపోతుల శ్రీనివాస్, బంగారు సదానందం, బచ్చు గంగాధర్ రావు, చందు మల్లయ్య,పాక సుజాత, లింగం రజిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్



ప్రజాపక్షం/జనగామప్రతినిధి : ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, సమర్ధవంతంగా నిర్వయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోవరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వాహణ, బ్యాలెట్ పోలింగ్ విధానంపై సమీక్షించారు. కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 23వేల 419 మంది ఉన్నారన్నారు. ఇందులో పురుషులు 14వేల 915 మంది కగా మహిళా ఓటర్లు 8వేల 503 మంది ఉన్నారని, ఇందు కోసం 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్‌కు రెండురోజులముందుసెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, పర్నీచర్ తదితర మౌళిక వసతులు సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని,బ్యాలెట్ పేపర్‌లో ఓటు వేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్స్ స్వీకరిస్తామన్నారు.పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్ అధికారులు, పిఓలు, ఏపిఓలు, ఓపిఓలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా నోడల్ అధికారులు జడ్‌పి సీఈఓ అనిల్‌కుమార్, జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓలు దేవరాయి కొమరయ్య, డిఎస్ వెంకన్న సెక్టార్ అధికారులు, పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు పాల్గొన్నారు.

**గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు**

జూన్ 9వ తేదీన జరిగే గ్రూప్ ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై టిఎస్‌పిఎస్‌సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షించారు. జూన్ 9న 10.30 గంటల నుండి మద్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ మాట్లాడుతూ జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలకు జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 3వేల 697 మంది పరీక్షలు వ్రాయనున్నారని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందనానరు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉండే జిరాక్స్ సెంటర్లు, మూసివేయాలన్నారు. ఆర్‌డిఓ కొమురయ్య, జడ్‌పి సీఈఓ అనిల్‌కుమార్, రీజినల్ కోఆర్డినేటర్ నర్సయ్య, డిఈఓ రాము, అధికారులు పాల్గొన్నారు.

## 24 నుండి జూన్ 3 వరకు ఇంటర్ పరీక్షలు

ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః ఇంటర్మీడియట్ ఆడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను మే 24 నుండి జూన్ 3 వరకు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఎగ్జామ్స్ పై సంబందిత అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలోపాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 9,318 ఓకేషనల్ విద్యార్థులు 599 , రెండవ సంవత్సరం విద్యార్థులు, 4,646 ఓకేషనల్ విద్యార్థులు 323 మందివిద్యర్థులు మొత్తం14,886మంది అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని అసరమైన ఏర్పాట్లను చేయాలని ,విద్యుత్ శాఖ అధికారులను మెడికల్ కిట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వైద్య సౌకర్యాలు కల్పించాని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు.జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతిపరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్ ఒక డిపార్ట్‌మెంట్ అదికారిని నియమించిచడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కన్వీనర్‌గా గల ఐదుగురు సభ్యులతో కూడిన జిల్లా పరీక్షల కమిటీ హై పవర్ కమిటీ ఈ పరీక్షల నిర్వహణ పర్యవేక్షిస్తుందన్నారు. అభ్యర్థుల అవసరాల మేరకు అదనపు బస్సులు ఆ రోడ్డులలో నడిపి విధంగా ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని,ఆయనసూచించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పోలీసు బందోబస్తు ఉండాలని ప్రశ్నపత్రాల ఓఎంఆర్ షీట్‌లో భద్రతకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు 2గురు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని మాల్ ప్రాక్టీస్ జరుగకుండా చర్యలు తీసుకోవాలని పరీక్ష కేంద్రాలకుసమీపంలో 144 సెక్షన్ అమలు ఉంటందని తెలిపారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ ఆడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఆయన ఆదేశించారు. హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో పొందవచ్చని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాదికారి గోవింద్‌రామ్, జిల్లా వైద్యాధికారిణి గాయిత్రి దేవి, డిప్యూటీ ఆర్‌ఎం ఓ దైవాదీనం, విద్యాశాఖ లింబాజీ, పోస్టల్ శాఖ శంకర్ ఎలక్ట్రిసీటీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ లావణ్య కుమారి రవాణా శాఖ అదికారి కె. శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## 'పదోన్నతులు, బదిలీలకు తొలగిన అడ్డంకులు'



ప్రజాపక్షం/జనగామటౌన్:ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని త్వరలోనే మల్టీజోన్ 2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తెలిపారు. శనివారం పీఆర్‌టీయూ టీఎస్ జనగామ జిల్లా ఆధ్వర్యంలో 2023/24 సంవత్సరానికి గాను 10వ తరగతి విద్యార్థులకు అందించు ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు,గౌరవఅతిథులు పెద్ది వెంకట నారాయణగౌడ్, ఎంఈవో భగవాన్, డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతిలు హాజరయ్యారు.పదవ తరగతిలో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 10/10జీపీఏ సాధించిన అందరు విద్యార్థులను,మండల టాపర్స్‌ను, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్‌ఎం, టీచర్లను 170 మందికి అవార్డులు అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నూకలఎల్లారెడ్డి, సోమరాజు, వెంకటరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ ప్రవేశాలకు దరఖాస్తు

ప్రజాపక్షం/పాలకుర్తి: 2024/25 విద్యా సంవత్సరానికి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డీఎస్ వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఉమ్మడి జిల్లాలోని హన్మకొండ, పాలకుర్తి, పర్వతగిరి, మూడు చెక్కలపల్లిలకు చెందిన వారు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో సీట్లకుగాను గిరిజన, గిరిజనేతర బాలికల నుండి కౌన్సిలింగ్ కొరకు దరఖాస్తులు కోరుచున్నట్లు తెలిపారు. ప్రవేశం పొందే బాలికలు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల (బాలుర) జూనియర్ కళాశాల యాకూబ్ పుర వరంగల్ నందు ఈనెల 25వ తేదీన కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో అడ్మిషన్ పొందాలన్నారు.

## తాటిచెట్టు మీద పడి కూలీ మృతి

ప్రజాపక్షం/రఘునాథపల్లి: తాటిచెట్టు మీద పడి కూలీ మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన ఇరిగదిండ్ల లింగయ్య కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు .ఇదే గ్రామానికి చెందిన వెలబోయిన యాదగిరి ఇంటి ముందున్న తాటిచెట్టును కట్ చేయడానికి తీసుకెళ్లాడు. ఇంటి యజమాని అయిన యాదగిరి తాటి చెట్టును కట్ చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాటిచెట్టు కాస్తా లింగయ్యపై పడి గాయాలయ్యాయి.జనగామ ఆసుపత్రికి తరలించే లోపే అతను మృతిచెందాడు. మృతుని భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎప్‌సెట్‌లో సత్తా చాటిన బిసి గురుకులాల విద్యార్థులు

మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎప్‌సెట్ ఫలితాల్లో బిసి గురుకులాలు విద్యార్థులు అత్యుత్త ఫలితాలను సాధించడం పట్ల రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. అగ్రికల్చర్ విభాగంలో స్ఫూర్తి 369వ ర్యాంక్ సాధించింది. ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ పరీక్షలో అగ్రికల్చర్ విభాగంలో అత్యధిక మంది విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో మొత్తం 145 మంది బాలికలు పరీక్ష రాయగా వారిలో 114 మంది అర్హత సాధించారన్నారు. స్ఫూర్తి అనే విద్యార్థి 369 ర్యాంక్ సాధించి బిసి గురుకుల బాలికల ప్రతిభను నిరూపించిందని, 12 మంది విద్యార్థులు ఐదు వేల లోపు ర్యాంక్, 29 మంది బాలికలు 10 వేల లోపు ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారని ప్రశంసించారు. అగ్రికల్చర్ విభాగంలో 25 మంది బాలురు పరీక్ష రాయగా వారిలో నలుగురు బాలురు జి.క్రాంతి కుమార్ (3735) ర్యాంక్ సాధించారని, ఇక ఇంజనీరింగ్ విభాగంలో 276 మంది బాలికలు పరీక్ష రాయగా వారిలో ఇద్దరు పదివేల లోపు ర్యాంకులను సొంతం చేసుకోగా 191 మంది అర్హత సాధించారని తెలిపారు. 135 మంది బాలురు పరీక్ష రాయగా వారిలో 5 మంది బాలురు పదివేల లోపు ర్యాంక్‌లు సాధించగా, 107 మంది క్వాలిఫై కావడం అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులు మరింత మంచి ర్యాంకులు సాధించేలా ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థులు మరింత కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. లక్ష్యంతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆయన దిశా నిర్దేశనం చేశారు.

# గెలిస్తే నిరుద్యోగభృతి, ఉద్యోగాల కోసం కృషి చేస్తా

మీట్ ది ప్రెస్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : పట్టబద్రుల సమస్యలపై ప్రభుత్వాలను నిలదీస్తానని, పట్టబద్రుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీఆర్ఎస్ బలపరిచిన వరంగల్, ఖమ్మం,నల్గొండ జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. శనివారం హన్మకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆద్వర్యంలో బీఆర్ఎస్ బలపరిచిన రాకేష్ రెడ్డితో మీట్ ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూఉమ్మడి వరంగల్, ఖమ్మం,నల్గొండ జిల్లాల పరిధిలో 34 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని, వీటిలో 32 చోట్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ ప్రజాస్వమ్య వ్యవస్థలో ప్రతిపక్షం బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.గతంలో ఈ పట్టబద్రుల నియోజకవర్గం నుండి ఎంతో మంది మేధావులు, వివిధ రంగాల నిపుణులు, విద్యావంతులు ప్రాతినిధ్యం వహించారని, ఈసారి కూడా పట్టబద్రులు అదే పరంపరను కొనసాగిస్తారని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.తాను అమెరికాలో ఎంతో విలువైన ఉద్యోగాన్ని వదిలి గతంలో బీజేపిలో చేరి 11 సంవత్సరాల పాటు వివిధ బాధ్యతలలో పని చేసినా తనకు ఆ పార్టీ నాయకులు గత అసెంబ్లీ ఎన్నికలలో ద్రోహం చేయడంతో బీఆర్ఎస్‌లో చేరడం జరిగిందని, తనపై నమ్మకంతో బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారన్నారు. గతంలో తాను ఎంతో కాలం తనకు వచ్చే ఆదాయాన్ని పేద విద్యార్థుల కోసమే ఖర్చు చేశానని, తాను ఎమ్మెల్సీగా ఎన్నికైనా తనకు వచ్చే వేతనాన్ని విద్యార్థులు, నిరుద్యోగుల కోసమే ఖర్చు చేస్తానని చెప్పారు. తాను గతంలో స్వచ్ఛందంగా మెగజాబ్ మేళా నిర్వహించి 692 మందికి జాబ్ కార్డులుఇప్పించానని,వరదలసమయంలో వందల మంది విద్యార్థులకు భోజనాలు సమకూర్చానని,కరోన సమయంలో నెలల తరబడిప్రజలకు సేవలు అందించానని తెలిపారు. అలాగే కోచింగ్ సెంటర్‌లలో తెలంగాణ, ఇండియా ఎకనమీపై విద్యార్థులకు ఉపయోగపడే కోచింగ్‌తో పటు పలు పుస్తకాలు రచించడం జరిగిందని చెప్పారు. కానీ పవిత్రమైన జర్నలిజాన్ని ఒక వ్యక్తి ఎర్నలి జంగా మార్చి విలువలను దిగజార్చుతున్నడని అన్నారు. ప్రస్తుత బీఆర్ఎస్‌లో అందరి నాయకుల సహకారం తనకు ఉందని, పార్టీలో పోటీ సహజమైనప్పటికీ తన గెలుపు కోసం అన్ని నియోజకవర్గాల నాయకులు కృషి చేస్తున్నారని అన్నారు.తాను గెలిస్తే నిరుద్యోగలకు నిరుద్యోగ బృతి, ఉద్యోగాల కల్పనకు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడుతానని అన్నారు. మీట్ ది ప్రెస్‌లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఐజేయు రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్, జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఆసిఫాబాద్ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయంను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌రావు, జడ్‌పి చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా జర్నలిస్టులు చూస్తున్నారని, జర్నలిస్ట్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అరిగెల నాగేశ్వరరావు, ఎంపిపి అరిగెల మల్లికార్జున్, డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ శ్యాం నాయక్, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తీరుస్తాం...

మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి

ప్రజాపక్షం / మంథని: నీటి సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి సమస్య తీరుస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి తెలిపారు. మంథని మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు మర్రివాడలో నీటి సమస్య తీర్చేలా బోర్‌మోటార్‌కు మరమ్మత్తులు చేయించి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సమస్యపై దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రతి వార్డుల్లో సమస్య ఉత్పన్నమైతే ఆ ప్రాంతంలోని బోర్‌మోటార్‌లను వినియోగంలోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. తమ సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి బోర్‌మోటార్‌కు మరమ్మత్తులు చేయించిన మున్సిపల్ చైర్ పర్సన్‌కు వీధివాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, వార్డు కౌన్సిలర్ వీకే రవితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విక్రయిస్తే కఠిన చర్యలు

బెల్లంపల్లి ఎసిపి రవికుమార్

ప్రజాపక్షం / బెల్లంపల్లి : అధిక దిగుబడుల ఆశ చూపి అన్నదాతలకు నకిలీ పత్తి విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకునే దళారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి లోని ఎసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రాంతంలో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టే విధంగా పోలీసులు నిఘా వ్యవస్థను మెరుగుపరిచామని, ప్రజలు కూడా నకిలీ పత్తి విత్తనాల విక్రయదారుల గురించి సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు అందించాలని, అట్టి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతంలో నకిలీ పత్తి విక్రయదారులను, పాత నేరస్తులను గుర్తించి సత్ప్రవర్తన కోసం తహసిల్దార్‌ల వద్ద బైండోవర్ చేశామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై అడ్డుకట్ట వేయడానికి ఉమ్మడి టాస్క్ ఫోర్స్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## వడ్ల కొనుగోలు వేగవంతం చేయండి

లారీల కొరత లేకుండా చూస్తాం : ఎమ్మెల్యే చింతకుంట



ప్రజాపక్షం / పెద్దపల్లి రూరల్ : వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పక్రియ వేగవంతం చేయాలని లారీల కొరత లేకుండా చూస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం మండలంలోని వె న్నంపల్లి, మంగపేట, కూనారం, గ్రామాల్లోని సొసైటీ, ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాలను పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సందర్శించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడ్ల కొనుగోలు కేం ద్రాల్లో తడిచిన ధాన్యాన్ని వారు పరిశీలించారు.లారీల కొరత లేకుండా చూ స్తామని కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులెవరు అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో 80శాతం వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని కొన్ని కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు మిగిలి ఉన్నాయని సెంటర్ నిర్వాహకులు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. లారీల కొరుత లేకుండా చూస్తామని వారు హా మీ ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే ఎలాంటి కట్టింగ్ లేకుండా కొ నుగోలు చేస్తుందని రైతులెవరు అధైర్య పడవద్దు అన్నారు. మిల్లర్లు కటింగ్ పెడతామంటే మిల్లర్లు చుట్టూ సెంటర్ నిర్వాహకుల చుట్టూ రైతులు తిరగవద్దని, మా దృష్టికి తీసుకు వస్తే ఏలాంటి కట్టింగ్ లేకుండా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. వర్షాకాలంలో రైతులు పంట సాగు ముందుగా ప్రారంభించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగో ని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మండల యూత్ అధ్యక్షుడు శివరామకృష్ణ నాయకులు దొంకెన మొగిలి, సాధనమైన కొమురయ్య, ఎండి ఖలీల్, రణవేన శ్రీనివాస్, బంగారు రమేష్, సబ్బని రాజమల్లు, కలవేన రాజయ్య, వెల్తూరి రమేష్, తదితరులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎన్. ప్రేమలత

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: జూన్ 8న జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం పోలీసు అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి కక్షిదారుల పరస్పర సమ్మతితో కేసులను పరిష్కరించాలని అన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పీఎస్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సగానికి పైగా కేసులను టార్గెట్ విధించి, వాటిని పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు రాజీయే రాజమార్గమని, రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు. అత్యధికంగా కేసులు పరిష్కరించి జిల్లాను మొదటి స్థానంలో నిలిపే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేసుల పరిష్కారం కోసం ఎవరిపై ఒత్తిడి తీసుకురావద్దన్నారు. అలాగే జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చట్టాలపై అవగాహన కార్యక్రమం

ప్రజాపక్షం / గొల్లపల్లి : చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జగిత్యాల రెండవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జె. వినీల్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో శనివారం న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ మాట్లాడుతూ చట్టాల గురించి తెలిసినప్పుడే ఏదైనా సమస్య వచ్చినప్పుడు సరైన పరిష్కారం లభిస్తుందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను చట్ట ప్రకారం అనుభవించాలంటే చట్టాలపై కనీస అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు, యువకులు మత్తు మాదక ద్రవ్యాలకు అలవాటు కాకుండా తల్లి దండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, వాహనాలకు ఇన్సురెన్స్, లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, న్యాయవాదులు నిఖిల్‌రెడ్డి, ఆదిత్య, విశాల్, కాసం ప్రవీణ్, రఘునందన్, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుంటి సామ్రాజ్




ప్రజాపక్షం / పెద్దపల్లి ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ హమాలీ వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుంటి సామ్రాజ్యం అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో గల రైల్వే హమాలీ గూడ్ షెడ్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంటి సామ్రాజ్యం మాట్లాడుతూ గోదాములు, రైల్వే గూడ్ షెడ్స్, రైస్ మిల్లులు, మార్కెట్ యార్డులు, ఐకెపి సెంటర్లు, వివిధ సంస్థలు, స్థలాలు, ప్రదేశాలలో పనిచేసే హమాలీ కార్మికులకు భద్రతా భరోసా కరువైందని, బస్తాలు బరువులు మోస్తూ భద్రతా భరోసా లేని జీవితాలు గడుపుతున్న హమాలి కార్మికులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించే విధంగా హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పని భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ మొదలగు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో నిరక్షరాస్యులు మాత్రమే హమాలీ పనిచేసేవారని నేటి పరిస్థితులలో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక రైస్ మిల్లులలో, బియ్యం గోదాములలో, మార్కెట్ యార్డులలో, దుకాణాలలో హమాలీ పనిచేస్తు కుటుంబాలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో హమాలీ కార్మికులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో యజమానులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తూ స్థానిక హమాలీ కార్మికులకు బదులుగా బీహార్ కార్మికులను రప్పించుకొని తక్కువ రేట్లతో పని చేయించుకుంటూ ఎక్కువ మొత్తంలో లాభాలు ఆర్జిస్తూ ఇదెక్కడి అన్యాయం అనిటి ప్రశ్నించిన స్థానిక హమాలీ కార్మికులను పనుల నుండి తొలగిస్తున్నారని ప్రశ్నించే హక్కును హరిస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా లోని జగిత్యాల, సుల్తానాబాద్, రైల్వే గుడ్ షెడ్ లలో బస్తా రేట్లలో కోతలు పెడుతూ లారీ మామూళ్లు హరిస్తూ కొంతమంది గుత్తేదారులు కార్మికుల పొట్ట కొడుతున్నారని, నిలదీసిన వారిని నిర్దాక్షంగా పనుల నుండి తొలగిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గోదాములలో సైతం బిహారీ కార్మికులతో పని చేయిస్తూ యజమానులు స్థానిక హమాలి కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని హమాలీ కార్మికులకు తెలంగాణ హమాలీ కార్మిక సంఘం అండగా ఉంటుందని అన్నారు. అనంతరం తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. వివిధ సంస్థలలో గల హమాలీ రేట్లను పరిశీలించటం,ఆయా గోదాములలో హమాలీలకు యజమానులు కల్పించేఈ పీఎఫ్, ఈఎస్ఐ, కనీస సౌకర్యాలు,మూడు గోదాములలో హమాలీ పని తీరు యజమానులతో గల సంబం ధాలు, ప్రభుత్వం దృష్టికి హమాలీ సమస్యలు, మే నేజ్మెంట్ కాంట్రాక్టర్లతో ఉమ్మడి సమావేశం, రాష్ట్ర మొత్తంలో ముఖ్యమైన హమాలీ పనులకు కామన్ రేటు నిర్ణయించుట, యూనియన్‌లోని ప్రతిసభ్యుడు యూనియన్ ఆదేశాలుపాటిస్తూ తోటి హమాలీ కార్మికులకు యూనియన్ గురించి వివరించటం తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ రెడ్డి, కరీంనగర్ జిల్లా బాధ్యులు మోహన్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల, వరంగల్ జిల్లాల హమాలి సంఘాల నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ పోరాట ఫలితమే

## దోస్తు ప్రక్రియ రద్దు




ప్రజాపక్షం /పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎఐఎస్ఎఫ్ పోరాట ఫలితమే ట్రినిటీ డిగ్రీ కళాశాల దోస్తు ప్రక్రియను రద్దు చేయడం జరిగిందని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం అనుమతులు లేని ట్రినిటీ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, దోస్త్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతికి అందజేసిన విజ్ఞప్తి మేరకు, ఉప కులపతి, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్రినిటీ డిగ్రీ కళాశాల యొక్క అనుమతులను పరిశీలించి, దోస్తు ప్రక్రియను నిలిపివేయడం జరిగిందని, ఉపకులాపతి, సంబంధిత అధికారులు వెల్లడించారని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ట్రినిటీ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకున్న సంబంధిత అధికారులకు విప్లవాభివందనాలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. నాణ్యమైన విద్యను ఇవ్వకుండా, ఉచితంగా బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని , పరీక్ష ఫీజు చెల్లిస్తామని మాయ మాటలు చెప్పి కళాశాలలో చేరాకఫీజు కట్టాల్సిందేనని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, గుర్తింపును కూడా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పనులు పూర్తి కాలేదు... గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదు

జెడ్‌పి సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన




ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జిల్లావ్యాప్తంగా గతంలో చేపట్టిన పనులు పూర్తికాక గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదని ప్రజా ప్రతినిధులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జడ్‌పి చైర్మన్ కోనేరు కృష్ణారావు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ముఖ్యఅతిథిగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు జిల్లా సంక్షేమ ఫలాలు అందరికి అందేవిధంగా కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని వారు తెలిపారు. అనంతరం జిల్లాలో నెలకొన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రోడ్ల భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గతంలో చేపట్టిన రోడ్లు, వంతెన పనులు నత్త నడకన కొనసాగుతున్నాయని మొరపెట్టుకున్నారు. అదేవిధంగా గనుల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇసుక, మొరం అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, మెడికల్ కళాశాలలో ఔట్సోర్సింగ్ ద్వారా చేపట్టిన ఉద్యోగ నియామకాలను స్థానికులకు కాకుండా స్థానికేతర్లకు ఇవ్వడంతో జిల్లా ఎంఎల్‌ఎలు హరీష్ బాబు, కోవలక్ష్మి లు అధికారులపై మండిపడ్డారు. టెండర్ల ద్వారా దక్కించుకున్న పనులను పూర్తిచేయడంలో విఫలమైన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విత్తనాలు, యూరియా, డిఏపి గ్రామాల్లో రైతులకు సకాలంలో అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. సీజన్‌లో రైతులకు సరిపడ పత్తి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలను డీలర్లు విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు సమావేశ దృష్టికి తీసుకురాగా, చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవి లో వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరిపడ గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు తగినన్ని అందుబాటులో ఉంచాలని తూకంలో మోసాలు లేకుండా చూడాలని, రబీ ధాన్యం సేకరణ లక్ష్యం 48 వేల మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటి వరకు 2 వేల 200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారని, మిగతా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎప్పటివరకు సేకరిస్తారని, ఆసిఫాబాద్ మండలంలో అదనంగా రెండు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సభ్యులు సమావేశ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు చికిత్స చేయడం లేదని, చిన్న రోగం ఉన్న మంచిర్యాలకు తరలిస్తున్నారని ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. ఇక్కడి డాక్టర్లు మంచిర్యాలలోని డాక్టర్లతో కలిసి రోగులను ఇబ్బందులకు గురి చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రైవేట్ అంబులెన్స్‌లను రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడ్ల కొనుగోలు విషయంలో రైతులను మోసం చేస్తున్నారంటూ సిర్పూర్ ఎంఎల్‌ఎ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ ద్వారా మారుమూల గ్రామాలకు నీరు అందడం లేదని లీకేజీలు మరమ్మతులు చేపట్టకుండా మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు తెలుపగా ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోడు పట్టా భూములలో వ్యవసాయ పనులను ట్రాక్టర్లతో చేపడితే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, సాగుచేయనీయడం లేదని సభ్యులు ప్రస్థావించగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు గైర్హాజరవుతూ పాఠశాల ముగింపు రోజున వచ్చి హాజరు రిజిస్టర్ సంతకాలు పెడుతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకురాగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అనిల్ కుమార్, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో

## రైతు ప్రభుత్వం



ప్రజాపక్షం / మెట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం కోనుగోలు పట్ల రైతులు పూర్తి సంతృప్తితో ఉన్నారని కోరుట్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మెట్ పల్లి మండలంలో వేంపేట గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడి రైతులు ఏలేటి రాజారెడ్డి, గడ్డం సాయిరెడ్డి, లతో తదితరుతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం పరిశీలించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని ఇది ప్రజా ప్రభుత్వం గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తప్ప తాలూ పేరుతో రైతులను నిండా ముంచిందని రైస్ మిల్లర్లకు లాభం చేసి కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప తాలు కటింగ్ అనేది లేకుండా మూడు రోజుల్లో కొన్న ధాన్యంకు సంబధించిన డబ్బులు రైతు ఖాతాల్లో జమ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, తిపిరెడ్డి అంజిరెడ్డి, మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మ ణ్, రైతులు తదితురులు పాల్గోన్నారు,

# పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: జిల్లాలో 2023–24 యాసంగి సీజన్ ధాన్యం సేకరణ మరో పది రోజుల్లో పూర్తికానుందని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు 259 ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించామని వెల్లడించారు. ఐకేపీ, పిఎసిఎస్ డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని వివరించారు. ఇప్పటిదాకా దాదాపు 31,201 మంది రైతుల నుంచి 2,08,566 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసి, 2,02,125 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించామని తెలిపారు. 28,612 రైతుల ఖాతాల్లో రూ.344 కోట్లు జమ చేశామని వెల్లడించారు. శిక్షణ అందించి ఏర్పాట్లు ఏడాది యాసంగి సీజన్ ధాన్యం సేకరణ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పక్కా ప్రణాళికతో ధాన్యం సేకరణకు ఏర్పాటు చేయించారు. ముందస్తుగా ఆయా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు పలుమార్లు శిక్షణ ఇప్పించారు. అలాగే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తూకం వేసే యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్ తదితర సామాగ్రి ముందుగానే తరలించేలా ఏర్పాటు చేశారు. ఈసారి నూతనంగా ఐరిష్ యంత్రాన్ని కూడా ప్రవేశపెట్టారు. అలాగే ఏప్రిల్ ఒకటో తారీఖున జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం జిల్లాలోని రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు వాతావరణ శాఖ సమాచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు చేరవేశారు. ఏ రోజు వర్షం కురిసే అవకాశం ఉందో ముందస్తుగానే సమాచారం అందించడంతో ధాన్యాన్ని తడవకుండడా టార్పాలిన్లు అందజేసి జాగ్రత్తగా కాపాడే చర్యలు చేపట్టారు. లారీలను కూడా అందుబాటులో ఉంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ తనిఖీ జిల్లాలోని తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల అలాగే పలు కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ కమిషనర్ డివిస్ చౌహాన్ ఈ నెల 8వ తేదీన తనిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దాన్యం తడవకుండా కింద పైన టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ట్యాబ్ ఎంట్రీలు ఆన్లైన్లో వేగంగా పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని ఆదేశించారు. కమిషనర్ పర్యటనతో కొనుగోలు కేంద్రాల్లో పటిష్ట చర్యలు చేపట్టి దాన్యం కొనుగోలు వేగంగా పూర్తయ్యాలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాన్యం సేకరించడంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాన్యం సేకరించి తమ ఖాతాలో డబ్బులు జమ చేసిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పక్కా ప్రణాళికతో సేకరణ జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం సేకరించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాం. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇప్పించి, వారికి కావాల్సిన యంత్రాలు ఇప్పించాం. రైతులకు ఇబ్బందులేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయించాం అన్నారు.

ధాన్యం కొనుగోలు వివరాలను

## ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలి

అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్




ప్రజాపక్షం / నిర్మల్ రూరల్: ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ నిర్వహకులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివిధ అంశాలపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణిత గడుపులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు తరలించాలని,కొనుగోలు వివరాలను ఖచ్చితంగా ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. మండలాల వారీగా వరి ధాన్యం కొనుగోలు వివరాలు, రైతుల సంఖ్య మిల్లులకు తరలించిన లారీల వివరాలు ట్యాబ్ ఎంట్రీ చేసిన సంఖ్య, పెండింగ్ ట్యాబ్ ఎంట్రీ వివరాలు, ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జామచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నా రు. రైతులకు డబ్బులు జమచేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి , డీఎం సివిల్ సప్లయిస్ శ్రీకళ, డీసీవో నర్సయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట చర్యలు


నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్: జిల్లాలో గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి టీఎస్పీఎస్సీ చైర్మన్ మహెంధర్ రెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నత అధికారులతో గ్రూప్1 పరీక్ష నిర్వహణకు తీసుకోవలసిన చర్యల పై వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ చైర్మెన్ మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్, లీకేజీలకు తావులేకుండా పరీక్షను నిర్వహించాలని జిల్లాలలో పరీక్షా కేంద్రాల ఎంపికను పూర్తిచేసి నిర్వహణ భాద్యతలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు అప్పగించాలని కలెక్టర్లకు సూచించారు. సంబందిత అధికారులంతా పరీక్షాకేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, సీసీ కెమెరాలు, త్రాగు నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను తనిఖీ చేయాలని సూచించారు. పరీక్ష జరిగే సమయంలో పరిక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ ప్రత్రాల తరలింపు సమయంలో పోలీసు శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు భద్రతను కల్పించాలని, పరీక్షా కేంద్రాల లోనికి సిబ్బందికి,అభ్యర్ధులకు మొబైల్ ఫోన్, ఏ ఇతర ఎలక్ట్రానికి వస్తువులు అనుమతిలేదన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనీ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర వైద్యసిబ్బంది మందులు, ఓఆర్ఎస్ పాకెట్స్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జున్ 9న నిర్వహించే గ్రూప్1 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాలలో 4608 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. సిసి కెమెరాల ఏర్పాటు తో పాటు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్,రూట్ ఆఫిసర్లను నియమిస్తామని తెలిపారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 6305646600 ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ పి.గాంగారెడ్డి,డీఈవో రవీందర్ రెడ్డి,డీఎంఈండ్ ఎచ్‌వో ధన్‌రాజ్,ఆర్టీసీ డిపోమేనేజర్ ప్రతిమా రెడ్డి,డీపీఆర్వో విష్ణు వర్ధన్, ఏవో కలెక్టరేట్ సూర్యరావ్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్



ప్రజాపక్షం / మంచిర్యాల ప్రతినిధి : ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి, ఇంచార్జ్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణ, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి జిల్లాలోని రేషన్ డీలర్లు, గోదాముల ఇంచార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యం అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో రేషన్ డీలర్లు సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, ప్రతి నెల 1 నుండి 17వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుండి 11 గంల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 8 గంల వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్) నుండి డీలర్లకు సరైన వెయిటేజీతో బియ్యాన్ని సరఫరా చేయాలని, ప్రతి డీలర్ బయోమెట్రిక్ విధానంలో బియ్యంను తీసుకోవాలని, బస్తాలను తూకం వేసే సమయంలో డీలర్లు అక్కడే ఉండే పరిశీలించుకోవాలని తెలిపారు. చౌకధరల దుకాణాలలో రేషన్ డీలర్ పేరు, మొబైల్ నంబర్, స్టాక్ నిల్వలు, పంపిణీ వివరాలతో బోర్డులు నిర్వహించాలని, చౌకధరల దుకాణం చిరునామా తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గన్నీ సంచుల సమస్యలు, వెయిటేజీ యంత్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం నుండి ప్రజలకు సరైన మొత్తంలో బియ్యం అందించాలని, పంపిణీ సమయంలో రేషనర్లు చౌకధరల దుకాణాలలోనే ఉండాలని తెలిపారు. రేషన్ డీలర్లు లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న అధికారులు

ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కార్పొరేట్ విద్యాసంస్థలకు అధికారులు కొమ్ముకాస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ ఆరోపించారు. వరంగల్ మండల కార్యకర్తల సమావేశం శివనగర్ ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో శివకుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే గ్రామాలలో టెక్నో, డిజి పేర్లమీద పాఠశాలల, కళాశాలల ప్లెక్సీలు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ కళాశాలల, పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వరంగల్ నగరంలో పలు ప్రైవేట్ కళాశాలలకు పర్మిషన్లు, షిఫ్టింగ్ పర్మిషన్లు లేకుండా అడ్మీషన్లుచేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, అభిరామ్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఇందిరమ్మ ఇండ్లు

ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్



**ప్రజాపక్షం/ఆలేరు :** గ్రామీణ కళాకారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, అర్హులైన మహిళలకు రూ.2500ఇవ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆలేరు నియోజకవర్గ కేంద్రం లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో షారాజీపేట కోలాట బృందం నిర్వహించిన సమావేశానికి హాజరై వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాల పేరు మీద ఏ ఒక్క కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన కళాకారులకు గుర్తింపు కార్డులు, రైళ్లలో బస్సులలో పాసులు, ట్రైన్ పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు పార్వతమ్మ, రేణుక, లక్ష్మి, నర్సమ్మ, మహేంద్ర, అనురాధ, రాణి, రేణుక, బాలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి వేణు వినతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఇల్లంతకుంట సిపిఐ మండల సమావేశం పోత్తూరు గ్రామంలో బొంపల్లి భూమిరెడ్డి అధ్యక్షత జరిగింది. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద సుదర్శన్‌తో కలిసి వేణు మాట్లాడుతూ ఇటీవల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిడుగుపడి చనిపోయిన పశువుల యజమానులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కృషిచేయాలన్నారు. నియోజకవర్గంలో ఇండ్లు నిర్మించుకోవడానికి ఎస్సీలకు రూ.ఆరు లక్షలు ఎస్టీలకు రూ.ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. అనంతరం సిపిఐ మండల కమిటీని తొమ్మిది మందితో ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా బొంపల్లి భూమిరెడ్డి, మండల సహాయ కార్యదర్శిగా మర్రి ఎల్లవా ఎన్నికయ్యారు.

## వాగ్దానాలు అమలు చేయాల్సిందే

కౌలు రైతు సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/కోదాడ :** కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నం పాపరెడ్డి, బొల్లు ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతాంగానికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందచేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, కౌలు రైతు సంఘం నాయకులు చిన్నం వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు, నీలం నాగభద్రం, కుటుంబరావు, కనగాల గిరి,అలవాల చంద్రయ్య, ఎన్నబోయిన శ్రీను,జల్లి పుల్లయ్య,వాము తిరపయ్య,బానోతు నాగేశ్వరరావు,నెల్లూరు రామారావు, అలవాల వెంకటి, బైరబోయిన వెంకటేశ్వర్లు, మందరపు రామయ్య, నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### సూర్యనారాయణకు పరామర్శ

గత రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాష్ట్ర కౌలు రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణను శనివారం ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయపడ్డ రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి ప్రసాద్, సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యురాలు సుందరి పద్మ, మహిళా నాయకురాలు చింతకుంట్ల విజయ, పుల్లారావు పాల్గొన్నారు.



# ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ, లక్ష్మణ్ డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజుల నియంత్రణ చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్టా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలను కొన్ని విద్యాసంస్థలు దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కళాశాలల, పాఠశాలలు అడ్మిషన్లు చేస్తు న్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నియామకాలు త్వరితగతిన పూర్తి చేయాలని, మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువకులతో పాలకులు చెలగాటమాడుతున్నారని ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం లేదన్నారు. యువత, విద్యార్థులను విస్మరించడమే బిఆర్ఎస్ ఓటమికి కారణమని వారు తెలిపారు. విద్యాగుమ్మంగా భాసిల్లుతున్న ఖమ్మంజిల్లాలో విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యా రంగంలో ఆది నుంచి పేరెన్నికగన్న ఖమ్మం పట్ల పాలక వర్గాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయని వారు ఆరోపించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని, విద్యార్థుల జీవితాలతో గత ప్రభుత్వం చెలగాటమాడిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేసేందుకు ప్రయత్నిస్తుందని, అందుకే నూతన జాతీయ విద్యా విధానాన్ని తెచ్చిందని , దీనిని ఎఐఎస్ఎఫ్ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వారు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టెట్ పరీక్షా కేంద్రాల ఏర్పాటులో అభ్యర్థులను ఇబ్బందులు పెడుతుందని ఆరోపించారు. దూరంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఎఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మద్దతునిచ్చి గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సతుకు ప్రవీణ్, రాష్ట్ర సమితి సభ్యులు మడుపల్లి లక్ష్మణ్, వెంకటేష్, జిల్లా నాయకులు మధు, శివ, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టబద్ధత కల్పించాలని జూన్ 6 నుంచి 'మాదిగ జన సభ'

మాదిగ జెఎసి వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్ మొదటి సమావేశంలోనే మాదిగలకు 12శాతం రిజర్వేషన్లను పెంచుతూ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూన్ 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'మదిగ జన సభ'లను నిర్వహించనున్నట్టు మాదిగ జెఎసి వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో 14 మాదిగ సంఘాల ఐక్య కార్యాచరణ సంఘాలతో కలిసి పిడమర్తి రవి శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ చేసే బాధ్యతను తాను తీసుకుంటానని, మాదిగలకు న్యాయం చేస్తానని ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్‌ను కలిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. జూన్ 6 నుంచి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా మాదిగ జన సభలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి రిజర్వేషన్ ఆధారంగా వర్గీకరణ చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం కలుగుతుందని, పెరిగిన జనాభాకు అనుకూలంగా రిజర్వేషన్ ఫలాలు అందాలన్నారు. సమావేశంలో మాదిగ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు డా.బొల్లికొండ వీరేందర్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు వక్కలగడ్డ.చంద్రశేఖర్,రాష్ట్ర దండు బచ్చలికూర బాలరాజు, మాదిగ సంక్షేమ సంఘం గడ్డె.యాదన్న,దళిత బహుజన సంఘం గజ్జెల మల్లిఖార్జున్, బిఎస్‌ఎఫ్ బోరెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం మోదీకి ఇష్టంలేదా?

మహిళకు బస్సులలో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రధాని జీర్ణించుకోలేకపోతున్నారు : మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయడాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీర్ణించుకోలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆ రాష్ట్రాలలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. వాస్తవంగా ఆర్‌టిసిలో ప్రయాణానికి, మెట్రో రైల్‌లో ప్రయాణానికి సంబంధం లేదని, మెట్రో సెక్టార్ వేరని, ఇప్పటికీ కూడా మెట్రో రైల్‌లో రద్దీ కారణంగా బోగీలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయంపై ప్రధాని చేసిన ప్రకటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ప్రధాని మోదీ రాజకీయ లబ్ధికి సంబంధించిన ఆలోచన చేస్తున్నారా?, బస్సు ప్రయాణం విషయంలో ప్రధాని ఎందుకు అలా మాట్లాడారో స్పష్టం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదని, ఇంకా కొత్త రూట్లు, కొత్త బస్సులు పెంచి పథకాన్ని మరింత ముందుకు తీసుకుపోతామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇంకా మరిన్ని సౌకర్యాలు కల్పించడంలో తమ ప్రయత్నాలు మరింత కొనసాగుతాయన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యంప్ప ప్రధాని మోదీ ఆడిపోసుకోవడం మానుకోవాలని ఆయన సూచించారు. ఉచితంగా బస్సు సౌకర్యం ఇచ్చినంత మాత్రాన ఏదో నష్టం జరుగుతున్నట్లు ప్రధాని మాట్లాడడం సరైంది కాదని, ఇలా చిన్న చిన్న అంశాలపై మాట్లాడి ప్రధానమంత్రి స్థాయిని దిగజార్చవద్దని మోదీకి సూచించారు.

# ప్రధాని మహిళా వ్యతిరేకి : కాంగ్రెస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాని మోదీ మహిళా వ్యతిరేకి అని టిపిసిసి ఉపాధ్యక్షులు నిరంజన్ విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆయన వ్యతిరేకించడంతో హాస్యాస్పదం అని అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిరంజన్ మాట్లాడుతూ ఒక ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు కల్పించడం ద్వారా మెట్రో నష్టపోతుంది అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం పథకం అమలు చేశాం. 29 లక్షల మంది మహిళలు ప్రతి రోజు ఈ సౌకర్యం పొందుతున్నారు. మహిళలు సంతోషపడుతుంటే.. మోదీకి ఎందుకు కంటగింపు అని అన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు రుణాలు మాఫీ చేసినప్పుడు ప్రధాని మోదీ ఎందుకు ఆలోచించలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు వ్యాపారం కోణంలో ఎప్పుడు చూడవద్దు అనేది మోదీ తెలుసుకోవాలని కితాబిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మెట్రో మీద ప్రభావం చూపాదన్నారు. మెట్రో కేవలం హైదరాబాద్‌కి మాత్రమే పరిమితమని గుర్తు చేశారు. కానీ గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా మహిళలు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. మోదీ వాక్యాలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ మహిళలకు మోదీ క్షమాపణలు చెప్పాలని నిరంజన్ డిమాండ్ చేశారు. మోదీ ముస్లిం దేశాలతో దోస్తీ చేస్తూ.. దేశంలోని ముస్లింలలో ద్వేషం నింపుతున్నారన్నారు. మోదీ రోజుకు ఒక వేషం వేస్తూ.. రోజుకో మాదిరి మాట్లాడుతున్నారని నిరంజన్ ఆరోపించారు.

# 'మోదీ..ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకో'

కాంగ్రెస్ ఎంఎల్‌సి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే అయోధ్య రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారు అంటూ ప్రధాని మోదీ మాట్లాడడం సరికాదని కాంగ్రెస్ ఎంఎల్‌సి జీవన్ రెడ్డి అన్నారు. ఎన్నికల నియమావళిని గౌరవించాల్సిన ప్రధాని మోదీ అలా దారుణ వ్యాఖ్యలు చేయడం మత విశ్వాసాలను రెచ్చగొట్టడమే అవుతుందని మండిపడ్డారు. ఆయన తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాస్తవానికి రామాలయం దేవాలయ గేట్లు 1986లో రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలోనే తెరిపించారన్నారు. కోర్టు తీర్పు గౌరవించి హిందువుల మనోభావాలు గౌరవించే ఆ విధంగా రామ్ లల్లా గేట్స్‌ను రాజీవ్ గాంధీ తెరిపించినపుడు మోదీ ఎక్కడ ఉన్నాడు? అని ప్రశ్నించారు. బహదూర్ సింగ్ సిఎం గా ఆనాడు ఉన్నారని, 1989లోనే రాజీవ్ గాంధీ హయాంలోనే శిలాన్యాస్ చేయడం జరిగిందన్న విషయాన్ని ప్రధాని మోదీ మరిచారా? అని జీవన్ రెడ్డి నిలదీశారు. గుడి శంకుస్థాపనకి అనుమతి ఇచ్చింది రాజీవ్ గాంధీనే అని , విశ్వ హిందూ పరిషద్ చేసింది ఏదీ లేదన్నారు. మత సామరస్యానికి ప్రతీక గా ఏ దేశం లో లేని విధంగా వివిధ మతాలకు సెక్యులర్ విధానాలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రాజీవ్ గాంధీ 1989 లో అధికారం లోకి వచ్చి ఉంటే అపుడే నిర్మాణం పూర్తి అయ్యేదన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి నేతలు రామమందిరం గుడిని వాడుకోవడం సరికాదన్నారు. దేశంలో ధార్మిక చింతన పెంపొందించింది రాజీవ్ గాంధీ కాదా? రాజీవ్ గాంధీ పిఎంగా ఉన్నపుడు దూరదర్శన్‌లో రామాయణం, మహా భారత్ లు ప్రసారం చేయలేదా? అప్పుడు ఇదే మోదీ ఎక్కడున్నాడు? అని నిలదీశారు. మోదీ వచ్చాకే రామ మందిర నిర్మాణానికి అంకురార్పణ జరిగినట్లు బిజెపి నేతలు మాట్లాడుతున్నారని, కానీ రాజీవ్ గాంధీ ఉన్నపుడే అంకురార్పణ జరిగిందని ప్రజలకు తెలుసునన్నారు. మోదీ..నువ్వు ఒక్కడివే దేవుడిని కొలుస్తా అని చెప్పుకుంటే ఎలా? అని జీవన్‌రెడ్డి నిలదీశారు. శ్రీరామ పాలనను రాజీవ్ గాంధీ అదర్శంగా తీసుకున్నారన్నారు. హిందువుల మనోభావాలు గౌరవించేది గాంధీ కుటుంబం అని, దీనిని సుబ్రమణ్యస్వామినే చెప్పారని ఆయనే సాక్ష్యం కూడా అని వ్యాఖ్యానించారు. మీ రాజకీయ స్వార్థం కోసం మీరు మాట్లాడుతున్నారని , సెక్యులరిజం అంటే అందరి భావాలను గౌరవించడమేనని గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.

## ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోండి..

**(మొదటి పేజీ తరువాయి)**

పరిధిలో ఉన్నందున దీనిపై నేను మాట్లాడదల్చుకోలేదు. ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు వెళ్లిపోయాడు. నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోవడానికి మా నుంచి ఎలాంటి అభ్యంతరం లేదు. బాధిత మహిళలకు న్యాయం జరగాలి. నష్ట పరిహారం అందించాలి. నా కొడుకు హెచ్‌డి రేవణ్ణపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అందరూ చూశారు. ఆయనకు కోర్టు బెయిల్ ఇచ్చింది' అని దేవె గౌడ అన్నారు. ఈ కేసు గురించి హెచ్‌డి కుమారస్వామి తమ కుటుంబం మొత్తం తరపున మాట్లాడారని దేవె గౌడ తెలిపారు. జరిగినదంతా పరిశీలిస్తే తమ కుటుంబం పరువు తీసేందుకు, రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర జరిగినట్లు అనిపిస్తోందన్నారు. ఈ కుట్రలో చాలా మంది ప్రమేయం ఉందని వారి పేర్లను ప్రస్తావించదల్చుకోలేదని దేవెగౌడ పేర్కొన్నారు. ఎవరి ప్రమేయం ఉన్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 'దేవరాజే గౌడ ఏం మాట్లాడారో మీడియాలో చూశాం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కుమారస్వామి వీటన్నింటిపై చురుగ్గా స్పందిస్తున్నారు. అన్ని విషయాలపై ఆయనే మాట్లాడతారు. ఈ సమయంలో నేను ఏమీ వ్యాఖ్యానించలేను' అని దేవె గౌడ అన్నారు.

## హతమార్చిన కసాయి

**(మొదటి పేజీ తరువాయి)**

కల్లూరు మండలం లోకారం గ్రామానికి చెందిన దుర్గ తో పెళ్లి జరిగింది. వీరికి నీరజ (9), ఝాన్సీ (6) వయస్సు కలిగిన ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో పాటు అక్రమ సంబంధం నేపథ్యంలో రెండేళ్ల క్రితం భార్య దుర్గను హత్య చేసి కొంత కాలం జైలులో ఉన్నాడు. పిట్టల వెంకటేశ్వర్లు తల్లి పిచ్చమ్మ (60) ఇద్దరు మనవరాళ్ల ఆలనా పాలన చూస్తూ చెమటోడ్చి వీరిని సాకుతుంది. జైలు నుంచి వచ్చిన పిట్టల వెంకటేశ్వర్లు ఖమ్మంలో ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. పిచ్చమ్మ పేర ఉన్న కొంత స్థిరాస్తిని మనవరాళ్ల పేరున రాయాలని నిర్ణయించుకుని గ్రామంలో పెద్ద మనుషులకు తెలియజేసింది. ఈ విషయం తెలుసుకున్న పిట్టల వెంకటేశ్వర్లు ఆస్తిని తన పేర రాయాలని తల్లిపై రెండు నెలలుగా ఒత్తిడి చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తాను వస్తానని ఆస్తి రాసివ్వకపోతే హతమారుస్తానని హెచ్చరించాడు. ఇప్పటికే భార్యను చంపిన కొడుకు తనను కూడా హతమారుస్తాడని భయపడిన పిచ్చమ్మ చుట్టు పక్కల వారికి ఈ విషయాన్ని తెలిపింది. వారు రాత్రి పొద్దు పోయే వరకు పిచ్చమ్మ వద్ద కాపలాగా ఉన్నారు. పొద్దు పోయిన తర్వాత ఇక రాడులే అనుకుని ఎవరు ఇండ్లకు వారు వెళ్లగా పిచ్చమ్మ సైతం తన ఇంట్లో ఇద్దరు మనవరాళ్లతో నిద్రించింది. తెల్లవారు జామున ఇంటికి చేరుకున్న పిట్టల వెంకటేశ్వర్లు తలుపు కొట్టి తల్లిని లేపాడు. భూమి తన పేర రాయాలని తల్లితో ఘర్షణకు దిగాడు. తల్లి ససేమిరా అనడంతో గొంతు నులిమి హత్య చేశాడు. పిచ్చమ్మ వెంకటేశ్వర్లు ఘర్షణ పడుతున్న సమయంలో ఇద్దరు పిల్లలు మేల్కొని పక్కింటి వారిని లేపేందుకు బయటకు వచ్చారు. తల్లిని హతమార్చిన అతడు బయటకు వచ్చి చుట్టు పక్కల వారిని లేపే ప్రయత్నంలో ఉన్న పిల్లలపై విరుచుకుపడ్డాడు. చిన్న కుమార్తె ఝాన్సీని నేలకు వేసి కొట్టి హతమార్చాడు. చిన్న కుమార్తె చనిపోయింది అనుకున్న తర్వాత పెద్ద కుమార్తె నీరజను గొంతు నులిమి హత్య చేశాడు. ముగ్గురిని హతమార్చిన తర్వాత ఒకే మంచంపై పడుకోపెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి ఎవరు బయటకు రాకపోవడంతో తలుపు తెరిచి చూడగా ముగ్గురు విఘత జీవులై కనిపించారు. దీనితో ఒక్కసారిగా గోపాలపేట గ్రామం ఉలిక్కి పడింది. తమ కండ్ల ముందే రోజు తిరిగే చిన్నారులు వారికి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పిచ్చమ్మ హత్యకు గురి కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నీరజ ఇటీవల గురుకుల పాఠశాల కల్లూరులో సీటు సంపాదించింది. అయితే ఈ హత్యల వెనక వెంకటేశ్వర్లు తో పాటు సహజీవనం చేస్తున్న మహిళ కూడా ఉందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. విషయం తెలిసిన వెంటనే వైరా ఏసిపి రెహ్మాన్, సిఐ సాగర్, వైరా ఎస్ఐ వంశీ ఘటన స్థలంకు చేరుకుని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.8,889 కోట్లు స్వాధీనం

**(మొదటి పేజీ తరువాయి)**

ఎటిఎస్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఇండియన్ కోస్ట్ గార్డ్‌లు కలిసి చేపట్టిన ఆపరేషన్లలో కేవలం మూడు రోజుల్లోనే రూ.892 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడినట్లు వెల్లడించింది. అత్యధికంగా గుజరాత్‌లో రూ.1,461.73 కోట్ల విలువైన ప్రలోభాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ నివేదికలో వెల్లడైంది. రాజస్థాన్ (రూ.1133.82 కోట్లు), పంజాబ్ (రూ.734.54 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ.301.75 కోట్లు, తెలంగాణలో రూ.333.55 కోట్ల సొత్తు జప్తు చేసింది.

**'సి విజిల్'కి 2 నెలల్లో 4.24 లక్షల ఫిర్యాదులు**

ఎన్నికల సమయంలో ప్రజల నుంచి కోడ్ ఉల్లంఘనలను తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం తీసుకొచ్చిన 'సీవిజిల్ ' యాప్‌నకు విపరీతంగా తాకిడి పెరిగింది. కేవలం రెండు నెలల్లోనే దీనికి 4.24 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు ఇసి తాజాగా వెల్లడించింది. వీటిలో ఇప్పటికే మెజార్టీ ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపింది. 'మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటినుంచి ఇప్పటివరకు కోడ్ ఉల్లంఘనలపై 4,24,317 ఫిర్యాదులు అందాయి. ఇందులో 4,23,908 ఫిర్యాదులను పరిష్కరించాం. దాదాపు 89 శాతం కేసులను 100 నిమిషాల్లోనే ఛేదించాం. ఇంకా 409 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి' అని ఇసి వెల్లడించింది. నమోదైన కేసుల్లో అత్యధికం (3.24 లక్షలు) అక్రమ బ్యానర్లు, పోస్టర్లపైనే వచ్చాయని తెలిపింది. ఆస్తులను పాడుచేయడంపై 14,022.. నగదు, మద్యం, బహుమతుల పంపిణీపై 7,022.. గడువు ముగిసిన తర్వాత ప్రచారంపై 4,742.. మతపరమైన ప్రసంగాలపై 2,883.. మారణాయుధాలతో బెదిరింపులపై 2,430 ఫిర్యాదులు వచ్చినట్లు ఈసీ వెల్లడించింది. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడేవారిని గుర్తించేందుకు 'సీవిజిల్' అనేది పౌరుల చేతుల్లో ఉన్న సమర్థమంతమైన సాధనమని పేర్కొంది. సీవిజిల్ అనేది ఎన్నికల సంఘం రూపొందించిన ఫాస్ట్ ట్రాక్ మొబైల్ యాప్. ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘనలపై సాక్ష్యాధారాలతో సహా ఈసీకి ఫిర్యాదు చేయొచ్చు. వీటిని ఈసీ నిమిషాల్లో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా నగదు, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, తాయిలాలతో ప్రలోభపెట్టడం, రెచ్చగొట్టే ప్రసంగాలు, అసత్యాలు ప్రచారాలకు సంబంధించి ఏవైనా ఫొటోలు, వీడియోలు ఈ యాప్ ద్వారా ఈసీకి పంపించవచ్చు. మొత్తం మీద 100 నిమిషాల్లో ఫిర్యాదులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తుంది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## మెట్రో ప్రయాణ సమయాల్లో మార్పు లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పుల విషయమై జరుగుతున్న ప్రచారాన్ని మెట్రో రైలు లిమిటెడ్ అధికారులు ఖండించారు. మెట్రో ప్రయాణ సమయాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ అధికారులు వెల్లడించారు. మెట్రో రైళ్లు ఎప్పటి మాదిరిగానే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల మధ్య నడుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటల వరకు, ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటల నుంచే రైళ్ల రాక పోకలు మొదలవుతాయనేది ట్రయల్‌లో మాత్రమే చేశామని, ఇంకా ఆ వేళల్లో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. ప్రయాణికుల రద్దీ, రైళ్లు, ట్రాక్ నిర్వహణ సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణీకులెవరూ మెట్రో రైళ్ల సమయాల్లో అయోమయానికి గురికావద్దని, యథావిధిగా నిర్దిష్ట సమయానికే రాకపోకలు ఉంటాయని హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ అధికారులు తెలిపారు.

## ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తడిచిన ప్రతి ధాన్యం గింజను రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు ఏలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరంలేదని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇక నుంచి పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాయబరేలి ప్రచారంలో ఉన్న మంత్రి గత మూడు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షం కురుస్తుండడంతో తాజా పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భరోసా కల్పించే విధంగా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయడంతోపాటు, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసి, రైతులు నష్టపోకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సమస్యలు పరిష్కరించాలి

సిఎంకు బిజెపి శాసనసభ పక్షం వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐకెపి కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని బిజెపి శాసనసభా పక్షం నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం బిజెపి ప్రతినిధుల బృందం సిఎంని కలిసి వినతిపత్రం సమర్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 45 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం అవుతుందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహేశ్వర్‌రెడ్డి సిఎంకు తెలిపారు. వెంటనే ఈ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఎన్నికల హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి రూ. 500 లు బోనస్ సైతం చెల్లించాలని సిఎంను కోరారు. సిఎంను కలిసిన వారిలో బిజెపి ఎంఎల్‌ఎలు రామారావు పటేల్, పైడీ రాకేష్‌రెడ్డిలు ఉన్నారు.

## ఫీజులు, డొనేషన్ల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్పొరేటు కాలేజీలు, పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నాయని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. అక్రమంగా ఫీజులను వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలకు కార్పొరేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ కూడా ఒక ప్రధాన కారణమన్నారు. తమ పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందిస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందనే ఆశతో తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆస్తులు అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య, నారాయణ తదితర కాలేజీలు, పాఠశాలలు విచ్చలవిడిగా హద్దు పద్దు లేకుండా ఫీజులను పెంచుతున్నారని విమర్శించారు.కాగా బి.సి. సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షునిగా హరి తిలక్ సింగ్‌ను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ , భరత్, నీల వెంకటేష్, ఉదయ్, రాజ్ కుమార్, బాల స్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులు

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్




**ప్రజాపక్షం/వనస్థలిపురంః** సమాచార కమ్యూనికేషన్ రంగంలో దేశం అగ్రగామిగా ఉందని ఉమ్మడి పి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. శనివారం సాగర్ రోడ్డులోని హస్తినాపురంలో ప్రముఖ సాంస్కృతి సంస్థ అకృతి ఆధ్వర్యంలో ప్రపంచ టెలికాం దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టెలికాంలో 35 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించిన మాజీ ఉన్నతాధికారి జి.వెంకటేశ్వర్లును చంద్రకుమార్ శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెలికాం వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అక్కృతి అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో సాంకేతికత ఎంత పెరిగినా ప్రస్తుతం సైబర్ నేరాల సంఖ్య కూడా క్రమంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు అత్తుక్కుపోవడం తగ్గించుకోవడానికి తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జివీస్ కిరణ్, బిఎస్ఎన్ఎల్ మాజీ అధిఆకరి రమేష్ బాబు, శరణ్య చార్యులు, ఎన్ఎన్ శాస్త్రి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్‌గౌడ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. శనివారం షాద్‌నగర్ ఎంవిఐ కార్యాలయాన్ని చంద్రశేఖర్‌గౌడ్ తనిఖీ చేశారు. కార్యాలయంతోపాటు పరిసరా ప్రాంతాలను పరిశీలించి స్థానిక ఎంవిఐ వాసుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ పర్యావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు నాటేందుకు కృషి చేయాలని సూచించారు. నాటిని మొక్కలను రక్షించేందుకు బాధ్యతలు చేపట్టాలని పేర్కొన్నారు. షాద్‌నగర్ ఎంవిఐ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్న మొక్కలను రక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే వాహనదారులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, పనులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. కార్యాలయంలో సిబ్బంది కొరతను నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్ గౌడ్‌కు స్థానిక ఎంవిఐ వాసు పూల బోకేతో ఘనంగా స్వాగతం ఫలికారు.

# రైల్వే ఉద్యోగాల పేరుతో టోకరా

రైల్వే ఉద్యోగితో పాటు మరో నిందితుడి అరెస్టు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలో ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టిటిఇ)గా ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించిన ఓ ముఠా గుట్టును హైదరాబాద్ పోలీసు కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. రైల్వే ఉద్యోగితో పాటు మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు గోపాలపురం ఇన్‌స్పెక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన ఎస్.అనిల్‌కుమార్, సికింద్రాబాద్ రైల్వే ఉద్యోగి నవీన్ కుమార్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రైల్వేలో టిటిఇ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌లు ఇచ్చి నిరుద్యోగులు, విద్యార్థులను మోసగించేవారు. ఈ క్రమంలోనే మల్కాజ్‌గిరికి చెందిన బిఎస్‌సి కంప్యూటర్ పూర్తి చేసుకున్న షేక్ హుస్సేన్ (26) వాట్సాప్ ద్వారా మూడేళ్ల క్రితం అనిల్‌కుమార్‌కు వాట్సాప్ గ్రూప్ ద్వారా పరిచయం అయ్యాడు. తనకు రైల్వేలో ఉన్నతాధికారులు తెలుసని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి హుస్సేన్ నుంచి రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఆ తరువాత హుస్సేన్‌ను అనిల్‌కుమార్ పాట్నాకు తీసుకెళ్లి అక్కడ నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీని ఇచ్చాడు. ముందుగా రైల్వే ఉద్యోగి నవీన్‌కుమార్ వద్ద ఆరు నెలలు టిటిఇలో శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని నమ్మించాడు. అనిల్‌కుమార్ ఈ మేరకు రైల్వే ఉద్యోగి నవీన్‌కుమార్‌ను కలిపించాడు. ఇది నిజమేనని నమ్మిన హుస్సేన్‌ను నవీన్‌కుమార్‌తో కలిశాడు. అయితే చివరకు తనకు ఇచ్చిన జాబ్ అపాయిమెంట్ ఆర్డర్ కాపీ నకిలీదని గుర్తించిన హుస్సేన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ డిసిపి ఎస్.రష్మీ పెరుమల ఆదేశాల మేరకు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు బి.అశోక్‌రెడ్డి, పి.జ్ఞానదీప్, శ్రీనివాసులు దాస్‌లు చాకచక్యంగా అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా రైల్వే ఉద్యోగి నవీన్‌కుమార్ ఉదంతం వెలుగు చూసింది. దీంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ ఇద్దరు నిందితులను గోపాలపురం పోలీసులుకు అప్పగించారు. గోపాలపురం ఎస్ఐ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా ఎంతమంది నిరుద్యోగులకు టోకరా వేశారనే అంశంపై ఆరా తీస్తున్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పట్టణానికి చెందిన పలబట్ల పాండురంగం గుప్తాతోపాటు వారి కుమారులు పలబట్ల శివకుమార్‌గుప్తా, సతీష్‌గుప్తా, ఆనంద్ గుప్తాలు శనివారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నూతనం గా నిర్మిస్తున్న శ్రీఆంజనేయ స్వామి దేవాలయానికి ఒక లక్ష 11వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కక్కునూరి వెంకటేష్ గుప్తా, అన్మారి వెంకటయ్యలు ఉన్నారు.

### బీరప్ప దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/షాబాద్:** మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ బీరప్ప దేవాలయ నిర్మాణానికి బిజెపి కార్యకర్తలు ఆర్థిక సహాయం చేశారు. దాతల సహకారంతో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి యువమోర్చ అధికార ప్రతినిధి కూతురు మహేందర్, మాచన్‌పల్లి బూత్ అధ్యక్షుడు కావలి శివ, సిహెచ్ రాజు, సాయి, అరుణ్, సురేష్, రమేష్, శ్రీనివాస్, నవీన్, వివేక్‌లు పాల్గొన్నారు

## కాంట్రాక్టర్లకు భారీగా బల్దియా బకాయిలు

పెండింగ్ బిల్లులు ఇచ్చేదాక పనులు బంద్

బిల్లులు రాక అప్పులపాలయ్యాం

అత్యవసర పనులు కూడా నిలిపేస్తాం : కాంట్రాక్టర్ల హెచ్చరిక




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రాక్టర్లకు మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) భారీ స్థాయిలో బకాయిలు పడింది. సుమారు రూ.13,50 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన బాటా పట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించేవరకు పనులను నిపివేయాలని జివిచ్ఎంసి కాంట్రాక్టర్‌ల అసోసియేషన్ నిర్ణయించించింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం కాంట్రాక్టర్‌ల అసోసియేషన్ సమావేశం జరిగింది. గురువారం ఆబిడ్స్ లోని సర్కిల్14 కార్యాలయంలో ఇ. రాము అనే కాంట్రాక్టర్ గుండెపోటుతో మృతి చెందారు. అయితే సంవత్సర కాలంగా పెండింగ్ బిల్లులు రాకపోవడంతోనే రాము ఆర్థిక ఇబ్బందులతో ఒత్తిడి కారణంగా గుండెపోటుకు గురై మరణించాడని తోటి కాంట్రాక్టర్లు వాపోయారు. ఈ నేపథ్యంలో బిల్లులు చెల్లించే వరకు పనులు చేపట్టవద్దని జిహెచ్ఎంసి కాంట్రాక్టర్‌ల అసోసియేషన్ సమావేశంలో కాంట్రాక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. 2023 మే నెల నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు బిల్లులు చెల్లించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. బకాయిలు చెల్లిస్తేనే పనులు చేస్తామని, కొత్తగా వచ్చే ఏ పనులను చేపట్టబోమని తెల్చిచెప్పారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి రూ.1,350 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని, వాటిని వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని జిహెచ్ఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.రామకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. సురేందర్ సింగ్‌తో పాటు ప్రతినిధులు డిమాండ్ చేశారు. బల్దియా పెండింగ్ బిల్లులను విడుదల చేయని కారణంగానే కాంట్రాక్టర్లు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులకు నెల నెల వడ్డీలు చెల్లించలేక, ఆ ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా ఎలాంటి పనులు చేపట్టబోమని, పూర్తిగా పనులను నిలిపివేస్తున్నామని స్పష్టం చేశారు. కొత్త పనులకు టెండర్లు కూడా దఖలు చేయవద్దని, ముఖ్యముగా వర్షాకాల పనుల కోసం ఆహ్వానించే టెండర్ ప్రక్రియలో పాల్గొనవద్దని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధరణి సమస్యలు సత్వరమే పరిష్కరించండి

సమావేశంలో అధికారులను కోరిన ఎంపిపి



**ప్రజాపక్షం/కొత్తూరు:** ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో పోలింగ్ బూత్‌లతోపాటు రేషన్ షాపులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్తూరు ఎంపిపి పిన్నింటి మధుసూదన్ రెడ్డి కోరారు. శనివారం ఎంపిపి మధూసూదన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిధిలోని నూతనంగా ఏర్పడిన కొడిచర్ల తండాలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా నూతర రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మండల రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు తహశీల్దార్ రవీందరెడ్డి స్పందిస్తూ బూత్‌ల వారిగా ఓటర్ల జాబితా కలిసి ఉందని, దాంతో కొన్ని ఇబ్బందులు ఎర్పడుతున్నాయని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ధరణి ధరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపిపి అధికారులను కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ ఎన్నికల కోడ్ రావడంతోనే ధరణి సమస్యల పరిష్కారంలో కొంత జాప్యం నెలకొందని, ఇప్పటికే కొన్ని సమస్యలను పరిష్కరించడం జరిగిందని, మరికొన్ని సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచులు లేరని, దాంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలు వస్తున్నాయని విద్యుత్ సమస్య లేకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపిడివో అరుంధతి, కోడిచర్ల ఎంపిటిసి సభ్యుడు రవీందర్‌రెడ్డి, ఎంపిటిసి కృష్ణయ్యతోపాటు వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు ఉన్నారు.

## నెగ్గిన అవిశ్వాసం

పదవి కోల్పోయిన నార్సింగి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/నార్సింగి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని నార్సింగి మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్‌పై శనివారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు తమ పదవులను కోల్పోయారు. నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆర్‌డిఓ వెంకట్‌రెడ్డి సమక్షంలో అవిశ్వాసంపై సమావేశం నిర్వహించారు. మొదటగా చైర్‌పర్సన్ రేఖ యాదగిరిపై అవిశ్వాసం పెట్టగా 18 మంది కౌన్సిల్ సభ్యుల్లో 14 మంది చేతులెత్తి తీర్మాణానికి అనుకూలంగా ఓటు వేశారు. అనంతరం వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్‌కు 14 మంది చేతులెత్తారు. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ పదవులను కోల్పోయారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ అవిశ్వాసం పైన నెగ్గిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేసి తదుపరి సమాచారాన్ని గవర్నమెంట్ కు తెలియజేస్తామని వెల్లడించారు.

### అభివృద్ధి చేసుకుందాం

ఈ సందర్భంగా తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం కో ఆప్షన్ సభ్యులతో మున్సిపాలిటీని కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. దానికి ప్రతిఫలంగానే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయంలో అభివృద్ధికి ఆకర్షితులైన కౌన్సిలర్లు తమ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తమ కౌన్సిలర్లు అవిశ్వాసంపై ప్రవేశపెట్టిన తీర్మానంలో అనుకూలంగా ఓటు వేసినట్లు వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా పక్షపాతం చూపించకుండా నార్సింగి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి కౌన్సిలర్లు మైలారం నాగపూర్ణ,జి.విజయ్ బాబు,అమరేందర్ రెడ్డి, జి.శివారెడ్డి,దుర్గేష్,లక్ష్మీ ప్రవళిక,ఉషారాణి, గోపాల సునీత,పత్తి ప్రవీణ్ కుమార్,పత్తి శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** రాచరికపు దౌష్ట్యాన్ని అహింసాయుతంగా ధిక్కరించిన ధీర. ఆత్మాభిమానానికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మహా శక్తి స్వరూపిణి వాసవి కన్యకాపరమేశ్వరి అని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శనివారం గడ్డి అన్నారం ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీ కన్యకాపరమేశ్వరి పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి శుభాకంక్షలు తెలిపారు. వాసవీ కన్యకా పరమేశ్వరి కారణ జన్మురాలని. శక్తి స్వరూపిణి అని, రాచరికపు దౌష్ట్యాన్ని అహింసాయుతంగా ధిక్కరించిన ధీర. ఆత్మాభిమానానికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ ఎంఎల్ఆర్ గుప్తా, పబ్బ బాలయ్య, ఎన్టీఆర్ కృష్ణ, ఉపేందర్, ప్రవీణ్, నరేష్, ఎల్‌వి కుమార్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రూప్ వన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక






**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. టిఎస్ పిఎస్ ద్వారా జూన్ 9వ తేదీన నిర్వహించనున్న గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి సూచించిన నెపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక జిల్లాకు చెందిన అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జూన్ 9న(ఆదివారం)ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్ వన్ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో (93) కేంద్రాలను ఏర్పాటు చేశామని,(55,692)మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు.తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావియ్యరాదని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరీక్ష జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభ్యర్థులు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ శాశంక స్పష్టం చేశారు. ఉదయం 9:00 గంటల నుండి 10:00 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోకి అనుమతిస్తారన్నారు. 10:00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో లోనికి అనుమతించరని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్‌లు, రైటింగ్ పాడ్స్ అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌ను, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్తు ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు,పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు 9:00 గంటలలోగా చేరుకునేలా ఆయా రూట్లలో తగినన్ని బస్సులను నడపాలని ఆర్‌టిసి వారికి,పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రం చేయించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ)కు సూచించారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, ఒఆర్ ఎస్ పాకెట్లతో ఎఎన్ఎమ్ లను అందుబాటులో ఉంచాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్రూప్ వన్ పరీక్ష సజావుగా నిర్వహించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, సంబంధిత శాఖలకు చెందిన జిల్లా అధికారులు,చీఫ్ సూపరింటెండెంట్స్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందించేలా చర్యలు

పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, స్కూల్ యూనిఫామ్స్ కుట్టించి సకాలంలో అందజేయడం పై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు జూన్ ఏడవ తేది నాటికి ఒక జత బట్టలు అందించడానికి యూనిఫాంలను కుట్టడానికి గుర్తించిన టైలర్‌లతో వేగవంతంగా పనులు చేపట్టడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఆర్ డిఎపిడి శ్రీలత, మెప్మా పిడి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వంశీచందర్‌రెడ్డిదే విజయం

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు కెఎస్ఆర్ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం /బాలానగర్ :** దేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పారీట ప్రభంజనం సృష్టించబోతుందని , దేశానికి కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీయేనని బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేఎస్ఆర్ వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు . మహబూబ్నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి భారీ మెజార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు . పార్లమెంట్ ఎన్నికల్లో ముగిసిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పదికి పైగా సీట్లు సాధించబోతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి ఉన్నారని, అలాగే పాలమూరు పార్లమెంటు ఎన్నికల్లో వంశీచంద్ రెడ్డి గెలిస్తే అభివృద్ధి మరింత జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి ఉన్నారని, అలాగే పాలమూరు పార్లమెంటు ఎన్నికల్లో వంశీచంద్ రెడ్డి గెలిస్తే అభివృద్ధి మరింత జరుగుతుందని తెలిపారు. పాలమూరు నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంలో జోడెద్దుల పాలన కోరుకున్నారని, అందుకే ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి , ఎంపీగా గెలవబోయే వంశీచంద్ రెడ్డి లు ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి రెండు కళ్లలాగా పనిచేస్తారని వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎంఇఒగా సురేష్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/మల్దకల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల ఎంఈఓ గా సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.ఈ ఓ గా బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషంగా ఉందన్నారు . ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేస్తానని అన్నారు . విధి నిర్వహణలో భాగంగా నిత్యం ప్రభుత్వ పాఠశాలను పర్యవేక్షిస్తానని అన్నారు . అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు , ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు అభినందనాలు తెలిపారు .



## నిరుపేదలకు అండగా వెంకటాచారి

**ప్రజాపక్షం /బాలానగర్ :** నిరుపేదలకు అండగా బాలానాగర్ మండల వైస్ వెంకటాచారి అండగా ఉంటున్నారు . శనివారం బాలానగర్ గ్రామంలో ఎండీ ముస్తఫా కూతురి వివాహం కోసం ఆర్థిక సాయం 5000 అందించిన్నట్లు వెంకటాచారి అందజేశారు . నిరుపేదలకు సాయం చేయడంలో గొప్ప మనుసు చేటుకుంటున్నట్లు తెలిపారు.



## టిజి వెంకటేశ్‌కి జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/మానవపాడు :** ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ రాష్ట్ర మంత్రి మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీవాసవి సేవా సమితి జాతీయ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేశ్ నివాసం కర్నూల్ నందు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శ్రీవాసవి సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూరి సురేష్ శెట్టి కి ఎప్పుడు ఎల్లవేళలా నా సహాయం సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు అఖ్తర్ పూరి రంజిత్ కుమార్, సీనియర్ జర్నలిస్టు పోలిశెట్టి సురేష్ నూకల ప్రసాద్ ఉమామహేశ్వర్ తదితరులు ఉన్నారు.



## శ్రీకృష్ణ కళామండలి నాటక ప్రదర్శనకు అభినందన

**ప్రజాపక్షం/జడ్చర్ల :** శుక్రవారం నాడు రాత్రి జడ్చర్ల మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో శ్రీకృష్ణ కళామండలి గ్రామ కమిటీ అధ్యక్షులు పంతులు గోరంట్ల మల్లేశ్ అధ్యక్షతన ప్రదర్శించిన చిరుతల శ్రీ మార్కండేయ విలాసం నాటకాన్ని తిలకించిన రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, కళాకారులను ఉద్దేశించి బాద్మి శివకుమార్ మాట్లాడుతూ టీవీ సీరియల్స్, చరవాణి, ప్రస్తుతం ప్రజా జీవితంలో ఒక భాగం అయ్యాయని ప్రాచీన కళలు అంతరించిపోతున్న తరుణంలో ఈ మధ్యకాలంలో గ్రామీణ జానపద కళలకు ఊపిరి పోస్తున్న బూర్గుపల్లి గ్రామానికి చెందిన కళాకారులను, ప్రోత్సాహిస్తున్న ప్రజలను అభినందించారు. అనంతరం కళాకారుల కోరిక మేరకు వేదికపై, మాయల ఫకీర్ పాత్రదారి మాటలను వేదికపై పలికి ప్రజలను ఆనందింపచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్, పంతులు గోరంట్ల మల్లేశ్, మాజీ ఇంచార్జి సర్పంచి కృష్ణకుమార్, గౌడుగు శంకరయ్య, పెద్ద నరసింహులు, గోరంట రామకొండ, కలకోటి వెంకటేశ్, రామచంద్రయ్య , చెన్నకేశవులు , రామస్వామి, దుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో ఐపిఎల్ బెట్టింగులు

### అప్పులు చేసి పందేలు కాస్తున్న యువకులు

**ప్రజాపక్షం / రాజోలి :** ఐపిఎల్ హోరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ వేదికగా మాయలోపడి యువత ఉన్నది కాస్తా ఊడగొట్టుకుంటున్నారు.కొందరు పొయిన చోటే వెతుక్కోవాలని అప్పులు చేసి బెట్టింగులు పెడుతూ మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారు. వీరు కూలీ పని చేస్తూ మొదట వందలు, వేలు, కాస్తూ నష్టపోయి ఇప్పుడు సైకిల్స్, మొబైల్ ఫోన్లు, బైకులు తాకట్టు పెడుతూ బెట్టింగులకు పాల్పడుతున్నారు. వీరి వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికి పోవడమే కాకుండా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది ముఖ్యంగా యువత గ్రామాల్లో మ్యాచ్ ప్రారంభం అవుతున్న సమయంలోనే గ్రూపులుగా చేరుకొని ఆన్‌లైన్ పేమెంట్ చేస్తూ వేయి, రెండువేలు, అంటూ క్రమ క్రమంగా వేల రూపాయలు బెట్టింగ్ కట్టి పోగొట్టుకుంటున్నారు. మళ్ళీ పెద్ద మొత్తంలో పందేలు కాసి తీవ్రంగా నష్టపోతున్నారు. చివరికి బాల్ బాల్‌కు, ఓవర్‌కు, వికెట్ తీస్తాడని,ఫోర్ కొడతాడని,సిక్స్‌కొడాదని,పరుగు,పరుగుకు పందేలు కాస్తున్నారు.తీవ్రంగా నష్టపోతున్నారు

# రేవంత్ పంతం : రుణమాఫీ తథ్యం

### రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
### ఉమ్మడి జిల్లాలో ఐదున్నర లక్షల మంది రైతులకు లబ్ది



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రేవంత్ రెడ్డి చెరగని ముద్ర వేస్తున్నారు. అట్టడుగున ఉన్న కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన నేతగా కాంగ్రెస్ పార్టీలో పేరు ఉంది. హామీలున్న కాంగ్రెస్ పార్టీలో నెట్టుకు రావడం అంటే రేవంత్ రెడ్డి ది చాణిక్య నీతి చెప్పాలి. అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ప్రజల్లో జననేతగా పేరు తెచ్చుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నిటిని ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నారు. ఏకకాలంలో రైతాంగానికి రెండు లక్షల రూపాయల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని మాటిచ్చారు. అందులో భాగంగానే ఆగస్టు 15 నాటికి రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని డెడ్ లైన్ విధించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని అవాంతరాలు ఎదురైన రుణమాఫీ చేసి తీరుతామంటూ రేవంత్ రెడ్డి రైతాంగానికి మాటిచ్చారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఐదు లక్షల 49 వేల 108 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రూ 2.737 కోట్లు రైతాంగం వ్యవసాయ రుణాల కింద తీసుకున్నారు.వీరందరి రుణాలు మాఫీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.ఈ మేరకు కసరత్తు ప్రారంభిచినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా చిన్న,సన్న కారు రైతులే ఎక్కువగా ఉండడంతో రెండు లక్షల రూపాయలు వ్యవసాయ రుణం తీసుకున్న రైతులు చాలా తక్కువగా ఉంటారు. లక్షలు రుణం తీసుకున్నా రైతులే ఎక్కువ ఉంటారు ప్రభుత్వం తీసుకున్న రుణమాఫీ నిర్ణయం మూలంగా ఉమ్మడి జిల్లాలోని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పిన్నప్పటికి అర కొరగా,అసంపూర్తిగా చేయడం మూలంగా ఎవరికి ప్రయోజనం కలగలేదు ఏకకాలంలో చేయకుండా విడతలవారీగా చేయడంతో చాలా తక్కువ మంది రైతులుమాత్రమే లబ్ది పొందారు ప్రస్తుతం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తమని ప్రకటించడం ఆ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కి రైతాంగం పై ఉన్న ప్రేమను తెలియజేస్తుందని ప్రజలు భావిస్తున్నారు.వ్యవసాయ కుటుంబం నుంచి రేవంత్ రెడ్డి ఈ స్థాయికి ఎదగడం మూలంగానే రైతాంగ సమస్యలు తెలిసే, ఎంత కష్టమైనా రైతు రుణమాఫీ కి కట్టుబడి ఉండడం నిజంగా అభినందనీయమని రైతులు అంటున్నారు. 2019 ఏప్రిల్ 10 నుంచి డిసెంబర్ 2023 వరకు 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణాలు తీసుకున్న వారి వివరాలను సంబంధిత బ్యాంక్ అధికారులు సేకరిస్తున్నట్లు ,ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తుంది. మొత్తం మీద రేవంత్ రెడ్డి సర్కార్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని రైతాంగం హర్షిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,47,500 మంది రైతులు రూ. 935.40 కోట్ల రూపాయల వ్యవసాయ రుణం తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,23,102 మంది రైతులు రూ.735.82 కోట్ల రుణం తీసుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 95,199 మంది రైతులు,3 67.72 కోట్ల రుణం తీసుకున్నారు.నారాయణపేట జిల్లాలో 94,359 మంది రైతులు రూ. 357.62 కోట్ల రుణం తీసుకున్నారు.వనపర్తి జిల్లాలోని 88,948 మంది రైతులు రూ.340.20 కోట్ల రూపాయల రుణం తీసుకున్నారు. వీరందరికి ప్రభుత్వం ఈ ఆగస్టు 15 వరకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి

### వచ్చే నెల 8 న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం
### జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ



**ప్రజాపక్షం/నర్వ :** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు లో జరిగిన కో ఆర్డినేషన్ మీటింగ్‌లో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ జూన్ 8న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించ బడునని పోలీస్ అధికారులకు తెలిపారు. ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. ప్రజలు జూన్ 8న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని తమతమ కేసులను రాజ మార్గం ద్వారా , పరిష్కారం పొందెలా చూడాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సూచించారు. రాజీమార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులను పరిష్కారం చేయాలని ఆయన పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఈసందర్భంగా నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న సివిల్, క్రిమినల్ కంపోండబుల్, సైబర్ క్రైమ్స్, హిట్ అండ్ రన్ కేసులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు నారాయణపేట టౌన్, రూరల్, మాగనూరు, మద్దూరు, దామరగిద్ద , ఉట్కూర్, కోస్గి, ఎక్సైజ్ నారాయణ పేట, మరికల్, ధన్వాడ, మక్తల్, కృష్ణ, ఇతర స్టేషన్‌లలో ఈపెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగ్లో ఉన్నాయని టార్గెట్ గా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖలో ఏమైనా పెండింగ్ కేసులు ఉంటే క్లియర్ చేయాలన్నారు. అన్ని కలిపి 6500 వేల కేసులను టార్గెట్ గా న్యాయమూర్తి నిర్దేశించారు. ఈ సందర్భంగా జిల్లా డి ఎస్ పి లింగయ్య మాట్లాడుతూ జూన్ 8 న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో న్యాయ మూర్తి ఇచ్చిన టార్గెట్ దృష్టిలో పెట్టుకొని 90 శాతం వరకు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో న్యామూర్తులు సీనియర్ సివిల్ జడ్జ్ జి శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఉమర్, లిగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిర్స్ లక్ష్మి పతి గౌడ్, నాగేశ్వరి, జిల్లాకు చెందిన సి.ఐ లు అన్ని పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ వర్ధంతి జ్యోతి యాత్ర




**ప్రజాపక్షం / కొత్తకోట :** కాంగ్రెస్ పార్టీ లేబర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్. దొరై ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా బుధవారం రోజు కర్ణాటకలోని బెంగుళూరులో జ్యోతి యాత్రను ప్రారంభించారు ఆ యాత్రను శనివారం తమిళనాడులోని కన్యకుమారికి చేరుకుంది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా తమిళనాడు పిసిసి అధ్యక్షులు జేబి ప్రిన్స్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ సేవలు ఎలలేనివని దేశానికి తమిళనాడుకు ఎన్నో సేవలు చేశారని అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి మే 21న ఉంటుందని, ఈ యాత్ర పెరంబదూర్ ముగుస్తుందన్నారు. జ్యోతి యాత్ర చైర్మన్ ఆర్. దొరైని తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా కొత్తకోట నుండి వచ్చిన మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్టం అమృత్ రెడ్డి, గంగారం బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వ్యాక్సిన్ కేంద్రం తనిఖీ

**ప్రజాపక్షం/శ్రీరంగాపురం :** మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో చిన్న పిల్లలకు టీకాలు వేస్తున్న కేంద్రాన్ని జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డా. పరిమళ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీ స్త్రీల టీకాలు సకాలంలో వారందరికి టీకాలు వేయించి, టీకా సమీకరణ సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలని , అక్కడున్న వైద్య సిబ్బందికి తెలియజేశారు. ఎప్పటికప్పుడు ఎంసిహెచ్ కిట్టులో ఆన్ లైన్ అప్డేట్ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారి దగ్గర ఉన్న రికార్డులు పరిశీలించారు. గ్రామంలో ఉన్న ఆశా కార్యకర్తలకు రాబోయే కాలంలో వర్షాలు పడుతున్న కారణంగా గ్రామంలో నీళ్లు నిలవకుండా ప్రతి శుక్రవారం ఫ్రైడే , డ్రై డే నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జాల చంద్రయ్య, ఏఎన్ఎం వెంకట నర్సమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఐడిఓసిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 24 నుండి ప్రారంభమయ్యే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పగటి బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూం వద్ద పోలీసు భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయాలని అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ ను సూచించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ , సమయానికి ఆర్టీసి బస్సులు నడపాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మౌలిక వసతులతో పాటు ప్రథమ చికిత్స కిట్లతో ఏఎన్ఎం, ఆశా వర్కర్లను నియమించాలని వైద్య అధికారిని ఆదేశించారు. పరీక్షలు జరుగనున్న ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేసే విధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చూడాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి టివి కెమెరాలుఉండేవిధంగా చూడాలని అవసరమైన చోట స్క్రైబ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సి. మద్దిలేటి మాట్లాడుతూ మే 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలో వనపర్తి జిల్లా నుండి 6134 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 3978 ఉండగా ద్వితీయ సంవత్సరం 2156 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయని వివరించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ , అదనపు ఎస్పీ రామదాసు తేజావత్ , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్ , తహసీల్దార్ కిషన్ నాయక్ , డిఎం ఆర్టీసీతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

### అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులులేకుండా సేకరించాలని నాగర్‌కర్నూల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు సూచించారు. శనివారం కొల్లాపూర్, మాచినేనిపల్లి, పెంట్లవెల్లిలో పలు వరిధాన్యం కొనుగోలుకేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వడ్లను పూర్తిగా ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు సూచించారు.కొనుగోలుచేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు చేరేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు ఇవ్వాలన్నారు. గన్నీబ్యాగుల కొరతలేకుండా ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదించి గన్నీబ్యాగులను సమకూర్చుకోవాలన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. 17శాతంతేమ ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి లారీలద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్లు ఇతర అధికారులు ఉన్నారు.



## ఘనంగా నివాళులర్పించిన ఎంపిపి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పెద్దకొత్తపల్లి సింగిల్‌విండోమాజీచైర్మన్ దేవరపాక బాలస్వామి తమ్ముడు అనిల్‌కుమార్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ వెన్నచర్ల గ్రామానికివెళ్లి అనిల్‌కుమార్ మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. నివాళులర్పించినవారిలో సింగిల్‌విండోడైరెక్టర్ బుడుగుశ్రీనివాస్, జడ్పిటిసి మేకలగౌరమ్మచంద్రయ్య, సర్పంచులు చిన్నయ్య, రాధాబాలస్వామి, వెంకటేశ్వరరెడ్డి, సత్యం, ఉపసర్పంచులు మల్లేష్, మల్లయ్య, ఎంపిటిసిలు రవికుమార్, శశికళ శివశంకర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు దండునర్సింహ్మా, గుమ్మ కొండరమేష్, జంగంపెద్దరాజు, బాలింగాచారి, ముచ్చపోతుశంకర్, గడిగోపులనాగేందర్ ఉన్నారు.



## భక్తిశ్రద్ధలతో వాసవిమాత జయంతి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో శనివారం వాసవిమాత జయంతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వైశాఖశుద్ధ దశమి అమ్మవారి జయంతిగా జరుపుకుంటారు. జయంతిమాసం సందర్భంగా వేకువజామున వాసవిమాత అభిషేకం అనంతరం గీతాపారయణం హనుమాన్‌చాలీసా పఠనం , అమ్మవారిపల్లకి సేవను నిర్వహించారు. వాసవికన్యకా పరమేశ్వరి దేవాలయం ట్రస్టుచైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. పల్లకిసేవ అనంతరం సామూహిక కుంకుమార్చన, వాసవిమాతపారాయణపఠనం జరిగింది. అనంతరం వాసవిమాత డోలాహరణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు ఉత్సవాలకు హాజరయ్యారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులందరికి ఆలయచైర్మన్ రమేష్ బాబు బోజనప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లిశ్రీధర్, కోశాధికారి శివజగదీశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంపశ్రీనివాస్, వాసవిక్లబ్‌అధ్యక్షుడు శ్రీనివాస్,కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అశోక్, ఆవోప అధ్యక్షుడు సతీష్ గుప్తా తదితరులతోపాటు పెద్దసంఖ్యలో మహిళలు, ఆర్యవైశ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని బలరాంనగర్‌కాలనీకిచెందిన బత్తిని తిరుపతిరెడ్డి, సంజాపూర్‌గ్రామానికిచెందిన దొడ్ల సుమతమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్మలశ్రీకాంత్‌రెడ్డి ఇరు కుటుంబాలను పరామర్శించి రూ.5వేలచొప్పున ఆర్థికసహాయం అందజేసి కుటుంబాలకు ధైర్యంచెప్పి మృతిచెందిన కుటుంబాలకు కాంగ్రెస్‌పార్టీ అన్నివేళల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## సారాయి విక్రేతలపై కేసు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ మున్సిపాలిటిలో నాటుసారాయి విక్రయిస్తున్న స్థావరాలపై దాడులుచేసి నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొల్లాపూర్ ఎక్సైజ్‌సీఐ నాగిరెడ్డి తెలిపారు. సారాయిదాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ హన్మంత్, డిటిఎఫ్ ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం



**ప్రజాపక్షం/చర్లపల్లిః** న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జడ్జి డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు.కాప్రా మండలం బాలాజీ నగర్ అయ్యప్ప కాలనీలో అశ్రయ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డిఎల్ఎస్ఎ సహకారంతో న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి అసంఘటిత కార్మికులను ఉద్దేశించి వారి పరిరక్షణకు ఉపయోగపడే చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.ప్రమాద సమయంలో ఆర్థికంగా సహాయ పడే లేబర్ కార్డు గూర్చి వివరించి కార్మికులను ప్రొత్సహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పిఎల్‌వి న్యాయవాది రాకేష్,యోగి,ఆశ్రయ్ ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్ జీవన్,ఫీల్డ్ ఆఫీసర్ కాంతయ్య,రవి,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 8న జాతీయ లోక్‌అదాలత్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టులో ఉన్న పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీపడేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి వికారాబాద్ కోర్టు అవరణలో పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల జున్ 8న నిర్వహించే జాతీయ లోకాదాలత్ పెండింగ్‌లో ఉన్న కేసులు అధికా సంఖ్యలో కేసులు రాజీ పడే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శీతల్‌సీనియర్ సివిల్ న్యాయమూర్తి, శ్రీకాంత్, శృతిదుత, జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి, వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, తాండూర్ డిఎస్‌పి బాలకృష్ణ, పరిగి డిఎస్‌పి కారునసాగర్ , వికారాబాద్ సిఐ నాగరాజు తదితరులు పాల్గోన్నారు.

# భూములు కబ్జా పేరుతో మామా-అల్లుడు హల్‌చల్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** భూ కబ్జా ఆరోపణలెదర్కొంటున్న మామా అల్లుళ్ళైన మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి శనివారం తమ భూమిలో కొంత మంది అక్రమంగా ప్రవేశించి దురాక్రమణలకు పాల్పడుతున్నారంటూ అక్కడ ఉన్న వారితో ఘర్షణకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని తెల్సుకొన్న పోలీసులు ఇరు వర్గాలను అదుపు చేసేందుకు యత్నించారు. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేలిద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ ప్రత్యర్థి వర్గాలకు పోలీసు యంత్రాంగం సహకరిస్తోందని, తాము ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా సిబ్బంది సైతం లేరంటూ పట్టించుకోవటం లేదని, దీని వెనుక కాంగ్రెస్ నేతలు ఉన్నారని, తమపై కేసులు నమోదు చేసినా, అరెస్టులు చేసినా లెక్క చేయబోమని, తమ భూమిని కబ్జా దారుల నుండి కాపాడుకొంటామని వారన్నారు. కాగా ఇరు వర్గాలకు మధ్య వివాదం నెలకొన్న స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున ఆ మేరకు నడుచుకోవాలని పోలీసులు సర్ది చెబుతున్నారు.

**వివరాల్లోకి వెళితే.......**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల విలేజి సుచిత్ర మిలిటరీ కౌంపౌండ్ వాల్ రహదారి పక్కన 82,83 సర్వే నంబరులోని రెండెకరాల 10 గుంటల స్థలానికి సంబంధించి కొంత మందితో వివాదం ఏర్పడింది. ఈ స్థలం మొత్తం తమదేనని ఎమ్మెల్యేలు వాదిస్తుండగా సర్వే నంబరులోని 1.11 ఎకరాలకు స్థలాన్ని తాము గతంలోనే 400 గజాల చొప్పున ఇంటి నిర్మాణాలకు గాను కొనుగోలు చేసామని, దీనికి సంబంధించిన వివాదం కోర్టు వరకు చేరి చివరికి తమకు అనుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో ధర్మపూరి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీప్ విప్ వడ్లూరి లక్ష్మ ణ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిలతో పాటు తమదే అంటూ వాదిస్తున్నారు. ఈ క్రమంలో వారందరూ ఈ స్థలానికి చేరుకొని రేకుల షెడ్డులు వేస్తూ ఫెన్సింగ్ నిర్మాణాలు చేపడుతున్న విషయం తెల్సుకొన్న ఎమ్మెల్యేలు ఇద్దరూశనివారం ఉదయం అక్కడికి చేరుకొని తమకు చెందిన స్థలంలో ఫెన్సింగ్ ఎలా వేస్తారంటూ వాదించారు. ఆ ప్రాంతానికి ఎమ్మెల్యే అనుచరులు పెద్ద సంఖ్యలో చేరుతుండటంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు సివిల్ కేసు అయినందున కోర్టు ఆదేశాల మేరకు ఇరు వర్గాలు నడుచ కోవాలని సూచించారు. ఘర్షణ పడవద్దన్నారు. విషయం తెల్సుకొన్న కుత్బుల్లాపూర్ తహసిల్దార్ సిబ్బందితో పాటు అక్కడికి చేరుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలని చెప్పారు. మొత్తం భూమంతా తమదే అంటూ ఎమ్మెల్యేలు వాదించారు.



పరిస్థితులు అదుపు తప్పుతుండటంతో ఎమ్మెల్యేలు ఇద్దరినీ పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కక్ష సాధింపు చర్యలే**

ప్రభుత్వం తమపై గత కొంత కాలంగా కొనసాగిస్తున్న కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమ స్థలంలో ప్రవేశించి ఆక్రమణ యత్నాలు చేయటం అంటూ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి ఆరోపించారు. సర్వే నంబరు 82,83లోని పూర్తి స్థలం తమదే అని, గత 11 సంవత్సరాలుగా తమ అధీనంలోనే ఉందని, ఆకస్మికంగా ఈ స్థలం తమదే అంటూ శుక్రవారం అర్ధరాత్రి దాటాకా ప్రత్యర్థులు ఆ స్థలంలోకి ప్రవేశించి అక్కడ ఉన్న తమ నిర్మాణాలను కూలగొట్టి ఫెన్సింగ్ పనులు చేపట్టారని, ఈ విషయాన్ని తెల్సుకొన్న తాము ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళితే సిబ్బంది లేరంటూ సమాధానమిచ్చారన్నారు. దీంతో ఏమీ చేయలేక తామే పరిష్కరించుకొందామని తమ స్థలం వద్దకు చేరుకొన్నామన్నారు. ఇరువర్గాల మధ్య చెలరేగిన ఉద్రిక్తత పరిస్థితులను అదుపు చేసే క్రమంలో అక్కడికి భారీ సంఖ్యలో చేరుకొన్న ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా తమ భూమికి రక్షణ కల్పిస్తామంటూ లిఖిత పూర్వకంగా రాసి ఇస్తేనే తాను వస్తానంటూ భీష్మించుకొని కూర్చొన్నారు.

## లక్ష్మిభాయి గురుకుల బాలికల ప్రభంజనం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లి ప్రభుత్వ సంఘం లక్ష్మి బాయి గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు ఇఎపిసెట్ ర్యాంకులో బైపిసి విద్యార్థులు 17మంది విద్యార్థులు సాధించారు. అందులో ఆరుగురు పదివేలలోపు ర్యాంకు సాదించారు. ఎన్ రాధ 85.82 మార్కులతో 2,544 ర్యాంకు టాపర్‌గా నిలిచారు. రెండోర్యాంకు భార్గవి 79.17 మార్కులతో 4,804, మూడో ర్యాంకు డి.అశ్వీత 76.5 మార్కులతో 6,149 ర్యాంక్ సాదించింది. పదివేల లోపు జి. జాగృతి,8,222, ఎస్ తనుశ్రీ 8954,ఆశ్వీత 9,924, సారిక 10,625, పావని 12,495, కె.అక్షిత 12,936, త్రిష 14,981, యు విద్య 15,854, సి.అశ్విని 17,067, హరిణి 17,733, ఎల్.స్నేహ 28,472 సెట్‌లో ర్యాంకులు సాదించి విద్యాప్రతిభను చాటుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ జి రమణమ్మ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



Group : BIPC
NAVALAGARI RADHA



Group : BIPC
BOINI BHARGAVI

## 24 నుండి ఇంటర్ అడ్వాన్స్ పరీక్షలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఇంటర్‌మీడియట్ బోర్డు అధికారి కిషన్, ఎసిపి చంద్రకుమార్, సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి సతీష్, పోస్టల్ విభాగ అధికారి సంపత్‌రెడ్డి తదితర విభాగ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 89పరీక్షా కేంద్రాల్లో 50443 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని, వీరిలో 36940 మంది మొదటి, 13503 మంది విద్యార్థులు రెండవ సంవత్సర పరీక్షలకు ఉన్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి మ ధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు ఉంటాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌళిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

## కన్యకాపరమేశ్వరి జయంతి



**ప్రజాపక్షం/చర్లపల్లిః** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతిని పురస్కరించుకుని ఇసీఐఎల్ చౌరస్తా సాయిబాబా దేవాలయ అవరణలో మేడ్చల్ జిల్లా వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో పులిహోర,మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజుగుప్తా,ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్‌గుప్తా,కోశాధికారి తిరుమలేష్‌గుపుప్తా,గంప కృష్ణ,చక్రపాణి,నాగేశ్వరరావు, తాటి శ్రీనివాస్‌గుప్త, అశోక్‌గుప్తా, నవీన్‌గుప్తా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలాజి వేంకటేశ్వర కల్యాణం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీ బాలాజి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, భాజా బజంత్రీలతో, భక్తుల నామస్మరణతో అలివేలు పద్మావతి సమేతా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండవగా అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అనంతరం మాజి జడ్పిటిసి కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, జడ్పిటిసి హరివర్ధన్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మండల ప్రెసిడెంట్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మాజి చైర్మన్ మైసయ్య, ఎంపిటిసి హన్మంతరెడ్డి, వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వంగ లక్ష్మారెడ్డి, వెంకటరమణరెడ్డి, గౌనె మహేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి,ఆర్ఐ నరేష్, కృపాకర్ రెడ్డి, భూమేష్‌గౌడ్, రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్‌పాయిజన్‌తో ఒకరికి అస్వస్థత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండల కేంద్రంలో వైన్స్ వద్ద అమ్ముతున్న చిరుతిండితో ఒకరు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన ఒక వ్యక్తి వైన్స్ వద్ద దుకాణంలో చేపల ఫ్రై తీసుకుని తిన్నాడు. దీంతో అతడికి వెంటనే వాంతులు అయ్యాయి. ఫుడ్‌పాయిజన్ కావడంతో పాడైపోయిన మురిగిపోయిన చేపలను విక్రయిస్తున్నారని బాధితుడు షాపు యజమానితో వాగ్వాదానికి దిగారు. నాణ్యమైన ఫుడ్‌ను అమ్మకుండా పాడైపోయిన చిరుతిండ్లను నిలవ ఉంచి అమ్ముతున్న దుకాణంపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## వాసవి కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు



**ప్రజాపక్షం / కొడంగల్ :** శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా కొడంగల్ పట్టణంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి మహలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు అడుగుల భజన సాంస్కృతిక కార్యక్రమాలతో ఆర్యవైశ్య వర్ధక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వాసవిమాత సన్నిదిలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రములు అలంకరించి అష్టోత్తర సహస్ర నామ పూజలు, పారాయణం, నిర్వహించారు. ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కట్కం శివకుమార్‌గుప్త సమక్షంలో అమ్మవారి పల్లకి సేవ నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘంసభ్యులు, మహిళ సభ్యులు పాల్గోన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

జిల్లాఅదనపుకలెక్టర్ లింగ్యానాయక్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని పెద్దముల్ మండలం మంబాపూర్, తాండూర్, మండల చెనుగోల్ ,యాలాల్ మండలం బెన్నూర్ ,బొమ్మరాస్ పేట్ మండలం తంకిమెట్ల లోని వరి కొనుగోలు కేంద్రాలనుఅదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో ముఖాముఖీ మాట్లాడుతూ రైతులు పండించిన గిట్టుబాటు ధరను చెల్లిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు తావు ఇవ్వకుడదని అయాన భరోసా ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి ధాన్యాన్ని సేకరించాలని వరి కొనుగోలు కేంద్రాల ఇన్చార్జ్‌లను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లర్లుకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యాన్ని లారీలో ఎత్తేందుకు వీలుగా కూలీల సంఖ్యను పెంచుకోవాలని అయన సూచించారు. ధాన్యాన్ని సేకరించిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌ప్రోక్యూర్ మెంటు మేనేజ్మెంట్ సిస్టంలో పోందుపరచాలని తెలిపారు. వరి ధాన్యాంను శుభ్రపరిచి తేమ వాతాన్ని దృష్టిల పెట్టుకోని వరి సేకరణ కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫర అధికారి రాజేశ్వర్ డిసిఎంఎస్ మేనేజర్ తదితరులు పాల్గోన్నారు.

# ఇంత అధ్వానంగా ఎలా ఉంటున్నారు..

పరిగి మార్కెట్‌ను పరిశీలించిన ఎంఎల్ఎ రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం /పరిగి:** చిన్నపాటి వర్షానికి కూరగాయాల మార్కెట్ చిత్తడిచిత్తడిగా మారి అందులోనే వ్యాపారస్థులు తమ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుండటంపై ఎంఎల్ఏ ఆసహానం వ్యక్తం చేశారు. ఇటీవలే కురిసిన చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారిన కూరగాయాల మార్కెట్‌ను శనివారం ఎంఎల్ఏ ఆకస్మికంగా పర్యటించి మార్కెట్‌లో వ్యాపారస్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మట్టిబురదలోనే మహిళలు కూర్చోని కూరగాయాలు అమ్ముకుంటుండంతో ఎంఎల్ఏ ఆసహానం వ్యక్తం చేస్తు సంబందిత శాఖ అధికారులపై మండిపడ్డారు. వెంటనే కూరగాయాల మార్కెట్‌ను ఆధునీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలని మార్కెట్‌లో ఎవ్వరు కూడా ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లోకి రావాలంటే భయం అవుతుందని ఎక్కడ ఏ ప్రమాదం వస్తుందో ఏ వాహనాలు ఇరుక్కుపోతాయోనని వ్యాపారస్థులు అవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

# వర్షాకాల ప్రణాళికకు సిద్ధం కావాలి



జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాల ప్రణాళికకు సన్నద్ధం కావాలని జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఈ మేరకు వర్షాకాల ప్రణాళిక సన్నద్ధతపై ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అనుకున్న దాని కంటే ముందే, రుతుపవనాలు వచ్చే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా అధికారులు అప్రమత్తం కావాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి భద్రత సామగ్రి, రెయిన్ కోట్స్ సరిపడా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. ఒక వేళ సామగ్రి అవసరం అయితే ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. ఎయిర్‌టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వచ్చే వారం నుంచే క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే అన్ని పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, డైరెక్టర్ ఆపరేషన్స్1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్,డైరెక్టర్‌ఆపరేషన్స్ 2 స్వామిపాల్గొన్నారు.

## ఇక టిజి ఎస్‌పిడిసిఎల్..ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ సంక్షిప్త పదాన్ని టిఎస్‌కు బదులు టిజిగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ కీలక ఆదేశాలు జారీ చేసిన క్రమంలో విద్యుత్‌శాఖ కూడా టిఎస్ ఎస్‌పిడిసిఎల్, టిఎస్ ఎన్‌పిడిసిఎల్ సంస్థలు తమ పేర్లను టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్‌గా మార్చుకున్నాయి. అంతే కాకుండా జిఓలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్లలో టిజిగా ఉండాలని ఈ దిశగా చర్యలు తీసుకోవాలని టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషరఫ్ ఫారూఖీ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటానమస్ విభాగాలన్నీ ఈ ఆదేశాలన్ని పాటించనున్నాయని, అందుకు అనుగుణంగా తాము పాటిస్తామని పేర్కొన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని బిసి జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ డిమాం డ్ చేశారు. రిజర్వేషన్లు పెంచనట్లయితే సచివాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో శనివారం బిసి సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో బిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బిసి టైమ్స్, బిసి సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు, మున్నూరుకాపు సంఘం నాయకులు పురుషోత్తం పటేల్, తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, ఓయు విద్యార్థి నాయకుడు లింగం శాలివాహన, యాదవ సంక్షేమ సంఘం నాయకులు మధు యాదవ్, మల్లేష్ యాదవ్, టీవైజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి హరికృష్ణ యాదవ్, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర నాయకులు కొంపెల్లి రాజు, మల్లేష్, ఆరె కటిక సంఘం నాయకులు సంతోష్ పాల్గొన్నారు. రాజారామ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన చేపట్టి, 42 శాతానికి రిజర్వేషన్లు పెంచి, ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి మాట మార్చడం బిసిలకు అన్యాయం చేయడమేనని రాజారామ్ విమర్శించారు.

## రోడ్డుపక్కనే చెత్త .. పట్టదేమి?

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా చెత్త సేకరణకు ప్రతి గ్రామ పంచాయితీకి ఒక ట్రాక్టర్ ను కొనుగోలు చేశారు. గత ఐదు సంవత్సరాలు తడి పొడి చేత్త వేరు చేసి పారబోసే కార్యాక్రమనికి మంచి స్పందన లభించింది. తడి ,పోడి చేత్త పై గ్రామ పంచాయితీలకు అవార్డులు ఇచ్చారు. గ్రామ పంచాయతీలలో ,మున్సిపల్‌లో ఎక్కడ కుడా సేంద్రియ ఎరువు తయారీ చేయడం లేదని తెలుస్తుంది. తడి పొడి చెత్తను సేకరించి రోడ్ల పక్కనే గుమ్మరించి నిప్పు పెడుతున్నారు. చెత్త ను పారబోయడంపై అధికారులు దృష్టి సారించక పోవడం ద్వారానే ఈ సమస్య ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. గ్రామల్లో చెత్త సేకరించిన తర్వాత గాజుసీసాలు ,ప్లాస్టిక్ బాటిళ్ల, రబ్బరు వస్తువులు ఇలా అన్నిటిని వేసి చేసి డిఆర్‌సి కేంద్రానికి తరలించేవారు. డిఆర్‌సి షేడ్లు తాగుబోతులకు అడ్డాగా మారాయి. కానీ అలాంటి పనులు ప్రస్తుతం గ్రామ పంచాయతీలోగాని మున్సిపల్‌లో గాని కనిపించడం లేదు. ఒక చోట పారబోసి నిప్పంటిస్తూ కాల్చివేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తడి పొడి చేత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి గ్రామ పంచాయితీలు అదర్శంగా నిలిచాయి. ప్రస్తుతం ఈ కార్యక్రమం పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## వర్షాకాలానికి ముందే విద్యుత్ లైన్ల మరమ్మతులు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** వర్షాకాలం ప్రారంభానికి ముందే విద్యుత్ లైన్ల మరమ్మతులను పూర్తిచేసే దిశగా తెలంగాణ విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ఒక్కో ఫీడర్ పరిధిలో అరగంట విద్యుత్ సప్లైని బంద్ చేసి పనులు చేపడుతోంది. ఈమేరకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మరమ్మతులు చేసుకునేందుకు వీలుగా ఎల్‌సి (లైన్ క్లియరెన్స్) ఇచ్చేందుకు విద్యుత్ శాఖ ఈ మేరకు శనివారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో శని, ఆదివారాల్లో గ్రేటర్ జోన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కరెంట్ కోతలు ఉండనున్నాయి. ఎల్‌సి తీసుకున్న సమయంలోనే ఆయా ఫీడర్ పరిధిలో సిబ్బంది మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించే చర్యలు చేపట్టాలని టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు.

**71 ఎంయు లకు పడిపోయిన డిమాండ్**

కాగా వర్షాలతో ఎండల తీవ్రత కాస్త తగ్గింది. శుక్రవారం గ్రేటర్లో పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 32 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మే 4న అత్యధికంగా 90.68 మిలియన్ యూనిట్ల(ఎం.యూ) విద్యుత్డిమాండ్ నమోదు కాగా, శుక్రవారం 71 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## సబ్సిడీ పథకానికీ రూ.25లక్షలు

**ప్రజాపక్షం /హైదారబాద్ :** న్యాయవాదుల సబ్సిడీ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆర్థిక శాఖ రూ.25 లక్షల నిధులను విడుదల చేసింది. ఇందుకు సంబంధించి శనివారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను మూడు నెలలకు సంబంధించి మొదటి విడుతగా రూ.25 లక్షల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించింది. ఈ పథకానికీ ప్రభుత్వం మొత్తం రూ.33.33 లక్షలను కేటాయించగా, ఇందులో రూ.25లక్షల నిధులను విడుదల చేయగా, రూ.8.33 లక్షలు మిగిలి ఉన్నాయని జిఓలో పేర్కొంది. ఈ నిధులను వినియోగించుకునేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని వెనకబడిన కూలాల కమిషనర్‌ను ఉత్తర్వులలో ప్రభుత్వం ఆదేశించింది.

## నేటి నుంచి లక్ష్మీవెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 22 వరకు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ధ్వజారోహణము, బ్రహ్మోత్సవ అంకురార్పణ, 20న పూర్ణాహుతి, అన్నదానం, 21న శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణము, 22న రథోత్సవం, శ్రీసత్య నారాయణస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ఇంటర్న్‌షిప్

ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

స్వేచ్ఛ వ్యవస్థాపకుడు కిరణ్ చంద్ర



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నట్లు స్వేచ్ఛ వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐఐఐటి హైదరాబాద్, ఓజోన్టెల్ కమ్యూనికేషన్స్, మెటా సహకారంతో చేపట్టామన్నారు. శనివారం ఈ మేరకు హైదరాబాదు గచ్చిబౌలిలోని స్వేచ్ఛ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ వేసవిలో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , 'సమ్మర్ ఆఫ్ ఏఐ'పై ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. లక్ష మంది విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ట్రిపుల్ ఐటి హెచ్, ఓజోనెల్, స్వేచ్ఛ సంయుక్తంగా శ్రీకారం చుట్టాయన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ తొలి బ్యాచ్ లోనే పదివేల మందితో ప్రారంభమయ్యిందన్నారు. భాషా సుసంపన్నమైన మన తెలుగు సంపదను ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా ఒక్కో విద్యార్థితో కనీసం యాభై మంది ని ట్రెనింగును పొందనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఓజోన్టెల్ కమ్యూనికేషన్స్ సిటిఓ చైతన్య చొక్కారెడ్డి, స్వేచ్ఛ సెక్రటరీ ప్రవీన్ చంద్ర పాల్గొన్నారు.

## క్రీడ

# చెన్నై ఇంటికి.. ప్లేఆఫ్స్‌కు బెంగళూరు



**బెంగళూరు:** విజయంతో బెంగళూరు ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లగా, చెన్నై టోర్నీ నుంచి నిష్క్రమించింది. కీలక పోరులో బెంగళూరు 27 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. డుప్లెసిస్ (54), కోహ్లీ (47), పటీదార్ (41), గ్రీన్ (38) చెలరేగారు. చెన్నై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 2, దేశ్‌పాండే 1, శాంట్నర్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (61), రహానె (33), జడేజా (42*), ధోనీ (25) రాణించారు. బెంగళూరు బౌలర్లలో దయాల్ 2, మాక్స్‌వెల్ 1, ఫెర్గూసన్ 1 వికెట్ తీశారు.

# ఎంఎస్ ధోనీతో ఆడడం ఇదే చివరిసారి



**న్యూఢిల్లీ :** చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపిఎల్ రిటైర్‌మెంట్‌పై చాలా కాలంగా రూమర్స్ వస్తున్నాయి. తాజాగా కోహ్లీ కామెంట్స్ ఈ రూమర్స్‌కు మరింత బలం చేకూరుస్తున్నాయి. శనివారం ప్లేఆఫ్స్ కోసం చెన్నై, బెంగళూరు తలపడడానికి ముందు విరాట్ ఈ కామెంట్స్ చేశాడు. గత 16 ఏళ్లుగా తామిద్దరు చాలాసార్లు డ్రెస్సింగ్ రూమ్‌ను షేర్ చేసుకున్నామని, ధోనీతో ఆడడం ఇదే చివరిసారి అవ్వొచ్చు ఏమోనని కోహ్లీ చెప్పాడు. 'భారత్‌లోని ఏ స్టేడియంలోనైనా ధోనీ ఆడటం అభిమానులకు పెద్ద విషయం. నేను, అతను కలిసి బహుశా ఆడటం ఇదే చివరి సారి కావొచ్చు. చెప్పలేం ఏదైనా జరగొచ్చు. అతడు మరి కొనసాగుతాడో? లేదో? ఎవరికి తెలుసు. మాకు చాలా గొప్ప మెమరీస్ ఉన్నాయి. భారతదేశానికి గొప్ప పార్ట్‌నర్‌షిప్‌లు నెలకొల్పాం. మేం ఇద్దరం కలిసి ఆడటాన్ని అభిమానులు ఎంజాయ్ చేస్తారు. చాలా ప్రత్యేకంగా భావిస్తారు.' అని విరాట్ పేర్కొన్నాడు. కాగా, మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన 2019 ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో కోహ్లీ, ధోనీ చివరిసారిగా కలిసి ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడారు.

**విమర్శలపై స్పందన:** విమర్శలను ఎదుర్కోవడం గురించి కూడా కోహ్లీ మాట్లాడాడు. '42 ఏళ్ల ధోనీకి కూడా తన జట్టును గెలిపించడంలో ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. చాలా మంది మహీ ఎందుకు గేమ్‌ని 20వ ఓవర్ లేదా 50వ ఓవర్‌కు తీసుకెళ్తాడు అంటారు. కానీ ఇలానే మహీ ఇండియాకి ఎన్నో మ్యాచ్‌లు గెలిపించాడు. ఏం చేస్తున్నామో తెలిసిన ఏకైక వ్యక్తి మహీ. మ్యాచ్‌ను చివరి బాల్ వరకు తీసుకెళ్తే తన జట్టును గెలిపించగలనని అతనికి తెలుసు.' అని విరాట్ చెప్పాడు.

**ప్లేఆఫ్స్‌కి ఎవరు?:** పాయింట్స్ చెన్నై 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. 12 పాయింట్లతో ఆర్‌సిబి ఏడో స్థానంలో ఉంది. రెండు జట్లు ప్లేఆఫ్స్‌లో తమ బెర్త్‌ను బుక్ చేసుకోవాలని చూస్తున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టాప్ 4లో చేరాలంటే చెన్నైని 18 పరుగుల తేడాతో ఓడించాలి లేదా 11 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించాలి. చెన్నైకి ఈ సమీకరణాలు అవసరం లేదు. మ్యాచ్ గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్‌కు చేరుతుంది.

# ఆ రోజే అమెరికాకు టీమ్ ఇండియా ప్లేయర్స్!

**న్యూఢిల్లీ :** టీ 20 ప్రపంచ కప్ దగ్గర పడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే జట్లన్నీ తమ ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లను చేసుకుంటున్నాయి. వీరిలో టీమ్ ఇండియా కూడా ఉంది. అయితే ప్రస్తుతం ఐపిఎల్ జరుగుతున్న నేపథ్యంలో ప్లేయర్స్ అందరూ కలిసి ఒకేసారి వరల్డ్ కప్ వేదికైనా అమెరికా న్యూయార్క్ వెళ్లట్లేదు. ఐపిఎల్‌లో ఎలిమినేట్ అయిన జట్లలోని ఆటగాళ్లు మాత్రమే మే 25న వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మిగితా వారు మే 26న ఫైనల్ ఆడి ఆ తర్వాత బయలు దేరనున్నారు. వాస్తవానికి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించని జట్లలోని ప్లేయర్స్ మే 21న న్యూయార్క్ వెళ్లాల్సి ఉంది. కానీ ప్రయాణ షెడ్యూల్‌లో మార్పులు జరగడం వల్ల మే 25న మొదటి బ్యాచ్ వెళ్తున్నట్లు తెలిసింది. వీరిలో కెప్టెన్ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ వంటి కొంతమంది ప్లేయర్స్ సహాయక సిబ్బందితో కలిసి మే 25న బయలుదేరే అవకాశం ఉందని బిసిసిఐ వర్గాలు తెలిపాయి. ఐపిఎల్ ఫైనల్లో పాల్గొన్న జట్లలోని ఆటగాళ్లు మాత్రం ఇక్కడే ఉండి మే 27న న్యూయార్క్ కు బయలుదేరుతారు. అలాగే బంగ్లాదేశ్‌తో సన్నాహక మ్యాచ్‌కు ముందు కనీసం మూడు నుంచి నా లుగు నాణ్యమైన నెట్ సెషన్లను జరగనున్నాయి అ ని పేర్కొన్నాయి. కాగా, ఈ టోర్నీలో 20 దేశాలు తలపడుతున్నాయి. ఈ 20 జట్లను నాలుగు గ్రూ పులుగా విభజించి లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. యూఎస్ఏ, కెనడా, యుగానా ఈ పొట్టి ప్రపంచకప్‌లో ఆడడం ఇదే మొదటి సారి. జూన్ 2 నుంచి 30 వరకు టోర్నీ జరగనుంది. జూన్ 5న న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో భారత్ తమ మొ దటి మ్యాచ్ ఆడనుంది. తర్వాత జూన్ 9న పాకిస్థాన్‌తో మ్యాచులో తలపడనుంది.

**భారత జట్టు వివరాలు**

రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బూమ్రా, మహ్మద్ షమీ, సిరాజ్.



# నాని సుజీత్ మూవీపై మరో పుకారు!

నాచురల్ స్టార్ నాని గతేడాది దసరా, హాయ్ నాన్న చిత్రాలతో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. ఈ హీరో తదుపరి వివేక్ ఆత్రేయ దర్శకత్వం లో తెరకెక్కుతున్న సరిపోదా శనివారం చిత్రం లో కనిపించనున్నారు. ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం తరువాత నాని చేస్తున్న ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజీత్ తో. ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్స్ మెంట్ వీడియో తోనే అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రం ప్రకటన తోనే పాజిటివ్ వైబ్స్ ను సొంతం చేసుకుంది. అయితే ఈ చిత్రం పై పలు రూమర్స్ వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే బడ్జెట్ కారణాల వలన సినిమా ఆగిపోయింది అని కొందరు చెబుతుండగా, ఇప్పుడు మరొక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రం ను నిర్మించేందుకు సితార ఎంటర్‌టైన్మెంట్స్ మరియు నిహారిక ఎంటర్ టైన్మెంట్స్ ముందుకి వచ్చినట్లు సమాచారం. సోషల్ మీడియాలో ఈ న్యూస్ విపరీతం గా వైరల్ అవుతోంది. అయితే వీటిపై క్లారిటీ రావాలంటే, మేకర్స్ నుండి అధికారిక ప్రకటన వెలువడాలి.

## రీల్

# బాలయ్య సినిమాలో లేడీ విలన్

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బాబీ కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఐతే, ఈ సినిమా లో నటి శ్రియా రెడ్డి ఓ కీలక పాత్ర పోషిస్తోందని తెలుస్తోంది. శ్రియా రెడ్డి .. నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రలలో నటించి మంచి పేరు తెచ్చుకుంది. పైగా సలార్ తర్వాత ఆమె రేంజ్ పెరిగింది. మరి ఇప్పుడు బాలయ్య సినిమాలో శ్రియా రెడ్డి ఏ స్థాయిలో తన విలనిజాన్ని చూపిస్తోందో చూడాలి. అన్నట్టు వచ్చే షెడ్యూల్ లో శ్రియా రెడ్డి ఈ సినిమా షూట్ లో జాయిన్ కానుంది. ఇక ఈ సినిమాలోని యాక్షన్ విజువల్స్ కూడా వండర్ ఫుల్ గా ఉంటాయట. ముఖ్యంగా బాలయ్య గెటప్ అండ్ సెటప్ చాలా థ్రిల్లింగ్ గా ఉంటుందట. కాగా ఈ చిత్రంలో ఊర్వశి రౌటేలా, బాబీ డియోల్, చాందిని చౌదరి మరియు ఇతరులు ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై నాగ వంశీ, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాపై సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.



# సూపర్ హీరో నిర్మాణ సంస్థతో సిద్ధార్థ్ సినిమా



కోలీవుడ్ టాలెంటెడ్ హీరో సిద్ధార్థ్ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం చిన్నా తో మంచి హిట్ అందుకోగా తెలుగులో కూడా మరోసారి మంచి బజ్ ని తాను అందుకున్నాడు. అయితే ఇప్పుడు సిద్ధార్థ్ లేటెస్ట్ గా కొత్త ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేసాడు. కోలీవుడ్ లో టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ తో ఇంట్రెస్టింగ్ సూపర్ హీరో చిత్రం మహావీరుడు చేసిన నిర్మాణ సంస్థ శాంతి టాకీస్ వారు కాంబినేషన్ లో చేయబోతున్నట్టుగా ఇప్పుడు అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని దర్శకుడు శ్రీ గణేష్ వర్క్ చేయనుండగా ఈ చిత్రం సిద్ధార్థ్ కెరీర్ లో 40వ సినిమాగా తెరకెక్కనుంది. అయితే ఈ చిత్రాన్ని కూడా ఒక గ్లోబల్ రీచ్ ఉండే కాన్సెప్ట్ తోనే తెరకెక్కిస్తున్నట్టుగా తెలుపుతున్నారు. అలాగే ఈ జూన్ నుంచే సినిమా స్టార్ట్ కానున్నట్టుగా వినిపిస్తుంది. అలాగే ఇతర కాస్ట్ సహా సాంకేతిక వర్గం సంబంధించిన వివరాలు ముున్ముందు రానున్నాయి.

# పీఎం మోదీ బయోపిక్‌లో తమిళ నటుడు!



కోలీవుడ్ పరిశ్రమ నుండి పెద్ద వార్త ఏమిటంటే, విలక్షణ నటుడు సత్యరాజ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బయోపిక్లో నటించనున్నారు. ప్రధాని జీవితంపై సినిమా తీయడం ఇది మొదటి ప్రయత్నం కాదు. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ 2019 లో PM నరేంద్ర మోడీ లో నరేంద్ర మోడీగా నటించారు. అయితే ఈ చిత్రం ఎవరికీ తెలియదు మరియు బాక్సాఫీస్ వద్ద గుర్తించబడలేదు. సత్యరాజ్ భారత ప్రధానిగా కనిపించనున్న ఈ సినిమా ఈ ఏడాది సెట్స్ పైకి వెళ్లనుంది. అయితే దర్శకుడు, నిర్మాత, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. బాహుబలిలో కట్టప్పగా తన అద్భుతమైన నటన తర్వాత, ప్రముఖ నటుడు బహుళ పరిశ్రమలలో చాలా బిజీగా మారాడు.

# దేవాలయాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి : ఇస్రో చైర్మన్



**తిరువనంతపురం:** యువత ప్రార్థనా స్థలాలకు రావడానికి ఆసక్తి చూపించాలంటే దేవాలయాల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేయాలని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో ) చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. ఈ విధంగా గ్రంథాలయాల ఏర్పాటుతో యువతను ఆకర్షించవచ్చని ఆయన సలహా ఇచ్చారు. తిరువనంతపురంలోని శ్రీ ఉడియన్నూర్ దేవి ఆలయం సభ్యులు సోమనాథ్‌ను సన్మానించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ జి.మాధవన్ నాయర్ ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. అనంతరం సోమనాథ్ మాట్లాడుతూ 'ఈ అవార్డు ప్రదానోత్సవానికి యువకులు పెద్దసంఖ్యలో వస్తారని నేను ఊహించాను. కానీ వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఆలయ నిర్వాహకులు వారిని దేవాలయాల వైపు ఆకర్షించడానికి కృషి చేయాలి. ఇందుకోసం దేవాలయాల్లో లైబ్రరీలను ఎందుకు ఏర్పాటుచేయకూడదు?' అని ఆయన ప్రశ్నించారు. ఆలయాలు కేవలం వృద్ధులు వచ్చి దేవుడిని తలుచుకునేవిగానే కాకుండా సమాజాన్ని మార్చే ప్రభావవంతమైన ప్రదేశాలుగా మారాలని ఆయన పేర్కొన్నారు. ఈవిధంగా చొరవ తీసుకోవడం వల్ల ధార్మిక విషయాలు తెలుసుకోవాలని ఆసక్తి ఉన్నవారు, ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలనుకునేవారు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతారని ఆయన తెలిపారు. సాయంత్రం వేళల్లో వివిధ అంశాలపై చర్చలు ఏర్పాటుచేస్తే యువకులు తమ అభివృద్ధికి బాటలు వేసుకునేందుకు దోహదపడుతుందని సోమనాథ్ విశ్వాసం వ్యక్తంచేశారు. ఆలయ నిర్వాహకులు ఆ దిశగా కృషి చేస్తే సమసమాజంలో మంచి మార్పులు చోటుచేసుకుంటాయని ఆయన అన్నారు.

# దేశబాలికలకు ప్రాధాన్యతనిస్తానని మోదీ వాగ్దానంను భంగపరిచారు

**న్యూఢిల్లీ :** పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధత, దేశ బాలికలకు ప్రాధానత్యనిస్తానని చేసిన వాగ్దానాలను ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు భంగపరిచారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. హర్యానా రాష్ట్రంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న మోదీకి ఆయన పలు ప్రశ్నలను 'ఎక్స్' ద్వారా సంధించారు. మోదీ ప్రభుత్వ ద్వంద్వ నీతికి హర్యానా రైతులు సంపూర్ణంగా విశ్వాసం కోల్పోయారని జైరామ్ అన్నారు. 2021లో రైతులు తమ నిరసనలను ఉపసంహరించుకున్న సమయంలో వారి డిమాండ్‌లను నెరవేరుస్తానని ప్రధాని మోదీ అన్నారని , కాని మోదీ ప్రభుత్వం వేసిన కమిటీ మందకొడిగా చర్చలు సాగిస్తుండడంతో రైతు మరోసారి వీధులకు ఎక్కాల్సి వచ్చిందన్నారు. మోదీ కా పరివార్, నారీ శక్తి అంటూ నినాదాలు చేసే మోదీ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రజ్వల రేవణ్ణ, బ్రిజ్‌భూషన్ వంటి వారికి రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు.

# భారతీయ స్పైస్‌మిక్స్ ఉత్పత్తులపై నేపాల్ నిషేధం

**కాఠ్మాండూ :** సింగపూర్, హాంకాంగ్ తరువాత నేపాల్ భారతీయ బ్రాండ్లు తయారు చేసిన కొన్ని రకాల స్పైస్‌మిక్స్ ఉత్పత్తుల అమ్మకాన్ని, దిగుమతిని నిషేధించింది. ఆ ఉత్పత్తుల నాణ్యతపై అనుమానాలే ఇందుకు కారణం. ఎథిలీన్ ఆక్సైడ్ (ఇటిఒ) కల్తీ అయిందనే అనుమానంతో ఎండిహెచ్, ఎవరెస్ట్ స్పైస్‌మిక్స్ ఉత్పత్తులు నాలుగింటిని నేపాల్ నిషేధించినట్లు ఖాట్మండులోని ఆహార టెక్నాలజీ, నాణ్యత నియంత్రణ విభాగం తెలియజేసింది. నేపాల్‌లో ఈ నిషేధిత ఉత్పత్తుల జాబితాలో ఎండిహెచ్ మద్రాస్ కర్రీ పౌడర్, సాంబార్ మిక్స్‌డ మసాలా పౌడర్, మిక్స్‌డ మసాలా కర్రీ పౌడర్, ఎవరెస్ట్ ఫిష్ కర్రీ మసాలా ఉన్నాయి. సింగపూర్, హాంకాంగ్ క్రితం నెల వాటిని నిషేధించాయి.

# 'ఇండియా' కూటమిదే గెలుపు : టిఎంసి కీలకపాత్ర

## బిజెపి మట్టి కరుస్తుంది
## ఎన్నికల ర్యాలీలో మమతాబెనర్జీ



**గోఘాట్ (పశ్చిమ బెంగాల్) :** లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి కనీసం 200 సీట్లు కూడా గెలుచుకోలేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. జూన్ 4 వ తేదీన ఎన్నికల ఫలితాల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని ఆమె అన్నారు. బిజెపికి మొత్తం కలిపితే 200 సీట్లు కూడా రావు, ఆ పార్టీ ఇక మట్టి కరవాల్సిందే'' అని మమతా బెనర్జీ అన్నారు. కేంద్రంలో 'ఇండియా' కూటమిలో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ కీలకమైన పాత్ర నిర్వహిస్తుందని ఆమె చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌ఆర్‌సి, ఉమ్మడిపౌరస్మృతి వంటి వాటిని రద్దు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేసి, దేశ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసేందుకు మోడీ ప్రయత్నం చేస్తున్నారని ఆమె హెచ్చరించారు. మోడీ, అమిత్ షా ఎన్నికల ప్రచారంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లోని అరంభాగ్ లోక్‌సభ నియోజకవర్గంలోని గోఘాట్‌లో శనివారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిదే విజయమన్నారు. అదేసమయంలో ఆమె కాంగ్రెస్, వామపక్షాలపై కూడా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్–సిపిఐ(ఎం) ద్వయం పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వానికి నష్టం కలిగించేందుకు బిజెపితో సంబంధాలు పెట్టుకున్నాయన్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి తప్ప రాష్ట్రంలో ఏ ఇతర పార్టీకీ ఓట్లు వేయవద్దని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు తప్ప ఏ ఇతర పార్టీకి ఓటు వేసినా అది కాషాయ కూటమికే లాభం కలిగిస్తుందని అన్నారు. 'ఇండియా' ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర వహిస్తుందన్నారు. ''ఇండియా కూటమి పేరు పెట్టిందే నేను, దేశంలో నియంతృత్వ మోడీ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు జాతీయస్థాయిలో ఈ కూటమి తరపున భాగస్వామ్యపార్టీలన్నీ కలిసి పోరాటం చేస్తున్నాయి, 'ఇండియా' కూటమి అధికారంలో ప్రతిష్ఠంపజేయడంలో తృణమూల్ కాంగ్రెస్ కీలకపాత్ర వహిస్తుందని అన్నారు. ''చూడండి మోడీ ఏం చెబుతున్నారో, 400 సీట్లు వస్తాయన్నారు, ఇక ఆయన అలాంటి పెద్ద ప్రకటనలు చేయడంలేదు, ఆయనకు అన్నీ తెలిసిపోయాయి, ఆ పార్టీ మట్టి కరవాల్సిందే'' అన్నారు. సిపిఐ(ఎం)పై తీవ్రస్థాయిలో ఆమె విమర్శలు చేశారు. అదేవిధంగా నరేంద్రమోడీ, అమిత్ షా ఇద్దరూ పశ్చిమ బెంగాల్ వ్యతిరేకులని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌మీద అపారమైన ప్రేమ కురిపిస్తూ మోడీ పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నారు, కానీ దానివల్ల ఆయనకు ఒరిగేదేమీ లేదు, ఒక్కసీటు కూడారాదు అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం ద్వారా ప్రయోజనం పొందాలని మోడీ, అమిత్ షా ప్రయత్నం చేస్తున్నారన్నారు. సందేశ్‌ఖలీలోని ఆలయాల్లో విగ్రహాలు తొలగించి ప్రజల్లో ఘర్షణలు తేవాలని బిజెపి ప్రయత్నం చేస్తోందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ హెచ్చరించారు. గడచిన ఎన్నికల్లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోడీ బూటకపు వాగ్దానాలు చేశారనీ, ఇప్పటికి పది కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఎన్ని ఉద్యోగాలు ఇంత వరకూ ఇచ్చారో చెప్పాలనీ, అయన మాటలవన్నీ వట్టి జుమ్లా అనీ అన్నారు.

# కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ అరెస్ట్

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో తనపై దాడి జరిగిందంటూ ఆ పార్టీ ఎంపి స్వాతి మాలీవాల్ చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, సిఎం వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను నిందితుడిగా పేర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా అతడిని అరెస్టు చేశారు. శనివారం మధ్యాహ్నం కేజ్రీవాల్ నివాసానికి వెళ్లిన ఢిల్లీ పోలీసు బృందం.. బిభవ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌ను తరలించింది. అనంతరం అరెస్టు చేసినట్లు పోలీసులు అధికారికంగా వెల్లడించారు. మే 13వ తేదీన సిఎం నివాసంలో జరిగిన ఈ ఘటన గురించి ఇటీవల స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బిభవ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. నెలసరి నొప్పితో బాధపడుతున్నానని చెప్పినా.. తనపై విచక్షణారహితంగా, పలుమార్లు దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో తాను తీవ్రంగా గాయపడ్డానని, నడవడం కూడా కష్టంగా ఉందని అన్నారు. అయితే, ఈ ఆరోపణలను బిభవ్ ఖండించాడు. ముందస్తు అనుమతి లేకుండా స్వాతి సిఎం నివాసంలోకి దూసుకొచ్చారని, అడ్డుకున్న తనతో అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపించారు. బిభవ్ కూడా ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల వేళ సిఎం నివాసం నుంచి స్వాతిని బయటకు పంపిస్తున్న వీడియోను ఆమ్ ఆద్మీ పార్టీ విడుదల చేసింది. ఇదిలా ఉండగా మరోవైపు ఈ కేసులో వైద్య నివేదిక కీలకంగా మారింది. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో స్వాతి మలివాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. మే 16వ తేదీ రాత్రి స్వాతి మాలీవాల్‌ను పరిశీలించిన తర్వాత వైద్య బృందం నివేదికను పోలీసులకు సమర్పించింది. వైద్య బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం స్వాతి మాలీవాల్‌కు ఎడమ కాలు, కుడి చెంపపై గాయాలు ఉన్నాయని వెల్లడైంది.

# ప్రగతి, అభివృద్ధి దిశగా ఢిల్లీ, యుపికి రాయ్‌బరేలీ దారి చూపించాలి

**న్యూఢిల్లీ:** ప్రగతి, అభివృద్ధి దిశగా దేశానికి, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి రాయ్‌బరేలీ మరోసారి దారి చూపించాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. గతంలో రాష్ట్రానికి ఈ ప్రాంతం సైద్ధాంతిక, రాజకీయ కేంద్రంగా ఉండేదని గుర్తు చేశారు. తన చెల్లి ప్రియాంక గాంధీతో కలసి తీసిన వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో శనివారం నాడు షేర్ చేశారు. రాయ్‌బరేలి నియోకజవర్గం నుండి పోటీ చేస్తున్న రాహుల్ గాంధీ తన చిన్నతనంలో అక్కడి నుండి వెళ్లిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భారత ప్రగతికి దిశను నిర్దేశించడంలో రాయ్‌బరేలి ముఖ్యపాత్ర ఉన్నదని, ఇది ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయ , సైద్ధాంతిక కేంద్రంగా అనేక సంవత్సరాలు కొనసాగిందని, స్వాతంత్ర్యపోరాటానికి మార్గం చూపిందని నాలుగు నిమిషాల వీడియో సందేశంలో రాహుల్ పేర్కొన్నారు. తన కుటుంబం అంటే తనకు గౌరవమని, కుటుంబసభ్యులు అందరితో మంచి సంబంధాలు ఉన్నాయని, వాటి మధ్యలో రాజకీయాలు రాని వ్వబోనని చెప్పారు. మనం రాజకీయాలల్లో ఉన్నప్పుడు , మన కుటుంబాన్ని గౌరవించకపోతే, కుటుంబంతో స ంబంధాలు సరిగా లేకపోతే, బైట కూడా సరైన సంబంధాలు ఉండబోవని అన్నారు. మన దైనందిన జీవితంలో అబద్ధం చె బితే, రాజకీయాలలో కూడా అబద్ధాలు చెబుతారని పేర్కొన్నా రు. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో దృష్టి మళ్ళకుండా చూసుకోవాలని, అర్జునుడి లాగా తదేక దీక్షతో చేప కన్నును ల క్ష్యంగా చేసకున్నట్లు ఉండాలని కార్యకర్తలకు ప్రియాంక సూ చించారు. మీ చేతిలో ఉన్న ప్రభావంతమైన ఆయుధం మీ ఓటేనని, దానిని మీ భవిష్యత్తును మార్చేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు.



# కదులుతున్న బస్సులో ఆకస్మిక మంటలు

## 9మంది సజీవ దహనం మరో 24మందికి గాయాలు



**న్యూఢిల్లీ :** హర్యానాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. కదులుతున్న బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి 9మంది సజీవ దహనం అయ్యారు. మరో 24 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి నుహ్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, పంజాబ్ చండీగఢ్‌కు చెందిన 60మంది మధుర, బృందావన్‌ను సందర్శించేందుకు ఓ టూరిస్ట్ బస్సులో వెళ్లారు. తిరిగి వస్తుండగా నుహ్ జిల్లా తావడు పట్టణ సమీపంలోని కుండలీ మానేసర్ పల్వాల్ ఎక్స్‌ప్రెస్‌వే వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 9మంది సజీవ దహనం కాగా, మరో 24 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించామని చెప్పారు. అయితే ఇంకా మృతులు గుర్తించలేదని పేర్కొన్నారు. డ్రైవర్ కూడా మంటలను గమనించలేదని స్థానికులు చెబుతున్నారు. 'అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో బస్సు వెనుక భాగంలో మంటలు ఎగిసిపడుతున్నాయి. ఆ మంటలను చూసిన స్థానికులు బస్సు ఆపాలని కేకలు వేశారు. డ్రైవర్ గమనించుకోకుండా వెళ్తున్నాడు. దీంతో ఓ యువకుడు బైక్‌పై బస్సును వెంబడించి ఆపాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాం. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేశారు. కానీ కొంతమంది బస్సులో కాలిపోయారు' అని స్థానికులు తెలిపారు.